www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 207 | గురువారం | 17 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

మరో అడుగు ఫ్రంట్‌కు

ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్‌తో కెటిఆర్ బృందం భేటీ

- ప్రాంతీయ పార్టీల ఐక్యత, జాతీయ స్థాయిలో రావలసిన మార్పులపై చర్చ
- అనంతరం సంయుక్తంగా మీడియా ముందుకు నేతలు
- కేంద్రం గుప్పిట్లో రాష్ట్రాల ప్రయోజనాలు, అంతా సంఘటితమవుదాం
- దేశంలో గుణాత్మక మార్పు రావాలి
- ఎపికి ప్రత్యేక హోదాపై మా వైఖరి సుస్పష్టం
- త్వరలో విజయవాడకు కెసిఆర్, జగన్‌తో భేటీ : కెటిఆర్
- ప్రత్యేక హోదాకు మా బలం సరిపోవటంలేదు, తెలంగాణ ఎంపిలు కలసి వస్తే కేంద్రంపై మరింత ఒత్తిడి
- ఫెడరల్ ఫ్రంట్‌పై కెసిఆర్ ఆలోచనలను స్వాగతిస్తున్నాం
- ఆయనతో సమావేశం తర్వాత మరింత స్పష్టత : జగన్



మన తెలంగాణ/ హైదరాబాద్

జాతీయ స్థాయిలో రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఫెడరల్ ఫ్రంట్‌లో బుధవా రం మరో అడుగు పడింది. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్‌ను నగరంలోని లోటస్‌పాండ్‌లోని నివాసంలో కలిసి ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చలు జరిపారు. ప్రాంతీయ పార్టీల ఐక్యతపైనా, జాతీయ స్థాయి రాజకీయ వ్యవస్థలో రావాల్సిన గుణాత్మక మార్పుపైనా చర్చించారు. జగన్‌తో చర్చల అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకుని రాష్ట్రాల హక్కులు, అధికారాలను హరిస్తోందని, ఫలితంగా రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. రాష్ట్రాల ప్రయోజనాల కోసం రాష్ట్రాలన్నీ సంఘటితం కావాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. జాతీయ సమాఖ్య స్ఫూర్తికోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గత ఏడాది జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ కూటమి కోసం కాంగ్రెస్, బిజెపిలకు దూరంగా ఉన్న ప్రాంతీయ పార్టీలను కూడ గడుతున్నారని గుర్తుచేశారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ఫెడరల్ ఫ్రంట్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత వైఎస్.జగన్‌తో చర్చలు ప్రారంభమయ్యాయని స్పష్టంచేశారు. జగన్‌కు టిఆర్‌ఎస్ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు స్వయంగా ఫోన్ చేసి ఫెడరల్‌ఫ్రంట్‌పై వివరించారని గుర్తుచేశారు. త్వరలో జగన్‌తో చర్చలు జరిపేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ విజయవాడ వెళ్ళనున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాల అధికారాలను కేంద్రం గుప్పిట్లో ఉంచుకోవడంతో సమస్యలు వస్తున్నాయని, వీటిని కాపాడుకోవడానికి ఫెడరల్ ఫ్రంట్ ఏకైక ప్రత్యామ్నాయమని, అందుకు ప్రాంతీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే కెసిఆర్ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో చర్చలు జరిపారని, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్‌తోనూ మాట్లాడారని, త్వరలో ఆయన హైదరాబాద్ రానున్నారని తెలిపారు. వైఎస్ జగన్‌తో ఇప్పుడు జరిగిన చర్చలు సైతం కెసిఆర్ ఆదేశాల మేరకేనని వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనతో పాటు తెలంగాణ ప్రయోజనాలు కాపాడుకోవడంలో టిఆర్‌ఎస్‌కు స్పష్టత ఉందని, ఇప్పటికే పార్లమెంట్ ఉభయసభల్లో టిఆర్‌ఎస్ నాయకులు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాకు మద్దతుపై స్పష్టత ఇచ్చారని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెప్పారు. గుర్తు చేశారు. ప్రత్యేక హోదాకు టిఆర్‌ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టంచేశారు. రాజకీయాల్లో గుణాత్మక మార్పులు వచ్చినప్పుడే దేశంలోని రాష్ట్రాలు అభివృద్ధి దిశలో వేగంగా ముందుకు కదులుతాయన్నారు. పార్లమెంట్‌లో తరువాయి 3లో



ప్రోటెం స్పీకర్‌గా అహ్మద్ ఖాన్ ప్రమాణం

సిఎంతో సహా ప్రముఖుల హాజరు...అభినందనలు

మన తెలంగాణ / హైదరాబాద్

శాసనసభ ప్రోటెం స్పీకర్‌గా చార్మినార్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంఐఎం శాసనసభ్యుడు ముంతాజ్ అహ్మద్ ఖాన్ రాజ్‌భవన్‌లో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ భవన్ దర్బార్ హాల్‌లో సాయంత్రం 5 గంటలకు జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ చేత ప్రమాణం స్వీకారం చేయించారు. జాతీయ గీతాలాపన అనంతరం శాసనసభ సచివాలయ కార్యదర్శి నర్సింహాచార్యులు ప్రోటెం స్పీకర్ నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను చదివి వినిపించారు. ప్రమాణం స్వీకారం చేసిన అనంతరం ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణ తరువాయి 3లో

నేటి నుంచి అసెంబ్లీ



నూతన సభ్యుల ప్రమాణస్వీకారం

రేపు స్పీకర్ ఎన్నిక 3



అమిత్‌షాకు స్వైన్ ఫ్లూ

- ఎయిమ్స్‌లో చికిత్స 6



బ్రహ్మానందానికి అస్వస్థత 12

- ముంబయిలో గుండెకు శస్త్రచికిత్స

ఆపరేషన్ రిటర్న్‌గిఫ్ట్!

చెప్పినట్టుగానే టిఆర్‌ఎస్ కసరత్తు షురూ • త్వరలో విజయవాడకు కెసిఆర్ • తొలిమెట్టుగా ఎపిలో తలసాని పర్యటన, వివిధ అంశాలపై కీలక వ్యాఖ్యలు • అసదుద్దీన్‌తో వైసిపి ఎంఎల్‌ఎ భేటీ, ఎపిలో ఎన్నికల ప్రచారానికి ఒవైసి?

మన తెలంగాణ / హైదరాబాద్

తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు రిటర్న్‌గిఫ్ట్ ఇస్తామంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు తగిన ఆచరణ మొదలైంది. యాక్షన్‌కు రియాక్షన్ తరహాలో టిఆర్‌ఎస్ కార్యాచరణ ప్రారంభించింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు పోషించిన పాత్రకు తగిన రిటర్న్‌గిఫ్ట్ ను ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చేలా వ్యూహం ఖరారైంది. ఇందులో తొలి మెట్టుగా టిఆర్‌ఎస్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాసయాదవ్ రెండు రోజుల క్రితం ఆంధ్ర పర్యటనతో మొదలైంది. ఇప్పుడు జగన్, కెటిఆర్ భేటీతో మరో అడుగు పడింది. త్వరలో కెసిఆర్ ఆంధ్ర పర్యటనతో ఊపందుకోనుంది. పార్లమెంటు ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి



అసెంబ్లీ ఎన్నికలు కూడా వస్తున్నందున అప్పటికల్లా టిఆర్‌ఎస్ మరింత పకడ్బందీ వ్యూహాన్నిరూపొందించనుంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఇప్పటికే అక్కడి యాదవ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ చెప్పినట్లుగా చంద్రబాబుకు రిటర్న్‌గిఫ్ట్ తథ్యమని, తన వంతు పాత్ర పోషిస్తానని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత భీమవరం పర్యటనలో పోలవరం ప్రాజెక్టుపై వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సైతం కెసిఆర్ రిటర్న్‌గిఫ్ట్ వ్యాఖ్యలపై స్పందించి తాను కూడా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తానని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు చేసిన కొద్ది రోజుల వ్యవధిలోనే వైఎస్‌ఆర్‌సిపి శాసనసభ్యుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి హైదరాబాద్ వచ్చి అసదుద్దీన్ ఒవైసీని కలిసి చర్చించారు. ఇప్పుడు కెసిఆర్ ఆదేశం మేరకు వైఎస్‌ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్‌తో హైదరాబాద్‌లో చర్చలు జరిపారు. ఫెడరల్ ఫ్రంట్ తరువాయి 6లో

స్పీకర్‌ను ఏకగ్రీవం చేద్దాం



విపక్షనేతలకు ముఖ్యమంత్రి కెసిఆర్ ఫోన్ • ఓకే అన్న ఎంఐఎం, బిజెపి • పార్టీలో చర్చిస్తాం : ఉత్తమ్ 3



ముగ్గురిపై వేటు

పార్టీ ఫిరాయించిన రాములునాయక్, యాదవరెడ్డి, భూపతిరెడ్డిలను ఎంఎల్‌సి పదవులకు అనర్హులను చేసిన మండలి చైర్మన్

ఇప్పటికే రాజీనామా చేసిన కొండా మురళి

మన తెలంగాణ/ హైదరాబాద్

టిఆర్‌ఎస్ తరఫున గెలిచి తాజా అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు శాసనమండలి సభ్యులపై చైర్మన్ అనర్హత వేటు వేశారు. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి చేరిన రాములునాయక్, యాదవరెడ్డి, భూపతిరెడ్డి, కొండా మురళి అనే నలుగురు ఎంఎల్‌సిలపై తరువాయి 6లో

కుంచెపోటు



వచ్చే విద్యాసంవత్సరం నుంచి 10% ఇబిసి కోటా

40వేల కాలేజీలకు వర్తింపు

కేంద్ర మంత్రి జవదేకర్ ప్రకటన, అదనపు సీట్ల సంఖ్యపై సస్పెన్స్ 14



ఎన్నికలు తప్పవా?

ఎదురు దెబ్బ

బ్రిటన్ ప్రధాని థెరెసాకు బ్రెగ్జిట్ షాక్

పార్లమెంటు ఓటింగ్‌లో ఘోర ఓటమి • విశ్వాస పరీక్షకు లేబర్ పార్టీ నోటీసు

లండన్ : బ్రిటన్ ప్రధాని థెరెసా మేకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఐరోపా యూనియన్‌తో బ్రెగ్జిట్‌పై చేసుకున్న ఒప్పందంపై బ్రిటన్ పార్లమెంటులో నిర్వహించిన ఓటింగ్‌లో మే ఓటమి పాలయ్యారు. దీంతో ఆమె విశ్వాస పరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. యూరోపియన్ యూనియన్(ఇయు) నుంచి వైదొలగాలని బ్రిటన్ నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిపై పార్లమెంటులో జరిగిన కీలక ఓటింగ్‌లో బ్రెగ్జిట్‌కు వ్యతిరేకంగా 432 మంది ఓటు వేయగా, అనుకూలంగా 202 మంది సభ్యులు ఓటు వేశారు. భారతీయ సంతతికి చెందిన ఏడుగురు ఎంపీలు కూడా బ్రెగ్జిట్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడం గమనార్హం. దీంతో థెరెసా మే ఓటమి పాలయ్యారు. 2016లో జరిగిన రెఫరెండం ఫలితానికి అనుగుణంగా బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటు వేయాలని ఓటింగ్‌కు ముందు థెరెసా మే చేసిన విజ్ఞప్తిని సభ్యులు పట్టించుకోలేదు. ఓటింగ్‌లో ఓటమి నేపథ్యంలో ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకుడు జెరెమీ కోర్బిన్ థెరెసా మే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానా న్ని ప్రతిపాదించారు. ఒక వేళ అవిశ్వాస తీర్మానం నెగ్గితే మెజారిటీ పక్షం విశ్వాస పరీక్షను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇందుకు 14రోజుల వ్యవవధి ఉంటుంది. గడువు లోగా విశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోకపోయినట్లయితే తరువాయి 6లో



జాబిలిపై పత్తి మొలక 16

ప్రపంచ బ్యాంక్ చీఫ్‌గా ఇంద్రానూయి? 11



20,575

రెండో విడత పంచాయతీలకు నామినేషన్లు 3

గడ్చిరోలిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆరుగురు మృతి, 11మందికి తీవ్రగాయాలు
- కోపోద్రిక్తులైన స్థానికులు, 15 లారీలకు నిప్పు



మనతెలంగాణ/ మంచిర్యాల జిల్లా ప్రతినిధి: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఏటపల్లి ఆలపల్లి మార్గంలోని గురుపల్లి గ్రామ సమీపంలో ఆర్‌టిసి బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఆరుగురు మృతి చెందారు. కోపోద్రిక్తులైన గ్రామస్తులు రహదారిపై వెళుతున్న 15లారీలను తగులబెట్టారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఎక్కువగా పాఠశాల విద్యార్థులు బస్సులో ప్రయాణిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మరో 11 మందిని గడ్చిరోలి జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

'ఆన్‌లైన్'లో పంటలు కొంటలేరు!

- ఈనామ్ అమలులో లోటుపాట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం..
- పటిష్టంగా అమలుపై ఆదేశాలు
- సూచనలు చేయాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు లేఖ

మన తెలంగాణ/హైదరాబాద్: ఈనామ్‌లో భాగంగా మార్కెట్ యార్డుకు వచ్చే పంట ఉత్పత్తులకు 'ఆన్‌లైన్'లో ధరలు నిర్ణయించడం లేదని కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ట్రేడర్స్ పంట ఉత్పత్తుల వద్దనే ధరను నిర్ణయించి, కొనుగోలు చేస్తున్నారని స్పష్టం చేసింది. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపింది. ఫలితంగా ఒక మార్కెట్‌లోని పంటను, మరొక మార్కెట్ వ్యాపారులు కొనుగోలు చేయలేకపోతున్నారని, తద్వారా రైతులు గిట్టుబాటు కోల్పోతున్నారని వ్యవసాయ శాఖ తెలిపింది. ఈనామ్ ద్వారా 15 శాతం పంట మాత్రమే కొంటున్నారని గుర్తించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు కేంద్ర వ్యవసాయ శాఖ లేఖ రాసింది.

ఇటీవల 8 రాష్ట్రాలలోని 28 మార్కెట్‌లలో 150 మంది రైతులు, ట్రేడర్స్, కమిషన్ ఏజెంట్లతో మాట్లాడి కేంద్ర వ్యవసాయ శాఖ ఒక నివేదికను తయారు చేసింది. లోటుపాట్లను వివరించడంతో పాటు పలు సూచనలు చేయాలని కోరింది. దీని ప్రకారం ఈనామ్ అమలులో అనేక లోటుపాట్లు ఉన్నట్లు కేంద్రం గుర్తించింది. రైతుల్లో అవగాహన పెంచి వారికి కేంద్రం ఈనామ్ అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కొంతమంది కొనుగోలుదారులతో పాటు మరికొంత మంది కమిషన్ ఏజెంట్లు ఆన్‌లైన్ కొనుగోళ్లకు సహకరించడం లేదని తెలిపింది. మరోవైపు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు నిర్ణయిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొంది. ఈనామ్ మొదలైన తొలిరోజుల్లో సరియైన విధానంతో జరిగినప్పటికి తదనంతరం మార్కెట్ యార్డుల్లో చోటు చేసుకున్న వివిధ పరిణామాల మూలంగా సమస్యలు ఏర్పడ్డాయని వివరించింది. అధిక మొత్తంలో సరుకులు మార్కెట్‌కు రావడం, గేట్ ఎంట్రీలో జాప్యం జరగడం, కొనుగోలుదారులు ధరల నమోదుకు ఆలస్యం చేయడం, తూకంలో తీవ్ర జాప్యం చోటు చేసుకోవడం తదితర కారణాలతో ఈనామ్ అమలులో సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపింది. ఈనామ్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో ధరలు నమోదు చేయడం కంటే నేరుగా ధర నిర్ణయించి కొనుగోలు చేయడమే సులభంగా ఉందని కొందరు కమిషన్ ఏజెంట్లు వ్యాఖ్యానించినట్లు నివేదికలో కేంద్రం తెలిపింది. అయితే ఆన్‌లైన్‌లో అవకాశం ఇస్తే మార్కెట్ పరిధి పెరిగి, తమ ప్రభావం తగ్గుతుందనే భావనలో వారు ఉన్నట్లు స్పష్టం చేసింది. కర్నాటకలో రైతులకు అవగాహన కలిగించడం ద్వారా ఒక మార్కెట్ నుంచి ఇంకో మార్కెట్ మధ్య ఈనామ్ కొనుగోళ్లు జరుగుతున్నాయని నివేదికలో పేర్కొన్నారు. ఇక ధాన్యం కొనుగోలునకు రైస్ మిల్లర్స్ వంటి వారు కూడా ఈనామ్‌లో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది.



నాణ్యత పరీక్షల ల్యాబ్‌లు లేవు

మార్కెట్‌కు వచ్చే పంట ఉత్పత్తుల నాణ్యతను పరీక్షించడంలో మార్కెటింగ్ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. నాణ్యతా పరీక్షల ల్యాబ్‌లను నెలకొల్పకపోవడం, ఉన్నవాటిలో సిబ్బంది, సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటివి ఉన్నాయి. దీంతో పంట ఉత్పత్తుల నాణ్యత తెలియక అంతరాష్ట్ర కొనుగోలు జరగడం లేదు. ఇక మన రాష్ట్రంలో 47 మార్కెట్‌లలో ఈనామ్ సేవలు అమలవుతున్నాయి. ఇందులో 9 మార్కెట్‌లలో నాణ్యత నిర్ధారించే ల్యాబ్‌లు ఉన్నప్పటికీ పరీక్షలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. మిగిలిన మార్కెట్‌లలో తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పంట ఉత్పత్తుల నాణ్యతను పరీక్షించేందుకు అవసరమైన ల్యాబ్ నెలకొల్పేందుకు కేంద్రం రూ. 16.36 కోట్లు విడుదల చేసింది. వీటిలో ఇప్పటికీ నాణ్యతా పరీక్ష ల్యాబ్‌లు ఏర్పాటు చేయలేదు. రైతులు తీసుకువచ్చిన పంట ఉత్పత్తుల నాణ్యతను పరీక్షించేందుకు ల్యాబ్‌లు అవసరం. వీటి ఆధారంగానే వ్యాపారులు ధరను నిర్ణయించి ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉంటుంది. వీటి సాకుతో ధర తక్కువ చేసి కొనుగోలు చేస్తున్నారు. అవసరమైతే ట్రేడర్స్, కమిషన్ ఏజెంట్లు కలిసి ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకోవచ్చునని, పరీక్షలకు రైతుల నుంచి కొంత మొత్తం వసూలు చేయాలని కేంద్రం సూచించింది. రైతులకు లాభాలు వచ్చేలా రియల్ టైమ్ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరింది.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన - తాకట్టుపెట్టిన ఆస్తులుగా బంగారు ఆభరణాల వేలం

బ్రాంచ్ చిరునామాలు:

సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్ (ఎ.పి.) : సంజీవరెడ్డినగర్, హైదరాబాద్ (ఎ.పి.) ప్లాట్ నెం.257/3ఆర్‌టి, సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్, (ఎ.పి.) -500038.

జహీరాబాద్ (ఎ.పి.) : జహీరాబాద్ (టిఎస్): 3-3-97/1-బి, సి& డి, లైఫ్‌స్టైల్, షాపింగ్ మాల్, సుభాష్ గంజ్, మెయిన్ రోడ్, ఎన్‌హెచ్-9, జహీరాబాద్- 502220

ఉప్పల్ కలాన్ : ప్లాట్ నెం.1 & 14, ఎస్‌వై నెం.37, పీర్జాదిగూడ, ఘట్కేసర్ మండలం, ఉప్పల్, జిల్లా రంగారెడ్డి, ఆంధ్రప్రదేశ్ పిన్ -50039.

డా॥ఎ.ఎస్.రావు నగర్, హైదరాబాద్ (ఎ.పి.) : డా॥ ఎ.ఎస్.రావు నగర్, హైదరాబాద్ (ఎ.పి.) : గ్రౌండ్ & 1వ అంతస్తు, డోర్ నెం.1-1-299/2, అరుల్ కాలనీ, డా॥ ఎ.ఎస్.రావు నగర్, కాప్రా, హైదరాబాద్-500062.

కుత్బుల్లాపూర్ (ఎ.పి.) : కుత్బుల్లాపూర్ (ఎ.పి.) : ప్లాట్ నెం.45, 46 & 54, 55, చింతల్ మెయిన్ రోడ్, కుత్బుల్లాపూర్-500054.

మాదాపూర్, హైదరాబాద్ (ఎ.పి.) : మాదాపూర్, హైదరాబాద్ (ఎ.పి.) : 1వ అంతస్తు, హుడా టెక్నో లేఅవుట్, సర్వే నెం.64, మాదాపూర్, హైదరాబాద్ (ఎ.పి.) - 500081.

పటాన్‌చెరు (ఎ.పి.) : డి.నెం.9-131 నుండి 133, పాత నెం.1-26-1, ఎన్‌హెచ్-9, పటాన్‌చెరు- 502319, జిల్లా మెదక్, ఆంధ్రప్రదేశ్.

మెహిదీపట్నం, హైదరాబాద్ (ఎ.పి.) : మెహిదీపట్నం, హైదరాబాద్ (ఎ.పి.) : 13-6-431/డి/82/4, ఎ.ఎం.ఆర్కేడ్, మెహిదీపట్నం రింగ్ రోడ్, హైదరాబాద్ (ఎ.పి.) -500028.

చందానగర్, హైదరాబాద్ (ఎ.పి.) : చందానగర్, హైదరాబాద్ (ఎ.పి.) : ప్లాట్ నెం.5 నుండి 8, సర్వే నెం.353/1, ప్లాట్ నెం.5 నుండి 8, సర్వే నెం.353/1, చందానగర్, హైదరాబాద్ (ఎ.పి.) - 500050.

చంపాపేట్, (ఎ.పి.) : చంపాపేట్, హైదరాబాద్ (ఎ.పి.) : డి.నెం.6-9/1(పాతది)/ 9-6-62(కొత్తది), భరత్ గార్డెన్ ప్రక్కన, సాగర్ రోడ్, చంపాపేట్, హైదరాబాద్ (ఎ.పి.) - 500059.

హనుమకొండ, (ఎ.పి.) : జి.ఎం.ఆర్ & జి.ఎస్ కాంప్లెక్స్, 1వ అంతస్తు, ఇం.నెం.5-9-157, హనుమకొండ, వరంగల్, ఆంధ్రప్రదేశ్, పిన్ : 506001.

సికింద్రాబాద్ (ఎ.పి.) : సికింద్రాబాద్ (ఎ.పి.) : మోడిస్వీర్, గ్రౌండ్‌ఫ్లోర్, డి.నెం.ఎమ్.నెం.5-2-183/184 (8571 పాతది), ఆర్.పి. రోడ్, సికింద్రాబాద్ (ఎ.పి.).

హైదరాబాద్ (ఎ.పి.) : 6-3-879/బి, 1వ అంతస్తు, జి.పుల్లారెడ్డి, బిల్ గ్రీన్ ల్యాండ్స్, బేగంపేట్ రోడ్ 500016

మహబూబ్‌నగర్, (టి.జి.) : మహబూబ్‌నగర్, (టి.జి.) : ఇం.నెం.2-3-13/ఎ, ఇం.నెం.2-3-13/ఎ1, శ్రీసాయిబాలాజీ టవర్, గ్రౌండ్‌ఫ్లోర్, అశోక్ టాకీస్ క్రాస్ దగ్గర, మహబూబ్‌నగర్ - 509001.

మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్ (ఎ.పి.) : మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్ (ఎ.పి.) : ఇం.నెం.10-5-2/3/3/1, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్ (ఎ.పి.) -500016.

తార్నాక, హైదరాబాద్ (ఎ.పి.) : తార్నాక, హైదరాబాద్ (ఎ.పి.) : ప్లాట్ నెం.12-5-149/17, రైల్వే డిగ్రీ కాలేజ్ ఎదురుగా, తార్నాక, సికింద్రాబాద్, (ఎ.పి.) -500017.

దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ (ఎ.పి.) : డి.నెం.16-11-741/బి/బి/283 భాగం, మూసారంబాగ్, హైదరాబాద్, తెలంగాణ -500036.

కూకట్‌పల్లి, హైదరాబాద్ (ఎ.పి.) : కూకట్‌పల్లి, హైదరాబాద్ (ఎ.పి.) : హెచ్.ఐ.జి -486, ఫేజ్-6, విస్టార్, కళామందిర్ ఫోరమ్ ప్రక్కన, కె.పి.హెచ్.బి. కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500072.

సంగారెడ్డి (ఎ.పి.) : సంగారెడ్డి (ఎ.పి.) : సర్వే నెం.13/పి, 14 & 108, సైట్ నెం.2, కొత్త కలెక్టర్ కాంప్లెక్స్ ఎదురుగా, పోతిరెడ్డిపల్లి గ్రామం, సంగారెడ్డి - 502001.

శంషాబాద్, హైదరాబాద్ (ఎ.పి.) : ప్లాట్ నెం.140, 141 & 142 మధురానగర్, శంషాబాద్, జిల్లా రంగారెడ్డి, ఆంధ్రప్రదేశ్ పిన్-501218.

మారేడ్‌పల్లి, హైదరాబాద్ (ఎ.పి.): మారేడ్‌పల్లి, హైదరాబాద్ (ఎ.పి.): ఇం.నెం.10-1-49, సర్వే నెం.63, బూసారెడ్డిగూడ, వెస్ట్ మారేడ్‌పల్లి, హైదరాబాద్ (ఎ.పి.) -500026.

చేవేళ్ళ (ఎ.పి.) : వీరభద్ర కాంప్లెక్స్, చేవేళ్ళ, తెలంగాణ - 501503.

గచ్చిబౌలి, హైదరాబాద్ (ఎ.పి.) : ప్లాట్ నెం.24, సర్వే నెం.లు : 61, 10, 17 అప్పర్‌గ్రౌండ్ ఫ్లోర్ & 1వ అంతస్తు, శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి, జిల్లా రంగారెడ్డి పిన్-500032. ఆంధ్రప్రదేశ్.

"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే" ప్రాతిపదికన బంగారు ఆభరణములు (ఇచ్చట నుండి అసెట్స్‌గా వ్యవహరించబడును.) వేలము వేయబడునని బహిరంగ ప్రకటన చేయడమైనది. సదరు బంగారు ఆభరణములు తాకట్టు పెట్టుట ద్వారా రుణ సౌకర్యము వినియోగించుకొనిన సందర్భంగా ఈ క్రింద తెలియజేయబడిన రుణగ్రహీత/లు మరియు హామీదారులచే బ్యాంకుకు బంగారు ఆభరణములు తాకట్టుపెట్టబడినవి.

క్ర.	పేరు/చిరునామా/రుణఖాతా నెం/ రావలసిన బకాయి మొత్తం/వర్తించని వడ్డీ తప్ప/ ఇతర ఆర్థిక చార్జీలు/రుసుములు మరియు నష్టపరిహారములు
01.	పేరు : వడపల్లి నవీన్ కుమార్ /అడ్రస్: ప్లాట్ నెం.బేగంపేట్, 104-8-3-168/a/2/147, రాజీవ్‌నగర్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ దగ్గర, షేక్‌పేట్ ఖైరతాబాద్, యూసఫ్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ-500045./ లోన్ నెం.918060083621444/ రావల్సిన బకాయి : 30000
02.	పేరు : సున్నపు అనిత / అడ్రస్ : భర్త సున్నపు క్రిష్ణమూర్తి, 2-80, న్యాల్‌కల్, మెదక్, మెదక్, తెలంగాణ - 502256/ లోన్ నెం.918060006482877/ రావల్సిన బకాయి : 101219.
03.	పేరు : శ్రీకాంత్ రెడ్డి గుడల/ అడ్రస్ : 5-66/7, లక్ష్మి సాయి హిల్స్, మేడిపల్లి, ఘట్కేసర్, రంగారెడ్డి లక్ష్మి సాయి హిల్స్, హైదరాబాద్, తెలంగాణ - 500039/ లోన్ నెం.916060043660171/ రావల్సిన బకాయి : 500.69.
04.–72.	[illegible]
73.	పేరు : కదమంచి మమత/ అడ్రస్ : ఇం.నెం.4/6/2/91, వెంకటగిరి, వెంకటగిరి, దేవరకద్ర మండలం, రేకులంపల్లి, మహబూబ్‌నగర్, రేకులంపల్లి, మహబూబ్‌నగర్, తెలంగాణ - 509219 / లోన్ నెం.917060065617750/ రావల్సిన బకాయి : 43616
74.	పేరు : ప్రియరంజన్ కుమార్ /అడ్రస్ : ఇం.నెం.36, రోడ్ నెం.1, కొత్త పట్లిపుత్ర కాలనీ, కేంద్రీయ్ ఎదురుగా, పట్లిపుత్ర బీహార్-800013 / లోన్ నెం.918060083725122/ రావల్సిన బకాయి : 404000
75.	పేరు : సయ్యద్ బిన్ ఇడ్రీస్ అంజాలి /అడ్రస్ : 18-10-71-3, బర్కాస్ ఉంద్రగూడ, ఉంద్రగూడ, హైదరాబాద్, కేశోగిరి చంద్రాయణగుట్ట, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ -500005 /లోన్ నెం.918060082890520/ రావల్సిన బకాయి : 218825
76.	పేరు : పి. రాకేష్ గౌడ్ /అడ్రస్ : కోమింట్ గ్రాస్ లిమిటెడ్, వేముల(గ్రా), అడ్డాకల్ (మం), జిల్లా మహబూబ్‌నగర్, తెలంగాణ- 5093852 / లోన్ నెం.917060080280168/ రావల్సిన బకాయి : 155603

టెండరు యొక్క నిబంధనలు & షరతులు:

పైన తెలియజేయబడిన బేస్ ప్రైజ్ తుది ధర కాదు. వేలము దినము/ తేదీన టెండరుదారులకు అనువైన బేస్ ప్రైజ్ ఇవ్వబడును మరియు దాని ఆధారంగా వేలము బిడ్ పరిశీలించబడును.

నిర్దేశించబడిన టెండరు డాక్యుమెంట్ సంబంధి ఆఫర్ అనగా ఈ డాక్యుమెంట్ మాత్రమే పరిశీలించబడును. అన్నివిధాల పూర్తిచేయబడిన ఈ టెండరు డాక్యుమెంట్ ఒక ఎన్వలప్‌లో పెట్టి సీల్ చేసి మరియు "బంగారు ఆభరణముల కొనుగోలు కొరకు ఎంఆర్./ఎంఎస్./ఎం/ఎస్....................... నుండి ఆఫర్ అని ఎన్వలప్‌పై పెద్ద అక్షరములతో స్పష్టముగా వ్రాయబడినది మరియు సదరు ఎన్వలప్ **23.01.2019** లేదా అంతకుముందు కార్యాలయ పనివేళలలో సంబంధిత బ్రాంచ్ అధికారికి అందజేయవలెను. **గడువు తేది& సమయము తరువాత స్వీకరించబడిన టెండర్లు పరిశీలించబడవు.**

"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ఏది ఎలా ఉన్నది అలా, అక్కడ ఏది ఉంటే అది మరియు రికోర్స్ లేనటువంటి ప్రాతిపదికన అమ్మకము కొరకు సదరు ఆస్తుల ఆఫర్ చేయబడును. సదరు ఆస్తికి సంబంధించి ప్రామాణికత, స్వచ్ఛత మరియు ఏదేని ఇతర బకాయిలు, చిక్కులు ఏమైనా ఉన్నచో వాటికి బ్యాంక్ ఎటువంటి బాధ్యత వహించదు.

టెండరుదారులు వారి సంబంధిత ఆఫర్ పెంచుటకు, సవరించుటకు అన్నిటితో కలుపుకొని దిగువ తెలియజేయబడిన రోజు మరియు సమయమున హాజరుకాగోరు టెండరుదారుల సమక్షములో వేలము తేదీన బ్యాంకుచే టెండర్లు తెరువబడును.

బ్రాంచ్ పేరు	వేలము తేది
చంపాపేట్ (ఎ.పి.)	24.01.19
చందానగర్, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
చేవేళ్ళ (ఎ.పి.)	24.01.19
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
డా॥ ఎ.ఎస్. రావునగర్, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
గచ్చిబౌలి, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
హన్మకొండ (ఎ.పి.)	24.01.19
హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
కూకట్‌పల్లి, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
మాదాపూర్, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
మహబూబ్‌నగర్ (టి.జి.)	24.01.19
మారేడ్‌పల్లి (ఎ.పి.)	24.01.19
మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
మెహిదీపట్నం, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
పటాన్‌చెరు (ఎ.పి.)	24.01.19
కుత్బుల్లాపూర్ (ఎ.పి.)	24.01.19
సంగారెడ్డి (ఎ.పి.)	24.01.19
సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
సికింద్రాబాద్, (ఎ.పి.)	24.01.19
శంషాబాద్, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
తార్నాక, హైదరాబాద్ (ఎ.పి.)	24.01.19
ఉప్పల్ కలాన్	24.01.19
జహీరాబాద్ (ఎ.పి.)	24.01.19

బ్యాంకు వారి పూర్తి విచక్షణ మేరకు ఆఫర్‌ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు బ్యాంకుకు పూర్తి హక్కు కలదు. సదరు ఆస్తి/అమ్మకము కొరకు ఆఫర్ చేయబడుట ద్వారా ఏదేని వివాదములు, వ్యత్యాసములు, ముంబయి న్యాయస్థానములు/ట్రిబ్యునళ్ళ ప్రత్యేక అధికార పరిధికి మాత్రమే లోబడి ఉండును.

ప్రదేశము: హైదరాబాద్ — అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

రైల్వే, మెట్రో, సిటి బస్‌లకు ఉమ్మడి టికెట్

త్వరలో వినియోగంలోకి స్మార్ట్‌కార్డ్ వ్యవస్థ

ఈ నెలాఖరుకు ఎస్‌బిఐ నివేదిక

మన తెలంగాణ / హైదరాబాద్ : నగరంలో ఆర్‌టిసి (సిటీబస్), ఎంఎంటిఎస్, మెట్రోరైల్, క్యాబ్, ఆటో తదితర వివిధ రకాల ప్రజా రవాణా వ్యవస్థకు ఒకే ఉమ్మడి టికెట్ వ్యవస్థ (కామన్ మొబిలిటీ కార్డు) విధానాన్ని అమలులోక తేవడంపై రవాణా విభాగం దాదాపు ఒక స్పష్టతకు వచ్చింది. ఈ ఉమ్మడి టికెట్ విధానంపై ఆర్‌టిసి, మెట్రో రైల్, ఎంఎంటిఎస్, ఆటో, క్యాబ్ తదితర వ్యవస్థల ప్రతినిధులతో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న భారతీయ స్టేట్ బ్యాంక్ ఈ నెల చివరికల్లా సంప్రదింపులను పూర్తిచేసి రవాణా శాఖకు ఒక నివేదికను సమర్పించనుంది. ప్రస్తుతం ఒక్కో ప్రజా రవాణా వ్యవస్థకు ఒక్కో రకమైన ధరలు ఉన్నప్పటికీ వాటిని స్మార్ట్ కార్డ్ వ్యవస్థ కిందికి తీసుకురావడం ద్వారా ఎందులో ప్రయాణించినా టికెట్ ధర మేరకు మాత్రమే వినియోగదారుల బ్యాంకు ఖాతా నుంచి చెల్లింపు అవుతుందని, కానీ అన్నింటికీ స్మార్ట్ కార్డు మాత్రం ఒక్కటేనని రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు వివరించారు. ప్రస్తుతం ఆర్‌టిసి ఆధ్వర్యంలో నడుస్తున్న సిటీ బస్సుల్లో రకరకాల కన్సెషన్ టికెట్లు వేర్వేరుగా ఉన్నందున వాటిపై ఇంకా స్పష్టత రాలేదని, సీజనల్ పాస్‌లకు ఒక రకమైన ఛార్జీలు, విద్యార్థులకు మరో రకం, జర్నలిస్టులకు ఇంకో రకం.. ఇలా రకరకాల కన్సెషన్ (రాయితీలు) ఉన్నందున త్వరలో ఆర్‌టిసి అధికారులు దీనిపై పూర్తిస్థాయి వివరాలను ఎస్‌బిఐకి అందజేస్తారని తెలిపారు. అయితే రాయితీ రూపంలో ప్రభుత్వం కల్పిస్తున్న మొత్తానికి నేరుగా ఆర్‌టిసికి చెల్లిస్తుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మెట్రో రైల్, ఎంఎంటిఎస్, ఆర్‌టిసి, క్యాబ్, ఆటో తదితర రవాణా వ్యవస్థలకు ఈ స్మార్ట్ కార్డ్ వ్యవస్థను అనుసంధానించడంతో భాగంగా భారతీయ స్టేట్ బ్యాంకు 'ఇ పాస్' (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్స్) మిషన్లను సరఫరా చేస్తుందని, స్మార్ట్ కార్డులో వినియోగదారులకు సంబంధించిన పూర్తి వివరాలు, బ్యాంకు ఖాతా తదితరాలన్నీ ఉంటున్నందున ప్రయాణం చేసేటప్పుడు దాన్ని స్వైప్ చేసిన వెంటనే ఆ మేరకు సదరు వినియోగదారుని బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అవుతాయని ఆ అధికారి వివరించారు. చాలా కాలంగా స్మార్ట్‌కార్డు వ్యవస్థ గురించి ఆలోచిస్తున్నామని, ఇప్పటికే వివిధ రకాల ప్రజా రవాణా వ్యవస్థకు సంబంధించిన ప్రతినిధులతో చర్చలు జరిగాయని, సానుకూల స్పందన వచ్చిందని, ఇకపైన మార్గదర్శకాలు, ఆచరణాత్మకక విధానాలను రూపొందించడమే మిగిలిందని, ఎస్‌బిఐ ఈ నెల చివరికల్లా ఆ ప్రక్రియను కూడా పూర్తిచేస్తే ఇక అమలులోకి రావడమే తరువాయి అని ఆ అధికారి పేర్కొన్నారు.

'కోడికత్తి' కేసులో కొత్త మలుపు

ఎన్‌ఐఎ అదుపులోకి మరికొందరు

మనతెలంగాణ/హైదరాబాద్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసులోని నిందితుడు శ్రీనివాసరావును ఐదవ రోజు ఎన్‌ఐఎ విచారించిన నేపథ్యంలో కొత్త విషయాలు వెలుగు చూశాయి. జగన్‌పై దాడి చేసేందుకు శ్రీనివాసరావు వేసిన పథకాలపై ప్రశ్నలు సంధించిన ఎన్‌ఐఎ అధికారులకు లభ్యమైన సమాచారం మేరకు అనతికాలంలో మరి కొందరిని అదుపులోకి తీసుకోనున్నారు. ఏడాది కాలంలో వందలాది సిమ్‌కార్డులు, పదుల సంఖ్యలో సెల్‌ఫోన్లు వాడాల్సి వచ్చిందన్న అంశాలపై ఆరా తీశారు. ముఖ్యంగా జగన్‌పై దాడికి ముందు శ్రీనివాస్ 20 మంది యువతులతో మాట్లాడిన కాల్ డేటా వివరాలపై ఎన్‌ఐఎ అధికారులు వివరాలు సేకరించారు. అసలు ఎయిర్‌పోర్ట్‌లోకి కత్తి ఎలా వచ్చింది.? ఎవరు తెచ్చారు అన్న విషయాలపై శ్రీనివాస్‌ను ఎన్‌ఐఎ అధికారులు ప్రశ్నించారు. జగన్‌పై హత్యాయత్నం జరిగిన రోజు ఎయిర్ పోర్ట్‌లోని లాంజ్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తుల నుంచి ఎన్‌ఐఎ అధికారులు కొంత సమాచారం సేకరించినట్లు సమాచారం. నేరస్థలంలో కొన్ని కీలక ఆధారాలను ఎన్‌ఎఐ అధికారులు సేకరించినట్లు తెలియవస్తోంది. గత నాలుగు రోజులుగా హైదరాబాద్‌లోని ఎన్‌ఐఎ కార్యాలయంలో ఎన్‌ఐఎ డిఐజి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన అధికారులు ఐదవ రోజు విశాఖపట్నంలోని కైలాసగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో న్యాయవాదుల సమక్షంలో కోడికత్తి నిందితుడు శ్రీనివాసరావును విచారించారు. అయితే ఏడు రోజుల జ్యూడిషియల్ కస్టడిలో భాగంగా మిగిలిన రెండు రోజులు ఎన్‌ఐఎ అధికారులు తిరిగి హైదరాబాద్‌లోని ఎన్‌ఐఎ కార్యాలయంలో విచారించనున్నారు. నిందితుడు రిమాండ్‌లో ఉన్న సమయంలో 20 పేజీల లేఖను జైలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖను తమకు అప్పగించాలని ఎన్‌ఐఎ అధికారులు జైలు ఉన్నతాధికారులను సంప్రదించనున్నారు. జగన్‌పై దాడికి ముందు నిందితుడు శ్రీనివాస రావు రాసిన లేఖలోని ప్రతి అంశంపై ఎన్‌ఐఎ అధికారులు దర్యాప్తు చేపడుతున్నారు. అలాగే శ్రీనివాస రావు రిమాండ్ సమయంలో రాసిన లేఖలోని అంశాలను ఎన్‌ఐఎ అధికారులు పూర్తిగా పరిశీలించనున్నారు. కోడికత్తి కేసును దర్యాప్తు చేపడుతున్న ఎన్‌ఐఎ అధికారులు అన్ని కోణాలలో విచారణ సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించనున్నట్లు సమాచారం.

మళ్లీ వచ్చేది మోడీ ప్రభుత్వమే : లక్ష్మణ్

మన తెలంగాణ/హైదరాబాద్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మళ్ళీ వచ్చేది మోడీ ప్రభుత్వమేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మ ణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. బిజెపిని ఎదుర్కొనేందుకు ఎజెం డా లేని కొన్ని పార్టీలు ఏకమై కూట ముల ను ఏర్పాటు చేస్తున్నాయని ఆయన విమర్శి ంచారు. అలాంటి కూటములను ప్రజలు విశ్వసించరని, ఎన్నికల్లో గెలిపించరని ఆయన అన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మ ణ్ మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ మండలి సమావేశాలు ఎంతో ఉత్సాహభరితంగా జరిగాయన్నారు. `అబ్ కి బార్ ఫిర్ మోడీ సర్కార్' అన్న నినాదంతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి మోదీ ప్రభుత్వం వచ్చేలా ప్రజల్లోకి వెళ్ళనున్నట్లు ఆయన తెలిపారు. నరేంద్రమోడీనే మరోసారి ప్రధాన మంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కూడా కోరుకుంటున్నారని లక్ష్మ ణ్ వ్యాఖ్యానించారు. టిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యీలపై అనర్హత వేటు వేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని లక్ష్మ ణ్ వ్యాఖ్యానించారు.

రెండో విడతలో పంచాయతీ సర్పంచ్ పదవులకు 20,575 నామినేషన్లు

నేడు ఉపసంహరణకు గడువు

మన తెలంగాణ/హైదరాబాద్: రెండో విడతలో పంచాయతీ సర్పంచ్ పదవికి 20,575 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అలాగే వార్డు సభ్యుడి పదవికి 86,55 నామినేషన్లు వేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం స్క్రూటిని అనంతరం సరైన నామినేషన్లుగా ఉన్నవాటిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం రెండో విడతలో 4135 పంచాయతీలకు నోటిఫికేషన్ ఇవ్వగా 4132లకే పోలింగ్ నిర్వహించనున్నారు. మిగతా మూడింటికి సరైన నామినేషన్లు దాఖలు కాక పోవడం, అసలు నామినేషన్లు రాకపోవడంతో వాటికి ఈ నెల 25వ తేదీన ఎన్నిక ఉండదని ఎన్నికల సంఘం తెలిపింది. ఇక 36,602 వార్డులకు గాను 36,362 వార్డులకే ఎన్నిక నిర్వహించున్నారు. ఇందులో 75 వార్డులకు నామినేషన్లు రాకపోవడం, వచ్చిన వాటిలో తిరస్కరణ గురి కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే వనపర్తి జిల్లాలో 7 గ్రామ పంచాయతీలకు, 147 వార్డులకు ఒకే నామినేషన్ దాఖలు అయింది. జోగులాంబ గద్వాల జిల్లాలోనూ 3 పంచాయతీలకు, 18 వార్డులకు ఒకే నామినేషన్ వేశారు. ఇవ్వన్నీ ఏకగ్రీవం కానున్నాయి.

మూడో విడతకు 5290 నామినేషన్లు, రేపు చివరి తేదీ

మూడో విడత పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ పదవికి 5290 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 4116 పంచాయతీలకు బుధవారం నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో సర్పంచ్ పదవికి 1729, 36,729 వార్డులకు 3561 నామినేషన్లు వచ్చాయి. ఈ నెల 18 వరకు నామినేషన్ వేసేందుకు గడువు ఉంది. షెడ్యూల్ ప్రకారం మూడో విడతకు ఈ నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా తనిఖీల్లో ఇప్పటి వరకు రూ. 1.21 కోట్ల నగదును సీజ్ చేశారు. నగదేతర వస్తువుల విలువ రూ.8.03 లక్షలుగా ఉంది.

స్పీకర్‌ను ఏకగ్రీవం చేసుకుందాం

ప్రతిపక్ష పార్టీల నేతలకు సిఎం ఫోన్

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర రెండవ శాసనసభ కొత్త స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా సహకరించాలని విపక్ష పార్టీలకు ముఖ్యమంత్రి కెసిఆర్ విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల సందర్భంగానూ కెసిఆర్ విజ్ఞప్తి మేరకు స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇప్పుడు కూడా అదే సంప్రదాయం కొనసాగే తీరులో ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కు ముఖ్యమంత్రి స్వయంగా బుధవారం సాయంత్రం ఫోన్ చేసి స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు తగిన సహకారాన్ని ఇవ్వాల్సిందిగా ప్రతిపాదించారు. బిజెపి, ఎంఐఎం పార్టీల నేతలు కెసిఆర్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి అంగీకారం తెలిపారు. కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రం పార్టీలో చర్చించిన అనంతరం గురువారం తమ పార్టీ అభిప్రాయాన్ని వెల్లడించనున్నట్లు తెలిపారని టిఆర్‌ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రోటెం స్పీకర్ గురువారం ఉదయం అసెంబ్లీ సమావేశాల్లో నూతనంగా ఎన్నికైన శాసనసభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం కొత్త స్పీకర్ ఎన్నికపై ప్రకటనను, నోటిఫికేషన్‌ను జారీ చేస్తారు. నామినేషన్ల అనంతరం స్పీకర్ ఎన్నిక ఫలితం శుక్రవారం వెల్లడవుతుంది. ఈ నేపథ్యంలో కెసిఆర్ స్వయంగా విపక్ష నేతలకు ఫోన్ చేసి స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు అవసరమైన సహకారాన్ని అందించాల్సిందిగా విజ్ఞప్తి చేయడం గమనార్హం.

దేవాదాయ ఉద్యోగుల బదిలీకి కొత్త విధానాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖలో ఉద్యోగుల బదిలీకి ఇంతకాలం ఉన్న చట్టానికి సవరణలు చేస్తూ ప్రభుత్వం నూతన ఉత్తర్వులను రూపొందించింది. తెలంగాణ హిందు దేవాదాయ, ధర్మాదాయ శాఖ చట్టం 1987లోని నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఒక సంస్థ లేదా ఆలయం నుంచి మరో సంస్థ లేదా ఆలయానికి బదిలీ చేయడంలో నిబంధనలు ప్రతిబంధకంగా ఉన్నాయని, ఫలితంగా బదిలీ చేసిన సమయంలో ఉద్యోగులు కోర్టులకు వెళ్ళడానికి ఆస్కారం కలుగుతోందని, పలితంగా సంస్థలు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆ శాఖ కమిషనర్ ఇటీవల లేఖ రాయడంతో ప్రభుత్వం నూతన ఉత్తర్వులను రూపొందించింది. కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సహాయ కమిషనర్లు ఏదేని పరిస్థితుల్లో ఉద్యోగులను బదిలీ చేయాల్సి వస్తే ప్రస్తుత చట్టం ప్రకారం ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కొత్త నిబంధనల (సర్వీస్ రూల్స్)ను రూపొందించాలని ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి ఈ కొత్త ఉత్తర్వులను జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఉద్యోగులను ఒక సంస్థ నుంచి మరో సంస్థకు బదిలీ చేయవచ్చని, అయితే ఆ ఉద్యోగుల సర్వీసు ఏడాది కాలం మాత్రమే ఉన్నట్లయితే బదిలీ వద్దని, కనీసంగా రెండేళ్ళు ఉండాలని, ఐదేళ్ళకు మించి పని చేస్తూ ఉన్నట్లయితే బదిలీ చేయవచ్చని, ఒకే సారి ఇరవై శాతం మందికంటే ఎక్కువ మంది ఉద్యోగులను బదిలీ చేయవద్దని, బదిలీ చేసే ముందు ఆ ఉద్యోగుల అభిప్రాయాలను, ఆప్షన్లను తెలుసుకోవాలని కొత్త నిబంధనల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధనలపై ఏవైనా అభ్యంతరాలు, అభిప్రాయాలు ఉన్నట్లయితే ప్రభుత్వానికి ఈ ఉత్తర్వులు వెలువడిన 30 రోజుల తర్వాత దేవాదాయ శాఖ కార్యదర్శికి లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చునని పేర్కొనింది.







1, 2. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో జగన్‌తో సమావేశమైన టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంపిలు వినోద్, జోగినపల్లి సంతోష్, ఎంఎల్‌సి పల్లా, శ్రావణ్‌రెడ్డి

3. లోటస్‌పాండ్ వద్ద కెటిఆర్ బృందానికి స్వాగతం పలుకుతున్న వైఎస్‌ఆర్‌సిపి నేతలు

మరో అడుగు ఫ్రంట్‌కు

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు అధికంగా ఈ స్ఫూర్తితో ముందుకు రావల్సిన అవసరం ఉందన్నారు. జగన్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయనీ, ప్రాథమికంగా జరిగిన ఈ చర్చల్లో అనేక సమ్యలపై దృష్టి సారించామని చెప్పారు. జగన్ సైతం ఫెడరల్ స్ఫూర్తితో తమతో కలిసి వస్తారని ఆశిస్తున్నామన్నారు. కెసిఆర్, జగన్‌ల మధ్య భేటీ అనంతరం అనేక అంశాలు వెలుగులోకి వస్తాయన్నారు.

కెసిఆర్ ఆలోచనలను స్వాగతించిన జగన్


తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ స్ఫూర్తికి అనుగుణంగా ఉన్న ఆలోచనలను స్వాగతిస్తున్నట్లు ఏపి ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పారు. ఫెడరల్ ఫ్రంట్ అవశ్యకత గురించి కెసిఆర్ తనకు ఫోన్‌లో వివరించారని, కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎదుర్కోవాలంటే దేశవ్యాప్తంగా రాష్ట్రాలన్నీ ఒకటి కావాలని చెప్పారని గుర్తుచేశారు. రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడుకోవాలంటే పార్లమెంట్‌లో ఎక్కువస్థాయిలో ఎంపిలు గళమెత్తాల్సిన అవసరం ఉందన్నారు. ఏపికి చెందిన 25 మంది ఎంపిలు ప్రత్యేక హోదా కోసం చేస్తున్న ప్రయత్నం సరిపోవడంలేదని చెప్పారు. ఏపికి తోడుగా తెలంగాణలోని 17 మంది పార్లమెంట్ సభ్యులు కలిసివస్తే కేంద్రం పై మరింత ఒత్తిడి పెంచే అవకాశాలు అధికంగా ఉన్నాయనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ప్రత్యేక హోదాకోసం ఎంత పోరాడినా కేంద్రం కదలడం లేదని జగన్ విచారం వ్యక్తంచేశారు. తెలంగాణ పార్లమెంట్ సభ్యుల మద్దతుతో ప్రత్యేక హోదా కోసం ప్రయత్నిస్తే ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్రాల ప్రయోజనాల కోసం కెసిఆర్ చేస్తున్న ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. దేశంలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలకు వైఎస్‌ఆర్ సిపి మద్దతు పలుకుతుందన్నారు. అయితే ఇప్పటివరకు జరిగిన చర్చలు ప్రాథమికమేననీ, త్వరలో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ తో చర్చల అనంతరం మరింత స్పష్టత వస్తుందని జగన్ తెలిపారు.

లోటస్ పాండ్‌లో కెటిఆర్‌కు స్వాగతం

తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాలమేరకు లోటస్ పాండ్‌లోని జగన్ ఇంటికి వెళ్లిన కెటిఆర్‌కు ఘన స్వాగతం లభించింది. కెటిఆర్ వస్తున్నారని తెలిసి వందలాది మంది వైఎస్‌ఆర్ పార్టీ శ్రేణులు తరలి వచ్చారు. కెటిఆర్ రాగానే స్వాగత నినాదాలు చేశారు. లోటస్ పాండ్ ప్రధాన ద్వారం దగ్గరకు వచ్చి వైఎస్‌ఆర్ సిపి పార్లమెంట్ సభ్యులు విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ శాసన సభ్యుడు పార్థసారథి, పార్టీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. కెటిఆర్ తో కలిసి జగన్‌తో చర్చల్లో పాల్గొన్నవారిలో రాజ్యసభ సభ్యుడు జోగిన పల్లి సంతోష్ కుమార్ రావు, లోక్‌సభ సభ్యుడు వినోద్ కుమార్, శాసన మండలి విప్ పల్లారాజేశ్వర్ రెడ్డి, పార్టీ నాయకుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసం కాదు.. హక్కుల కోసమే

ఫెడరల్ ఫ్రంట్‌పై వైఎస్సార్‌సిపి ఎంపి విజయసాయిరెడ్డి



ఫెడరల్ ఫ్రంట్ అధికారం కోసం కాదని, రాష్ట్ర హక్కుల సాధన కోసమేనని వైఎస్‌ఆర్‌సిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అన్నారు. అందులో భాగమే కెటిఆర్, జగన్‌తో భేటీ అయ్యారన్నారు. బుధవారం ఆ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాల హక్కుల కోసం కేంద్రంతో పోరాడటానికి ఒక వేదికగా ఫెడరల్ ఫ్రంట్ ముందుకు సాగుతుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలు ఫెడరల్ ఫ్రెంట్‌లో భాగస్వామ్యులయ్యేందుకు సుముఖత చూపుతున్నాయని వివరించారు. కెసిఆర్ నేతృత్వంలోని ఫ్రంట్‌లో భాగస్వామ్యులైన ప్రాంతీయ పార్టీలు కలిసి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతిస్తాయని వివరించారు. ప్రాంతీయ పార్టీలు ఏకతాటిపై నడిచి లోక్‌సభ సభ స్థానాల్లో జయకేతనం ఎగురవేస్తాయన్నారు. ఆయా రాష్ట్రాలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, తదితర సమస్యలపై లోక్‌సభలో పెద్ద ఎత్తున గళమెత్తేందుకు ఉపకరిస్తుందన్నారు. లోక్‌సభలో సింహభాగం ఫెడరల్ ఫ్రంట్ సభ్యులుగా ఉంటే, రాష్ట్రాల సమస్యలపై పెద్ద ఎత్తున నిరసన తెలిపితే ఆయా రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని విజయసాయి అన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, సహకారాల కోసం, రాష్ట్రాలలోని సమస్యల సాధన కోసం తయారు చేసిన ఆయుధమే ఫెడరల్ ఫ్రంట్ అని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో ఎపి ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్, తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్‌లు ఫెడరల్ ఫ్రంట్ గురించి సుదీర్ఘ చర్చలు జరిపారన్నారు. త్వరలోనే కెసిఆర్ స్వయంగా వైఎస్ జగన్‌తో ప్రత్యేకంగా కలిసి చర్చిస్తారని విజయసాయి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేవారికి మాత్రమే వైసిపి మద్దతు ఉంటుందని విజయసాయిరెడ్డి వివరించారు. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి సభ్యులతో ప్రత్యేక హోదా కోసం పలు రకాల నిరసనలు తెలిపినా కేంద్రం స్పందించకపోవడం విచారకరమన్నారు. దేశ వ్యాప్తంగా ఫెడరల్ ఫ్రంట్ సత్తా చూపి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధిస్తామని విజయసాయి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, వై.వి సుబ్బారెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో కీలక భూమిక పోషించేందుకు, రాష్ట్రాల హక్కుల గురించి పోరాడేందుకు ఏర్పాటు చేసిన వేదికే ఫెడరల్ ఫ్రంట్ అని వివరించారు. దేశంలోని పలు రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలు ఫెడరల్ ఫ్రంట్ వైపు మొగ్గు చూపుతున్నాయన్నారు. ఫెడరల్ ఫ్రంట్ అత్యధిక లోక్‌సభ స్థానాలు కైవలం చేసుకుంటే రాష్ట్రాల భవిష్యత్తు మెరుగుపడుతుందన్నారు. రాష్ట్రాలలోని సమస్యలు, పథకాల కోసం కేంద్రాన్ని నిధుల కోసం అర్థించడం కాదు దర్జాగా డిమాండ్ చేసే స్థాయికి ప్రాంతీయ పార్టీలను తీసుకెళ్లడమే ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యమన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్

ప్రోటెం స్పీకర్‌గా అహ్మద్ ఖాన్ ప్రమాణం



(మొదటిపేజీ తరువాయి)

స్వీకార పత్రంపై గవర్నర్ సమక్షంలో సంతకం చేశారు. అనంతరం గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ప్రోటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, హోం మంత్రి మహమూద్ అలీ, మాజీ స్పీకర్ మధుసూధనాచారి, పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ, బి వినోద్ కుమార్, సంతోష్ కుమార్, శాసనమండలి సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, అమీన్ జాఫ్రీ, శాసనసభ సభ్యులు సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, మహ్మద్ మోజం ఖాన్, కౌసర్ మోహినుద్దీన్, అహ్మద్ బలాల, వి శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణా రావు, డిజిపి మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ అంజనీ కుమార్ తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.





నేటి నుంచి అసెంబ్లీ

అమరవీరుల స్థూపంవద్ద నివాళులు అర్పించనున్న సిఎం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర శాసనసభ సమావేశాలు గురువారం నుండి ప్రారంభం కానున్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన శాసన సభ్యులచేత తాజాగా బాధ్యతలు చేపట్టిన ప్రోటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణస్వీకారం చేయిస్తారు. శాసనసభా నాయకుడైన ముఖ్యమంత్రి కెసిఆర్ చేత తొలుత శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ తర్వాత శాసనసభ్యులచేత అక్షరమాల ప్రకారం ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం సుమారు రెండు గంటల పాటు కొనసాగే అవకాశం ఉంది. అనంతరం శాసనసభ స్పీకర్ ఎన్నికకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ కూడా గురువారమే ప్రారంభం కానుంది.

అమరవీరుల స్థూపానికి సిఎం కెసిఆర్ నివాళి

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ముఖ్యమంత్రి కెసిఆర్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్మారకస్థూపం దగ్గర నివాళులర్పిస్తారు. ప్రగతి భవన్ నుంచి నేరుగా గన్‌పార్కుకు చేరుకున్న అనంతరం కెసిఆర్‌తో పాటు టిఆర్‌ఎస్ శాసనసభ్యులు కూడా అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తారు. అనంతరం అక్కడి నుంచి శాసనసభకు చేరుకుంటారు. ఉదయం 11.05 గంటల నుంచి కెసిఆర్ శాసనసభ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారు. అసెంబ్లీ కార్యదర్శి షెడ్యూలు ప్రకారం ఉదయం 11.30 గంటలకు కొత్త సభ్యుల చేత ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రారంభమవుతుంది.





రేపు స్పీకర్ ఎన్నిక

నూతన శాసనసభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం శాసనసభకు కొత్త స్పీకర్‌ను ఎన్నుకోవడానికి సంబంధించిన ప్రకటనను జారీ చేయడంతో పాటు నోటిఫికేషన్‌ను కూడా ప్రోటెం స్పీకర్ జారీ చేస్తారు. శుక్రవారం కొత్త స్పీకర్ ఎన్నిక, అవసరమైతే పోలింగ్ జరుగుతుంది. ఆ తర్వాత ఫలితాలు కూడా వెలువడతాయి. కొత్త స్పీకర్ ఎన్నిక పూర్తయిన తర్వాత శాసనసభా నాయకుడైన ముఖ్యమంత్రి కెసిఆర్, ప్రతిపక్ష నేత, వివిధ పార్టీల శాసనసభాపక్ష నేతలు కొత్త స్పీకర్‌ను ఆయన స్థానంలో కూర్చోబెడతారు.

అనంతరం వివిధ పార్టీల శాసనసభాపక్ష నేతలతో బిఏసి సమావేశాన్ని నిర్వహించి తదుపరి సమావేశాల కొనసాగింపుపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 19వ తేదీన గవర్నర్ ప్రసంగం, ఆ మరుసటి రోజున ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో చర్చ జరుగుతుంది. ఆ తర్వాత సభ ఆమోదం తెలుపుతుంది.



ఐరాసలో ప్రతి ముగ్గురిలో ఒకరిపై లైంగిక వేధింపులు

ఐక్యరాజ్యసమితి: అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్యసమితిలో పనిచేసే ప్రతి ముగ్గురు ఉద్యోగుల్లో ఒకరు గత రెండేళ్లుగా లైంగిక వేధింపులకు గురవుతున్నారని మంగళవారం ఆ సంస్థ విడుదల చేసిన అధ్యయనంలో వెల్లడించింది. ఇందుకు సంబంధించి మొట్టమొదటిసారిగా సర్వే నిర్వహించినట్లు తెలిపింది. పని చేసే చోట పనితీరును మెరుగు పరుచుకోవడానికి అవసరమైన కొన్నిఆసక్తికరమైన సాక్ష్యాధారాలు ఈ నివేదికలో ఉన్నాయని తమ ఉద్యోగులకు రాసిన లేఖలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెరస్ తెలిపారు. గంత రెండేళ్లలో కనీసం ఒక్కసారైన వేధింపులకు గురైనట్లు పలువురు తెలిపారని పేర్కొన్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరు లేదా 33 శాతంగా ఉందని, అయితే ఏదో ఒక రకమైన వేధింపులకు గురైన వారి శాంతం 38.7 శాతంగా ఉందన్నారు. వాటిలో ఎక్కువగా లైంగిక కథలు, లైంగిక జోకులు, లైంగిక చర్యలకు సంబంధించిన వ్యాఖ్యలు ఉన్నట్లు అధ్యయనం వెల్లడైనట్లు గుటెరస్ పేర్కొన్నారు. ప్రతి ముగ్గురు పురుషుల్లో ఇద్దరు, ప్రతి నలుగురిలో ఒక సూపర్‌వైజర్ లేదా మేనజరు వేధింపులకు పాల్పడుతున్నట్లు తేలిందన్నారు. ప్రతి 10 మంది సీనియర్ లీడర్లలో దాదాపు ఒకరు వేధింపులకు పాల్పడుతున్నట్లు వెల్లడైందన్నారు. లైంగిక వేధింపులు లేని పరిస్థితుల అమలు చేయనున్నట్లు గుటెరస్ ప్రతిజ్ఞ చేశారు.

రాహుల్ అనుచిత వ్యాఖ్య

సంపాదకీయం

ఈ దేశంలో మహిళను కించపర్చడం, ఆమెపై అపవాదులు సృష్టించడం కంటె సునాయాసమైన పని వేరొకటి ఉండదు. తిట్లలో, సంబోధనలో, సంభాషణలో, బహిరంగ ప్రసంగాల్లో అన్నింటా ఆమె బలి పశువవుతుంది. పురుషాధిక్య, అహంకారపూరిత భావజాలం తల కెక్కివున్న సమాజంలో ఇది మామూలే అనుకున్నా సర్వసమానత్వాన్ని శాసిస్తున్న రాజ్యాంగం ప్రకారం ప్రగతిశీల పాలన అందించవలసిన ప్రభుత్వాధికారం కోసం పోటీపడే అగ్రనేతలు సైతం ఈ ధోరణిని వదిలిపెట్టకపోవడమే ఆందోళన చెందవలసిన అంశం. భారతీయ జనతా పార్టీకి ప్రత్యామ్నాయంగా కేంద్రంలో ఆధిపత్యం కోసం నిర్విరామంగా శ్రమిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా ఇందుకు మినహాయింపు కాలేకపోయారు. ఆయన ఇటీవల జైపూర్ రైతు మహాసభలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ మీద చేసిన వ్యాఖ్య మహిళలను దారుణంగా కించపరుస్తూ సాగింది. '56 అంగుళాల ఛాతీ గల చౌకీదారు (కాపలాదారు– ప్రధాని మోడీ) రాఫెల్ కుంభకోణంపై చర్చలో తనను తాను రక్షించుకోలేక పారిపోయారు. తనను రక్షించవలసిందిగా ఒక మహిళను – రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను వేడుకున్నారు' అని రాహుల్ చేసిన వ్యాఖ్యను ఎవరూ హర్షించజాలరు.

యుద్ధంలోనైనా ప్రత్యర్థి నడుముపై భాగమ్మీదనే ఆయుధం ప్రయోగించాలనే ధర్మం పాటిస్తారు. అటువంటిది, స్త్రీ పురుష సమానత్వ సాధనే ధ్యేయంగా ప్రకటించుకున్న మన వంటి ప్రజాస్వామిక దేశంలో మహిళలను బలహీనులుగా, చేతగానివారుగా పరిగణించి మాట్లాడడం కడుహీనమే కాదు అమానుషం కూడా. గాజులు తొడుక్కున్నారు, నీకంటే ఆడదే నయం, మగాడివి కావా వంటి ఎద్దేవా మాటల ప్రయోగం, ఆటలోనో ఇతరత్రానో ఓడిపోయిన వారికి పోస్టులో పసుపు, కుంకుమ, భరిణ వంటి మహిళలను గుర్తుకు తెచ్చే వాటిని పంపించడం మాదిరి చర్యలన్నీ పురుషుడిని ఎక్కువగా, ఆమెను తక్కువగా చూసే దుశ్చర్యలే. అలాగే ఉద్యోగాల్లోనో, రాజకీయాల్లోనో ప్రవేశించడానికి సాహసించే మహిళల మీద అపవాదులు వ్యాప్తి చేసి వారిలోని నైతిక బలాన్ని దెబ్బతీయడం ద్వారా వెనక్కు పంపించడం వంటి దుర్మార్గాలు ఈ దేశంలో కొత్తకాదు.

పితృస్వామిక ఆలోచనలు కరడుగట్టుకుపోయిన సమాజం మనది. ఆడపిల్లకు చదువు అక్కరలేదని ప్రవచించే సంప్రదాయాలు, నమ్మకాలు ఘనీభవించిపోయిన లోకమిది. ఈ స్థితి నుంచి స్త్రీకి సమాన గౌరవ మర్యాదలిచ్చే సమాజ నిర్మాణ లక్ష్యంతో సాగుతున్న ప్రయాణంలో మనమింకా ప్రాథమిక దశలోనే ఉన్నాము. ఇటువంటి నేపథ్యంలో దేశానికి సారథులు కావాలనుకుంటున్న రాహుల్ గాంధీ వంటి వారిలో ఈ చైతన్యం బొత్తిగా కరువు కావడం అభ్యుదయ కాముకులను అమితంగా బాధించేదే. చేసిన పొరపాటునో, తప్పునో అంగీకరించి తక్షణమే క్షమాపణ చెప్పుకోవలసింది పోయి రాహుల్ ఆ బాధ్యత నుంచి తప్పుకోబోవడం మరింత శోచనీయం. నిర్మలా సీతారామన్ స్థానంలో ఒక మగవాడున్నా తాను అలాగే మాట్లాడే వాడేనని ప్రకటించి ఆయన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. లోక్‌సభలో రాఫెల్ పై చర్చలో నిర్మలా సీతారామన్‌కు బదులు పురుష మంత్రి మాట్లాడి ఉంటే ప్రధాని మోడీ అతడిని ముందు పెట్టి తప్పుకున్నారని అనవలసి వస్తుందే గాని ఒక మహిళ వెంట దాక్కున్నారనే వ్యక్తీకరణకు ఆస్కారం కలిగి ఉండేది కాదు. తనకు చేతకాక నిర్మలా సీతారామన్‌ను ఆశ్రయించి ఆమె సాయం తీసుకున్నారనేసి అక్కడితో ఆగిపోయి ఉన్నా రాహుల్ గాంధీని ఎవరూ ఆక్షేపించి ఉండేవారు కాదు. ఒక స్త్రీని అడ్డంపెట్టుకున్నారని అనడం వల్లనే ఆయన మాటలకు అభ్యంతరం చెప్పవలసి వచ్చింది. శబరిమల అయ్యప్ప ఆలయ ప్రవేశానికి ప్రయత్నిస్తున్న మహిళలను రెండుగా కోసి ఒకటి ఢిల్లీకి మరొకటి కేరళ ముఖ్యమంత్రికి పంపాలని మళయాల నటుడు, కేరళ బిజెపి నాయకుల్లో ఒకరు అయిన కొల్లం తులసి చేసిన వ్యాఖ్య గమనించదగినది. స్త్రీని మాత అని, తల్లిని దేవత అని కీర్తించి పూజిస్తున్నట్టు కనిపించే సమాజంలో ఆమెను ఇంటా బయటా అడుగడుగునా అవమానపర్చడం, హింసించడం, హత్యాచారాలు నిరాఘాటంగా సాగిపోవడం, స్త్రీని ద్వితీయ శ్రేణి లేదా ఏ శ్రేణి లేని అల్ప జీవిగా చూడడం నాయకత్వ స్థానాలలోని వారు సైతం వారిపట్ల చిన్నచూపుతో మాట్లాడడం మన దేశం, మన సమాజం పరువును పదేపదే గంగలో కలుపుతున్నాయి.

యుద్ధ నేరస్థుడికి సైనిక కిరీటం

చూపు

యుద్ధ నేరస్థుల విషయంలో శ్రీలంక చాలా సానుభూతితో వ్యవహరిస్తుందని మరోసారి రుజువైంది. యుద్ధ నేరాలకు పాల్పడినట్టు తీవ్రమైన ఆరోపణలున్న మేజర్ జనరల్ షవేంద్ర సిల్వాను శ్రీలంక సైన్యంలో నెంబర్ టు స్థానంలో నియమించి శ్రీలంక తన వ్యవహార శైలి మారలేదని చాటి చెప్పింది. ఈ నియామకంపై అంతర్జాతీయంగా వస్తున్న విమర్శలను కూడా శ్రీలంక లక్ష్య పెట్టడం లేదు.

యుద్ధ నేరాలకు సంబంధించిన ఆరోపణలు తీవ్రస్థాయిలో రావడం వల్లనే 2012లో మేజర్ జనరల్ సిల్వా ఐక్యరాజ్యసమితి సలహా కమిటీ నుంచి తొలగించబడ్డాడు. అదే సంవత్సరం దక్షిణాఫ్రికాలో దౌత్యపరమైన హోదా స్వీకరించడానికి కూడా ఈ ఆరోపణలే అడ్డువచ్చాయి. యుద్ధనేరస్థుడిని అనుమతించడం కుదరదని తీవ్రమైన అభ్యంతరాల తర్వాత ఆయన తప్పుకోవలసి వచ్చింది. అంతర్జాతీయంగా వస్తున్న ఈ విమర్శలను శ్రీలంక లక్ష్యపెట్టడం లేదు. 2017లో శ్రీలంక సైన్యంలో అడ్జుటెంట్ జనరల్ స్థాయికి ఆయన హోదాను పెంచారు. తమిళ పులులతో యుద్ధంలో అత్యంత దారుణంగా యుద్ధ నేరాలకు పాల్పడిన వారికి హోదా కట్టబెట్టే విషయంలో శ్రీలంక ఎవరి మాట వినడం లేదు.

గత సంవత్సరం అక్టోబరులో శ్రీలంక తీవ్రమైన రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. ప్రధానమంత్రి రాణిల్ విక్రమసింఘేను అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన డిస్మిస్ చేశారు. తన పాత మిత్రుడు మహీంద్ర రాజపక్సాను ప్రధానిగా నియమించారు. రాజపక్సాపై కూడా యుద్ధనేరాలకు సంబంధించిన ఆరోపణలున్నాయి. 2005 నుంచి 2015 వరకు రాజపక్సా శ్రీలంక అధ్యక్షుడిగా పనిచేశారు. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలంకను పాలిస్తున్న సంకీర్ణ ప్రభుత్వం ఇప్పుడు చిన్నాభిన్నమవుతున్నట్లు కనిపిస్తుంది. దేశంలో అయోమయం, అలజడి పెరుగుతున్నాయి. సిరిసేన, రాజపక్సా రాజ్యాంగాన్ని అతిక్రమించి నిర్ణయాలు తీసుకోవడం కొంతకాలం కొనసాగింది. చివరకు ఈ కుట్రలు కుతంత్రాలు విఫలమై మళ్ళీ రాణిల్ విక్రమసింఘే ప్రధానమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించారు.

ఈ రాజకీయ సంక్షోభానికి ముందు చోటు చేసుకున్న కొన్ని సంఘటనలు ఈ సంక్షోభం కారణంగా చాలా మంది దృష్టికి రాలేదు. మాలీలో ఐక్యరాజ్యసమితి శాంతిదళాలకు నాయకత్వం వహిస్తున్న శ్రీలంకకు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ కలనా అమునుపురెను ఐక్యరాజ్యసమితి వెనక్కు పంపించేసింది. దానికి కారణం తమిళ పులులతో యుద్ధంలో ఈ లెఫ్టినెంట్ కల్నల్ అరాచకాలు, యుద్ధనేరాలకు సంబంధించిన ఆధారాలు బయటపడడం. శ్రీలంక సైన్యంలో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కున్న అధికారులు చాలా మంది ఉన్నారు.

శ్రీలంక అంతర్యుద్ధంలో శ్రీలంక భద్రతా దళాలు పాల్పడిన అమానుషాలు, మానవ హక్కుల హననాలకు సంబంధించి వివరాలను బట్టబయలు చేసిన సంస్థ పేరు ఇంటర్నేషనల్ ట్రూత్ అండ్ జస్టిస్ ప్రాజెక్ట్. ఈ సంస్థ శ్రీలంక అంతర్యుద్ధంలో సైన్యం పాత్రకు సంబంధించిన వివరాలను తవ్వి ప్రపంచానికి చెప్పింది. ముఖ్యంగా 2015 జనవరిలో సిరిసేన అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాతి నుంచి మానవ హక్కులపై జరిగిన పెద్దపెద్ద దాడులను ఈ సంస్థ బయటకు తీసింది. ఈ ప్రయత్నాల ఫలితంగా ఐక్యరాజ్యసమితి చరిత్రలో మొదటిసారి శాంతిదళంలోని ఒక అధికారిని వెనక్కు పిలుచుకోవాలని శ్రీలంకను కోరడం జరిగింది.



ఐక్యరాజ్యసమితి శాంతి దళం నుంచి పంపేయబడిన శ్రీలంక అధికారి అమునుపురె శ్రీలంక అంతర్యుద్ధం చివరి దశలో కీలక పాత్ర పోషించాడు. ఆయన చేతులకు అంటిన రక్తం మరకల చరిత్ర ఇప్పుడు బయటపడుతోంది. ఐక్యరాజ్యసమితి శాంతి దళాల్లో శ్రీలంక సైన్యం నుంచి అధికారులు రావాలంటే క్షుణ్ణమైన విచారణ అవసరమన్న డిమాండ్ ఇప్పుడు బలం పుంజుకుంటోంది. శ్రీలంక అంతర్యుద్ధంలో ఆసుపత్రులపై కూడా భయంకరమైన దాడులు జరిగాయి. తమిళులను ఊచకోత కోయడం జరిగింది. అమానుషమైన నేరాలు ఎన్నో జరిగాయి. మానవత్వం సిగ్గుతో భూస్థాపితమయ్యే సంఘటనలు చోటు చేసుకున్నాయి. అనేక సంస్థలు, ఈ సంఘటనలపై విచారణ జరిపి ఆధారాలతో సహా వివరాలను బయటపెట్టాయి.

తమిళ పులులు కూడా యుద్ధనేరాలకు పాల్పడిన వివరాలు బయటకు వచ్చాయి. కాని యుద్ధంలో తమిళ పులుల నాయకులందరూ మరణించారు. ఈ నాయకులందరినీ శ్రీలంక సైన్యం చట్టవిరుద్ధమైన పద్ధతిలో హతమార్చిందన్న ఆరోపణలున్నాయి. యుద్ధ నేరాలకు సంబంధించి శ్రీలంక సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు కనబడుతోంది. శ్రీలంక ఈ నేరాలపై విచారణ జరపడమనేది జరిగే అవకాశమే లేదు. శ్రీలంక ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎలాంటి న్యాయ విచారణకు అవకాశం లేదు. ఒకవేళ శ్రీలంక ప్రభుత్వం విచారణకు అంగీకరించిన న్యాయంగా విచారణ జరుగుతుందని నమ్మే పరిస్థితి లేదు. కాబట్టి అంతర్జాతీయ విచారణ సంఘం ఈ విచారణ చేపట్టవలసిన అవసరం ఉంది.

శ్రీలంక సైన్యంపై యుద్ధనేరాల ఆరోపణలు అంగీకరించేది లేదని సిరిసేన అంటున్నాడు. శ్రీలంక సైన్యంలో సంస్కరణలకు అవకాశం ఉన్నట్లు ఇప్పుడు కనబడడం లేదు. ఇటీవలి రాజకీయ సంక్షోభం తర్వాత పరిస్థితి మరింత దిగజారింది. మరోవైపు సిరిసేన యుద్ధ నేరాలకు పాల్పడిన సైనికాధికారులకు ఉన్నత హోదాలు కట్టబెడుతున్నాడు.

అంతర్జాతీయ ఒత్తిడి వల్ల ఇటీవల శ్రీలంకలో తమిళుల పరిస్థితిపై చర్చ మొదలైంది. ప్రపంచ దేశాల్లో తన ప్రతిష్ఠ కాపాడుకోడానికి శ్రీలంక తమిళుల విషయంలో మాట్లాడడం మొదలుపెట్టింది. సిరిసేన ప్రభుత్వం విభిన్నమైనదిగా, రాజపక్సా కాలం నాటి పరిస్థితి ఇప్పుడు లేదని చెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదంతా కేవలం ప్రదర్శన కోసం మాత్రమే జరుగుతుందని, శ్రీలంకలో తమిళుల సమస్యల పరిష్కారానికి శ్రీలంక ఎలాంటి ఆసక్తి చూపించడం లేదని చాలా మంది చెబుతున్నారు. సైన్యంలో సిల్వాలాంటి యుద్ధ నేరస్థులకు ఉన్నత పదవులు కట్టబెట్టడం తమిళులకు స్పష్టమైన సంకేతాలివ్వడానికే అంటున్నారు.

రాజపక్సా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తమిళులను దేశంలో పౌరులుగానే పరిగణించ లేదు. ఇప్పుడు సిరిసేన అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పరిస్థితి మారడం లేదు. తమిళుల పునరావాసం గురించి మాటలు వినబడుతున్నాయి కాని ఆచరణలో జరిగింది చాలా తక్కువ. అంతర్యుద్ధంలో బాధితులైన తమిళులకు పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. యుద్ధ నేరాలకు పాల్పడిన అధికారులను శిక్షించడం కూడా శ్రీలంక ప్రభుత్వ బాధ్యతే. యుద్ధ నేరస్థుల శిక్షలకు బదులుగా పునరావాసం కల్పించినట్లు పరిగణించలేం. ఈ రెండు వేర్వేరు. శ్రీలంక అంతర్యుద్ధంలో ఎంత న్యాయంగా వ్యవహరించిందో యుద్ధ నేరాల విచారణ జరిగితే కాని తెలియదు. చరిత్రపై ఒక మరకగా ఇది కొనసాగుతూనే ఉంటుంది.

* టేలర్ డీబర్ట్ (ది వైర్)

ఓట్ల కోసం పొలాల పొంట..



బి.నర్సన్
9440128169

తెలంగాణ ప్రభుత్వం గత ఏడాది ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం తెరాస పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి విజయ సూత్రంగా పని చేసిందని దేశంలోని అన్ని రాజకీయ పక్షాలు, నాయకులు బలంగా నమ్ముతున్నకాలమిది.

ఇప్పుడు ఎన్నికలు ఎదుర్కొబోతున్న రాష్ట్రాల్లోని పాలకులు ఈ అస్త్రాన్ని సంధించడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. స్వయాన ప్రధాని నరేంద్ర మోడీ సైతం దేశవ్యాప్తంగా రైతు బంధు పథకాన్ని అమలు చేసే ఆలోచనలో ఉన్నట్లు వార్తలొచ్చాయి. గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో అధికారాన్ని కోల్పోయిన బిజెపి తమకు రైతులు వ్యతిరేకించారని, దాని ఫలితంగానే ఓడిపోయామని బలంగా నమ్ముతోంది.

ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో రకరకాల రైతు సహాయక కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో 2017లో భవంతర్ భుగతన్ యోజన మొదలైంది. ఆనాటి ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గత ఖరీఫ్ పంటల కోసం దీనిని ప్రవేశపెట్టిరు. కనీస మద్దతు ధరకు, మార్కెట్ ధరకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రభుత్వం రైతులకు ఈ పథకం కింద చెల్లిస్తోంది. అయితే ఒక్కోసారి కొన్ని పంట ధాన్యాలకు మార్కెట్ ధర మద్దతు ధరకన్నా అధికంగా ఉండడంతో గందరగోళం ఏర్పడుతోంది. మార్కెట్ రశీదు ఆధారంగా వ్యత్యాస మొత్తాన్ని చెల్లించే ఈ విధానంలో అవకతవకలకు అంకెల మార్పిడికి అవకాశం ఉంటుంది. అయితే ఈ పథకం చౌహాన్‌కు ఏ విధంగానూ మేలు చేయలేదు. ఎందుకంటే అప్పటికే అక్కడి రైతుల పరిస్థితి దిగజారిపోయింది. 110 రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ జూన్ 2018లో 10 రోజుల ఆందోళన చేపట్టింది. ఆ ఆందోళనలో భాగంగా జరిగిన పోలీసు కాల్పుల్లో ఆరుగురు రైతులు చనిపోయారు. ఈ సంఘటన జూన్ 6న మందసార్‌లో జరిగింది. ఎలాంటి ఉపశమనాలకు చేతిలోకి రాని విధంగా చౌహాన్ పరిస్థితి దెబ్బతింది.

రాజస్థాన్‌లో కూడా ఎలక్షన్లకు 5 నెలల ముందే వసుంధర రాజె రైతు రుణాల మాఫీ ప్రకటించింది. సహకార బ్యాంకుల నుండి తీసుకున్న వ్యవసాయ రుణాల్లో రూ. 50,000/– వరకు రద్దు చేసింది. రాష్ట్రంలోని 23 లక్షల రైతులకు ఈ లబ్ధి అందింది. కేవలం 15–20 శాతం రైతులే సహకార బ్యాంకులో రుణ గ్రహీతలు కావడంతో మిగితా రైతులను కాంగ్రెస్ దువ్వే అవకాశం దొరికింది.

గత చత్తీస్‌గఢ్ ప్రభుత్వం కూడా రైతులకు పలు రాయితీలు ప్రకటించింది. శాఖాంబరి పథకం కింద వ్యవసాయ పంపుసెట్లకు 75 శాతం గ్రాంట్లు మంజూరు చేసింది. సౌర్వ సుజల యోజన కింది విద్యుత్తును ఉచితంగా సరఫరా చేసింది. కరువు పీడిత ప్రాంతాలను గుర్తించి 96 తహసీల్‌లలో రూ. 568 కోట్లు నష్ట పరిహారంగా రైతులకు అందజేసింది. అయినా చావల్ బాబాగా పేరు పొందిన రమణ్ సింగ్ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం తిరిగి అధికారం చేజిక్కించుకోలేకపోయింది.

దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో రాబోయే ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. వాటిలో ఒడిషా ఒకటి. రైతు బ్యాంకు రుణ మాఫీ కన్నా నగదు అందవేత సత్ఫలితాలిస్తుందని నవీన్ పట్నాయక్ గ్రహించారు. గత నెలలో 'కాలియా' పేరిట ఓ రైతు ఆకర్షక పథకాన్ని రచించారు. దీని కోసం రూ. 10,000 కోట్ల నిధిని రైతు అభివృద్ధి పేరిట కేటాయించారు. రాష్ట్రంలోని 32 లక్షల రైతులకు పంటకు ఎకరాకు రూ. 5000/– చొప్పున ఏడాదికి రూ. 10,000/– అందజేయడం జరుగుతుంది. బ్యాంకు రుణాల మాఫీకన్నా నగదు బదిలీ వల్ల పాలించే పార్టీలకు భవిష్యత్ ప్రయోజనం ఉంటుంది. ఒడిషా రాష్ట్రంలో ఉన్న 32 లక్షల రైతుల్లో కేవలం 20 లక్షల రైతులు మాత్రమే బ్యాంకుల ద్వారా అప్పులు తీసుకున్నారు. భూ యాజమాన్య ఆధారిత నగదు చెల్లింపు ద్వారా మిగితా 12 లక్షల మంది రైతులు కూడా లబ్ధి పొందే అవకాశం ఉంది. ఇది రాబోయే ఎన్నికల్లో నవీన్ పట్నాక్‌కు సహాయికారిగా మారుతుంది. భూమి సొంతదారులకే కాకుండా నిజమైన వ్యవసాయదారులకు ఈ లబ్ధి ఉంటుందని నవీన్ పట్నాయక్ అన్నట్లు పత్రికల్లో వచ్చింది. కాలియా పథకం కింద భూమిలేని పది లక్షల కుటుంబాలకు వ్యవసాయాధారిత వృత్తుల కోసం ఇంటికి రూ. 12,500/– చొప్పున అందజేయడం జరుగుతుంది. ఈ సొమ్మును గొర్రెల పెంపకం, కోళ్ళ ఫారంలు, బాతులు, చేపలు, తేనెటీగల పెంపకం కోసం వినియోగించుకోవాలి. ఈ పథకం కింద రైతు కుటుంబాలకు, ఫించను , బీమా సదుపాయాలు కూడా వర్తిస్తాయి.

ఈ ఏప్రిల్‌లోనే ఎన్నికలు ఎదుర్కొనేందుకు సిద్ధపడుతున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ క్రిషక్ బంధు పథకాన్ని డిసెంబర్ చివరన ప్రకటించారు. క్రిషక్ బంధు దాదాపు తెలంగాణ రైతు బంధు దగ్గరగా ఉంది. ఈ పథకం కింద ప్రభుత్వమే పంట బీమా ప్రీమియంను చెల్లిస్తూ ఏడాదికి ఎకరానికి రూ. 5000/– రైతులకు అందజేస్తుంది. 18 నుండి 60 ఏళ్ల మధ్య వయస్కులైన రైతులు మరణిస్తే రూ. 2 లక్షల పరిహారం అందజేస్తుంది. ఈ పథకం ద్వారా ఆ రాష్ట్రంలోని 72 లక్షల మంది రైతులకు లాభం చేకూరుతుంది.

ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ కన్ను రైతు బంధు పథకంపై పడింది. బ్యాంకు అప్పుల మాఫీ ద్వారా కన్నా రైతు బంధు లాంటి పథకాల ద్వారా ఎక్కువ రైతు కుటుంబాలకు నగదు లబ్ధి జరిగే అవకాశం ఉన్నందున ఈ దగ్గరి దారిని తాను కూడా ఎంచుకోనున్నట్లు వార్తల్లో వచ్చింది. దేశ వ్యాప్తంగా రైతులకు ఏడాదికి ఎకరాకు రూ. 8000 ప్రకటించడానికి ఆయన సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు 0 శాతం వడ్డీ రేటుతో వ్యవసాయ రుణాలు అందజేసే ప్రణాళిక కూడా ఉంది.

అయితే ఈ సందర్భంగా రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామన్న ప్రధాని మోడీ మాటలను గుర్తు చేసుకోవాలి. ప్రకటించిన నాటి నుండి ప్రభుత్వం ఆ దిశగా చేపట్టిన దిశానిర్దేశాలు ఏమిటో తెలియజేయాలి. రైతుల సమస్యలకు రైతు బంధు పాటను ఎత్తుకోవడంతో ప్రధాని రెట్టింపు ఆదాయ వాగ్దానంలోని డొల్లతనం బయట పడుతుంది.

వ్యవసాయంలో ఉన్నా 3 % వృద్ధిరేటుతో రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయడానికి కనీసం 25 ఏళ్లు పడుతుందని ఆర్థిక వేత్తలు ఆనాడే బయటపెట్టారు. రైతుల ఆదాయం పెరగడానికి ఉపయోగపడే కోళ్ల, పశువుల పెంపకం, పాల ఉత్పత్తి, తదితరాలన్నీ పారిశ్రామిక వేత్తల చేతుల్లోకి వెళ్లిపోయాయి. రైతుల ఆదాయమంతా సంకర విత్తనాల, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల కొనుగోలుకే సరిపోవడం లేదు. దేశ వ్యాప్తంగా రైతుల వార్షిక ఆదాయం వెనుకడుగులు వేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతుల సరాసరి వార్షిక ఆదాయం రూ. 72000/– దాటడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. దేశ వ్యాప్తంగా కూడా రైతు కుటుంబాల సగటు ఆదాయం అదే సంఖ్యకు చేరువలో ఉంది. దీని రెండింతల వల్ల కలిగే ప్రయోజనం కూడా అల్పమే.

ఓట్ల కోసం బడ్జెట్‌కు తూట్లు పొడిచి తాత్కాలిక ప్రయోజనం వల్ల రాజకీయ లబ్ధి సాకారమవుతుందికాని రైతు సమస్యలు మాత్రం ఎక్కడివి అక్కడే ఉండి రైతు ప్రాణాలను హరిస్తాయి.

దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో రాబోయే ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. వాటిలో ఒడిషా ఒకటి. రైతు బ్యాంకు రుణ మాఫీ కన్నా నగదు అందవేత సత్ఫలితాలిస్తుందని నవీన్ పట్నాయక్ గ్రహించారు. గత నెలలో 'కాలియా' పేరిట ఓ రైతు ఆకర్షక పథకాన్ని రచించారు. దీని కోసం రూ. 10,000 కోట్ల నిధిని రైతు అభివృద్ధి పేరిట కేటాయించారు. రాష్ట్రంలోని 32 లక్షల రైతులకు పంటకు ఎకరాకు రూ. 5000/– చొప్పున ఏడాదికి రూ. 10,000/– అందజేయడం జరుగుతుంది. బ్యాంకు రుణాల మాఫీకన్నా నగదు బదిలీ వల్ల పాలించే పార్టీలకు భవిష్యత్ ప్రయోజనం ఉంటుంది. ఒడిషా రాష్ట్రంలో ఉన్న 32 లక్షల రైతుల్లో కేవలం 20 లక్షల రైతులు మాత్రమే బ్యాంకుల ద్వారా అప్పులు తీసుకున్నారు. భూ యాజమాన్య ఆధారిత నగదు చెల్లింపు ద్వారా మిగితా 12 లక్షల మంది రైతులు కూడా లబ్ధి పొందే అవకాశం ఉంది.

ఈ పేజీకి రచనలు పంపవలసిన మెయిల్ :
editor@manatelangana.org

భావప్రకటనా స్వేచ్ఛపై మరో దాడి

అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనానికి నయన్ తారా సెహగల్ ను జనవరి 11న ఆహ్వానించాలన్నా ఆ పని చేయలేక పోయినందుకు చాలా మంది, ప్రధానంగా సాహితీ రంగ ప్రముఖులు తీవ్రంగా విమర్శించారు. తమ సంస్థ 92వ వార్షికోత్సవానికి సెహగల్‌ను ఆహ్వానించాలని సాహిత్య సమ్మేళన్ సంస్థవారు అనుకున్నారు. ఆహ్వానం రద్దు కావడం ఆహ్వానితురాలైన సెహగల్‌కు ఎలాగూ ఇబ్బందికరంగానే ఉంటుంది. ఆమెతో పాటు భావ ప్రకటనా స్వాతంత్ర్యం వంటి ప్రజాస్వామ్య అంశాలతో సంబంధం ఉన్న వారికి కూడా చిరాకుగానే ఉంటుంది. ఈ పరిస్థితి నుంచి మూడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొట్టమొదటిది ఆహ్వానాన్ని ఉపసంహరించుకోవడం అంటే ఆత్మగౌరవాన్ని కోల్పోవడమే. అయితే ఇది ఆహ్వానించే వారి ఆత్మగౌరవం కోల్పోవడమా లేక ఆహ్వానితుల ఆత్మ గౌరవానికి భంగం కలగడమా? రెండవది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇలాంటి నిర్ణయం తీసుకున్న వారి నైతిక శక్తి ఏమిటి? మూడవది ఇలాంటి నిర్ణయంవల్ల ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వారి ఆత్మ గౌరవానికి భంగం కలుగుతుందా?

ఈ ఉదంతం తర్వాత అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనం కార్యదర్శి ఆ స్థానానికి రాజీనామా చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలనుకున్నది ఆయనే. రాజీనామా చేయడం అంటే ఆయన తన ఆత్మగౌరవానికి భంగం కలిగినట్టు భావించడమే. ఈ సంస్థ కార్యదర్శి గానీ మరెవరైనా కాని ఆత్మ గౌరవాన్ని ఎందుకు కోల్పోవాలి? రాజకీయాధికారం చెలాయిస్తున్న పక్షం ఎవరైనా అవమాన పడవలసిన పరిస్థితి ఎందుకు తీసుకురావాలి. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వారిలో కొందరు కీలక పాత్ర పోషించి, అధికార పక్షంతో సంధాన కర్తలుగా పని చేసి తమ రాజకీయ, వృత్తిపరమైన లక్ష్యాలు నెరవేర్చుకోవడానికి ప్రయత్నించి ఉండవచ్చు. అందుకే ఈ కార్యక్రమం నిర్వాహకులు ఈ పనే చేసి వెల్లువెత్తుతున్న విమర్శలను భరించడానికి తాము షాక్ అబ్జార్బర్లలా ఉండాలనుకున్నారు. అందుకే సెహగల్‌కు పంపిన ఆహ్వానాన్ని ఏకపక్షంగా ఉపసంహరించుకోవాలని నిర్ణయించారు. దీనికి తోడు ఈ నిర్వాహకులు ప్రభుత్వ ఒత్తిడికి కూడా లొంగిపోయారు.

నిర్వాహక కమిటీ నిర్ణయంతో తమకు ఏ సంబంధమూ లేనట్టుగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి వ్యవహరించారు. సెహగల్ ప్రారంభోపన్యాసం రద్దు కావడంలో వీరి ప్రత్యక్ష ప్రమేయం లేకపోవచ్చు. కానీ ఇలాంటి ఉదంతాల వల్ల లాభం కలిగేది ప్రభుత్వానికే. నిర్వాహకులను అవమానకర స్థితిలోకి నెట్టడంలో ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం సాధ్యం కాదు. మరాఠీ సాహితీ జగత్తులోనివారు ఈ ఉదంతంపై విమర్శలు గుప్పిస్తుంటే ప్రభుత్వం నిర్వాహకులను అడ్డం పెట్టుకుని తమ పాత్ర ఏమీ లేనట్టు వ్యవహరించింది. ఇలా నిందలను, అవమానాలను భరించే వారిని తయారు చేయడంవల్ల అధికార పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ నైతిక విలువలు, ప్రజాస్వామ్య చర్చలు జరిపే అవకాశం తగ్గిపోయాయి.

నయన్ తారా సెహగల్ ప్రసంగం కచ్చితంగా కేంద్రంలోని, రాష్ట్రంలోని ప్రభుత్వాలను విమర్శించేదిగానే ఉండేది. వీరు ప్రభుత్వం మీద వ్యక్తమయ్యే విమర్శలను భరించడానికి సిద్ధంగా లేరు. ప్రస్తుత పరిస్థితికి పూర్తి భిన్నంగా ఎమర్జెన్సీ అమలులో ఉండగా జరిగిన ఒక సంఘటనను గుర్తు చేసుకోవాలి. 1975లో జరిగిన ఈ సంస్థ 51వ వార్షికోత్సవంలో, అప్పటి కేంద్ర మంత్రి వై.బి.చవాన్ ఉండగానే దుర్గా భగవత్ ఎమర్జెన్సీని తూర్పారబడ్తూ ప్రసంగించారు.

పాలక పక్షం ఇలాంటి సందర్భాలలో పాల్గొనడానికి నిరాకరించడం అంతే మారుతున్న పరిస్థితుల గురించి చర్చించడానికి సిద్ధంగా లేకపోవడమే. ఉదాహరణకు ఈ వర్గంవారు అధికారం సంపాదించడం ఎలా అన్న వ్యూహం రూపొందించడంలో నిమగ్నమై ఉంటారు. కానీ సమానత్వం, న్యాయం, గౌరవం లాంటి అంశాలు ఇలాంటి చోట సహజంగానే చర్చకు వస్తాయి గనక ఈ అధికార వర్గాలకు అసలు చర్చించే ఉద్దేశమే ఉండదు. ఇలాంటి చర్చలు అనుమానాలు నివృతి చేసుకోవడానికి అవసరం. ఇతరులతో చర్చించడం ఇష్టం లేకపోతే తమలో తామైనా చర్చించుకోవచ్చు. మానవీయ విలువలు, విశ్వజనీన విలువలు మొదలైన అంశాలపై ప్రస్తుతం అధికారంలో ఉన్న వర్గంలో ఏ స్థాయిలోనైనా చర్చ జరుగుతుందా అన్న విషయం మనకు తెలియదు. ఈ వర్గాలు అధికారం ఎలా సంపాదించాలన్న వ్యూహాలు రూపొందించడానికే తమ సమయమంతా వెచ్చిస్తాయా? పార్టీ స్థాయిలోనూ, ప్రభుత్వ స్థాయిలోనూ కొన్ని అంశాలపై చర్చలను నిరంతరం, నిరవధికంగా వాయిదా వేస్తుంటారు. దీని వల్ల వీరు అధికారం కాపాడుకోవడం మీద మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తున్నారన్న అభిప్రాయం కలుగుతుంది. ఇలాంటి సందర్భాలలో చర్చలో పాల్గొనవలసి వచ్చినప్పుడు 1936లో లాహోర్లో జరగవలసిన జాత్ పాత్ తోడక్ మండల్ సమావేశంలో డా.బి.ఆర్. అంబేద్కర్ చేయవలసిన ప్రసంగం చేయలేకపోయారు. 2019లో నయన్ తారా సెహగల్‌కు అదే పరిస్థితి ఎదురైంది.

ప్రసిద్ధ సాహిత్యవేత్తలు నయన్ తారా సెహగల్‌కు గట్టి మద్దతు అందించారు. ఆమె స్థానంలో మరో ప్రసిద్ధ మరాఠీ రచయితను ఆహ్వానించాలన్న నిర్వాహకుల ప్రతిపాదనను ఆమోదించ లేదు. దీన్నిబట్టి ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పాటుపడ్తున్న సెహగల్ పట్ల గౌరవం ఇనుమడిస్తోంది. భావప్రకటనా స్వేచ్ఛకు అడ్డుతగులుతున్న వారి నైతిక శక్తి దిగజారుతున్నట్టు కూడా రుజువు అవుతోంది.

* (ఇ.పి.డబ్ల్యు.సౌజన్యంతో)

సకుటుంబం



యూట్యూబ్ స్టార్

నేటి యువతకు సోషల్ మీడియాతో ఉన్న అనుబంధం అంతా ఇంతాకాదు... ప్రతిక్షణాన్నీ, ప్రతి సందర్భాన్నీ ఒడిసి పట్టుకుని పోస్ట్ చేయడానికి ఆసక్తి చూపుతారు. ఇక స్మార్ట్‌ఫోన్లు చేతిలోకి వచ్చాక క్షణక్షణం అప్‌డేట్లు చూడటం ఓ అలవాటుగా మారిపోయింది. గంటల తరబడి సోషల్ మీడియాలో కాలక్షేపం చేసే వాళ్ళు కొందరైతే, అదే సోషల్ మీడియాను తెలివిగా వాడుకుంటూ, స్వయంగా ఇన్ ఫ్లుయెన్సర్‌గా మారి లక్షల్లో సంపాదిస్తున్నవారు ఉన్నారు. అలా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కోటీశ్వరాలైన తొలి భారతీయ యువతి ఆష్నా ష్రాఫ్. ముందుగా మేకప్, స్టైల్ చిట్కాలు చెపుతూ సోషల్‌మీడియాలో ఫొటోలు పెట్టేది.

వాటికి విపరీతమైన క్రేజ్ రావడంతో మరిన్ని అడుగులు ముందుకేసింది. ఫాలోవర్స్ పెరిగారు ఇంకోపక్క ఫ్యాషన్ టూరిజం అంశాలపై సొంత బ్లాగ్ రాస్తోంది. బిజిబిజీగా దేశాలు తిరుగుతూ అనుభవాలు పోస్ట్ చేస్తూ నెలకు పాతిక ముప్పై లక్షలు సంపాదిస్తోంది.అంతే కాదు యూట్యూబ్ ఛానల్ కూడా నడుపుతోంది.

గమనిస్తారు జాగ్రత్త...



తల్లిదండ్రులు చెప్పే మంచి మాటలు పిల్లలను ఎప్పుడూ ప్రభావితం చేస్తాయి. అయితే, మాటల కన్నా వాళ్ల చర్యల ప్రభావమే పిల్లల పైన ఎక్కువగా ఉంటుందనేది వాస్తవం. సమస్య ఏమిటంటే, ఒకవేళ తల్లితండ్రులు చెప్పే మాటలకూ, వారి చర్యలకూ మధ్య ఏదైనా వైరుధ్యం కనిపించిందే అనుకోండి. ఆ తర్వాత ఎన్ని మంచి మాటలు చెప్పినా వాళ్లను ప్రభావితం చేయలేకపోతాయి. ఉదాహరణకు పొద్దున 5 గంటలకే నిద్ర లేవాలని పిల్లలకు చెప్పే తండ్రి, తాను మాత్రం 8 గంటలకు లేస్తే వాళ్లకు ఏమనిపిస్తుంది? ఇదేమిటని పిల్లలు ప్రశ్నించకపోవచ్చు. కానీ, లోలోపల గొణుక్కుంటూ ఉంటారు. దాని వల్ల ఒక దశలో తల్లిదండ్రులు ఏం చెప్పినా పెడచెవిన పెట్టే ప్రమాదం కూడా ఏర్పడవచ్చు. ఇంకాస్త ముందుకు వెళితే, స్కూళ్లో టీచర్లు చెబుతున్న వ్యక్తిత్వ విలువలు, నీతీ నియమాల్ని కూడా పిల్లలు, తల్లిదండ్రుల్లో వెతకడం మొదలెడతారు. నిజానికి, పిల్లలకు కావలసిన తిండీ, బట్టలు, పుస్తకాలు సమకూర్చడంతోనే తల్లిదండ్రుల బాధ్యత అంతా అయిపోదు. పిల్లలు తమను చూస్తున్నారనే విషయం గమనించాలి. పెద్దల్ని గౌరవించాలని అస్తమానం పిల్లలకు చెప్పే తలిదండ్రులే, తమ కన్నా పెద్దవాళ్ల పట్ల దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించడం చూసారే అనుకోండి. పిల్లలు దాన్ని అడ్డుకోకపోవచ్చు గానీ, లోలోపల ఉడికిపోతారు. అందువలన పిల్లలు మనల్ని గమనిస్తారనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు ప్రవర్తించడం మంచిది.

"టీనేజీలోనే, పెళ్లయింది. నా భర్తకి తోడుగా చిన్న టీ కొట్టు నడుపుతూ, పొట్ట పోసుకునే వాళ్లం. ముగ్గురు పిల్లలు పుట్టాక భర్త అనారోగ్యంతో మరణించడం నా జీవితంలో అంతులేని విషాదం.



బతుకుపోరులో భవాని

దానికి మించిన మరో ఘోరం...

నాక్కూడా భర్త వల్ల హెచ్‌ఐవీ వైరస్ సోకిందని తెలిసింది. ఇక పిల్లలకి కూడా తప్పదేమోనని అనుమానంతో, అందరం కృష్ణానదిలో దూకుదామని బయలుదేరాం. అదృష్టవశాత్తూ నా ముగ్గురి బిడ్డల్లో ఎవరికీ వైరస్ లేదని రిపోర్ట్ రావడంతో ఆగిపోయాం..." చెప్పడం ఆపి కళ్లు తుడుచుకుంది భవాని.

ఇలాంటి పరిస్థితుల్లో ఇరవై మూడేళ్ళ భవాని కుటుంబభారాన్ని చేతుల్లోకి తీసుకుంది.

బతుకుదెరువు కోసం చిన్న చిన్న పనులు చేసుకుంటూ, అవమానాలు, కష్టాలు, కన్నీళ్లు దిగమింగుకుంటూ ముందుకు సాగింది. పిల్లలను సమాజానికి భారం కాకుండా పెంచడం ఆమె ముందున్న లక్ష్యం. ఉపాధి కోసం ప్రతీ రోజూ వెతుక్కోకుండా స్వయంగా ఏదైనా చేయాలనే తపనతో ఆటో డ్రైవింగ్ నేర్చుకుని, గుంటూరులో మొట్టమొదటి మహిళా ఆటో డ్రైవర్ అయింది. ఆమెకున్న ప్రాణాంతక వ్యాధి మరో రకంగా మేలు చేసింది ఆమెకు.

"ఆడది కనిపిస్తే, కామెంట్లు చేస్తూ వెంటపడే మగాళ్లు ...నా వైరస్ గురించి తెలుసుకుని అమ్మా, చెల్లీ.. అని పిలుస్తూ లైట్ తీసుకోవడం అంత బాధలోనూ కొంత ఊరట..." అంటోంది భవానీ.

ఆమె జీవన చిత్రాన్ని మీడియా ఫోకస్ చేయడంతో, అక్కినేని నాగార్జున "మీలో ఎవరు కోటీశ్వరుడు" టీవీ షోలో పాల్గొనే అవకాశం ఇచ్చాడు. నిరంతరం పోరాటం అలవాటైన ఆమె అక్కడ కూడా, నలభై వేలు గెలుచుకుని పెద్ద కొడుక్కి కాలేజీ ఫీజు కట్టింది.

ఇది భవానీ కథ. ఇది వింటే ఆమె మీద జాలి కంటే గౌరవం కలుగుతుంది.

కానీ, సదరు అక్కడి ప్రభుత్వానికి ఆమె మీద ఇంకా దయ కలగలేదు.

ఉండటానికి చిన్న నీడను, తన బిడ్డలకు ఉపాధి కల్పించమని కలెక్టరాఫీసు చుట్టూ తిరుగుతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదని 'రూరల్‌మీడియా' తో దీనంగా చెప్పింది.

అలాగని సర్కారీ దయకోసం ఎదురు చూడకుండా తన ఊపిరి ఉన్నంత వరకు ఆటోను తిప్పుతూ, కుటుంబాన్ని నడుపుతానని ఆత్మవిశ్వాసంతో అంటోంది.



మగవాడి అడ్డాలోకి దూసుకెళ్లిన కల్పనా చావ్లా, కిరణ్ బేడీ, ఇందిరాగాంధీ, పూలన్ దేవి లాంటి వాళ్ళ కంటే భవానీ లాంటి వాళ్ళు ఏమీ తక్కువ కాదు. నిజానికి వాళ్లందరికంటే ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొని నిలదొక్కుకున్న ఇలాంటి మట్టిలో మాణిక్యాలు ఎందరో ఉన్నారు.. కొందరుంటారు...సాధికారతని మాటల్లోనూ, రాతల్లోనూ, పోస్టుల్లోనూ, ట్వీటుల్లోనూ కాకుండా బతుకుపోరులో చూపిస్తారు. ఆమే భవాని...

శ్యాంమోహన్
(మనతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి)

మెరిసే చర్మం సొంతం కావాలంటే..

అందంగా కనిపించాలంటే చర్మం ఆరోగ్యంగా ఉండాలి. నునుపుగా, తేమతో, కాంతులీనుతూ ఉండే చర్మం కోసం సౌందర్య చికిత్సలకు బదులుగా మంచి పోషకాలున్న ఆహారం మీద ఆధారపడాలి. అలాంటి స్కిన్ ఫుడ్ ఇదే.



బాదం: విటమిన్ ఇ తో నిండి ఉండే బాదం పప్పులోని యాంటీఆక్సిడెంట్లు అతినీలలోహిత కిరణాల నుంచి చర్మ కణాలకు రక్షణ కల్పిస్తాయి. కాబట్టి ప్రతిరోజూ గుప్పెడు బాదం పప్పు తినాలి.

క్యారెట్లు: ఈ ఆరెంజ్ రంగు అద్భుతాలు చర్మపు బాహ్య పొరలో అవసరానికి మించి కణాలు పెరగకుండా నియంత్రిస్తాయి. ఫలితంగా చర్మం నునుపుగా ఉంటుంది.

గ్రీన్ టీ: గ్రీన్ టీ ఆకులు మరిగేటప్పుడు విడుదలయ్యే కోటాచిన్స్‌లోని యాంటీఆక్సిడెంట్లు చర్మపు క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించటంతోపాటు చర్మానికి పోషకాలను అందిస్తాయి.

టమాటాలు: వీటిలోని లైకోపిన్, ఫొటోకెమికల్స్ చర్మానికి వృద్ధాప్య లక్షణాలను తెచ్చిపెట్టే అతినీలలోహిత కిరణాల్లోని ఫ్రీ ర్యాడికల్స్ నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తాయి.



పగడపు రంగు ప్రత్యేకంగా..



ఏటికేడు మేటి అనిపించే డిజైన్లతో, రంగులతో కొత్త ఫ్యాషన్‌లు సందడి చేస్తాయి. ఈ సంవత్సరం కూడా కొత్త రంగు సరికొత్తగా వచ్చేసింది. అదే ఆహ్లాదంగా కనిపించే పగడపు రంగు (కోరల్). పీచ్‌కలర్‌కి కాస్త ఎక్కువగా, కాషాయానికి కాస్త తక్కువగా అనిపించే ఈ పగడపు రంగు ఎవరికైనా ఇట్టే నప్పేస్తుంది. థీమ్ పార్టీలు, పెళ్లి వేడుకలు... సందర్భం ఏదైనా మెప్పిస్తుంది. నీలం రంగులో అన్ని ఛాయలూ దీనికి చక్కగా జతకడతాయి. తెలుపు, నలుపు, గులాబీ, ఊదా...వంటి వాటితోనూ కలబోసుకుని ఆకట్టుకుంటుంది. డ్రెస్‌లు, చెప్పలు వంటివే కాదు...ఆభరణాలు, అలంకరణ వస్తువులను ఈ ఛాయలో ఎంచుకోవచ్చు.









అన్నంతో హాని...

భారత దేశంలో కోట్ల మందికి ప్రధాన ఆహారం వరి అన్నమే. కానీ కూల్ డ్రింక్‌ల కన్నా అన్నమే ప్రమాదమని పరిశోధకులు చెపుతున్నారు. బియ్యం తెల్లగా మెరిసేందుకు మిల్లులో పాలిష్ చేయటం వల్ల పోషకాలన్నీ తౌడుగా మారిపోతున్నాయి. అలా పాలిష్ చేసిన బియ్యం తినటం వల్ల పోషకాలు శరీరానికి అందక కేవలం గ్లూకోజ్ రూపంలో చక్కెర మాత్రమే రక్తంలో కలుస్తుంది. అది పెరుగుతూ చివరకు మధుమేహానికి దారి తీస్తోందని పరిశోధకులు చెపుతున్నారు. ఈ పాలిష్ రైస్ వల్ల బి1, బి2, బి6 విటమిన్లను కోల్పోతున్నామన్నారు. దీంతో నోటి పూత, పెదవులు, పెదవుల చివర్లలో పగుళ్లు, చేతులు, చెంపలపై ఎర్రటి ర్యాషెస్ వంటివి వస్తు న్నాయి. ఈ పోషకాలు కోల్పోవడంవల్ల అల్సర్ వచ్చే ప్రమాదముందన్నారు.

చైనా ,జపాన్ ,అమెరికా ,ఆస్ట్రేలియా లోని 3.5 లక్షల మందిని 20 ఏళ్ళపాటు పరిశీలిస్తే ప్రతి రోజూ కప్పు అన్నం తినే వారిలో వ్యాధి వచ్చే రేటు 11శాతం పెరిగిందని రుజువైంది. చిన్న కూల్ డ్రింక్‌లో కూడా చక్కెర స్థాయి ఎక్కువగా ఉంటుందని అలాంటిది అన్నం అంతకంటే ప్రమాదం అంటున్నారంటే పాలిష్ బియ్యం ప్రభావం ఎలా ఉందో తెలుసుకొమంటున్నారు. బ్రౌన్ రైస్,దొడ్డు బియ్యం తినమంటున్నారు.

డి విటమిన్ లోపం వల్ల భవిష్యత్తులో ఎముకల వ్యాధులు పెరుగుతాయని ఎన్ఐఎన్ శాస్త్రవేత్తలు తెలిపారు. దేశంలో 7.20 కోట్ల మంది మధుమేహంతో, 22% మంది హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్నట్లు పలు అధ్యయనాల్లో తేలిందన్నారు. బియ్యానికి పాలిష్ చేయడంవల్ల అవి విరిగిపోతున్నాయని, దీనివల్ల పోషకాలు తరిగిపోతున్నాయన్నారు.






ఓవరాల్ చాంపియన్ తెలంగాణ

మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ పాఠశాల క్రీడా పోటీల్లో తెలంగాణ ఓవరాల్ మెగా చాంపియన్‌గా నిలిచింది. రాష్ట్ర తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ క్రీడల్లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మోడల్ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. దాదాపు రెండు వేల మంది విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. కాగా, ఆతిథ్య తెలంగాణ జట్టు పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. తెలంగాణ 52 స్వర్ణాలు, 43 రజతాలు, మరో 16 కాంస్యలతో సహా మొత్తం 111 పతకాలు గెలుచుకుని ప్రథమ స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర రెండో, అరుణచల్ ప్రదేశ్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. బాలుర వ్యక్తిగత అథ్లెటిక్ విభాగం పోటీల్లో తెలంగాణకు చెందిన హరిలాల్ ప్రథమ స్థానాన్ని సాధించాడు. బాలికల అథ్లెటిక్ విభాగంలో పోటీల్లో తెలంగాణకే చెందిన వి.స్వాతి చాంపియన్‌గా అవతరించింది. విజేతలకు టిటిడబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టియానా జెడ్ చొంగ్తూ తదితరులు ట్రోఫీలను బహూకరించారు.

సానుకూలంగా స్పందించండి

మనతెలంగాణ/హైదరాబాద్ : ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను పరస్పర అవగాహనతో తెలంగాణకు తీసుకురావాలని ప్రభుత్వ విద్యాశాఖల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనాయకుడు జగన్ మోహన్‌రెడ్డి, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావుకు వినతిపత్రాలను సమర్పించామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నుంచి మురళీకృష్ణ తెలిపారు. ఒకట వతరగతి నుంచి విశ్వవిద్యాలయ చదువులన్నీ తెలంగాణలో చదివి తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొన్న అనేక మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, రాష్ట్ర విభజనతో ఆంధ్రలో పనిచేస్తున్నారని తెలిపారు. 'హెడ్ టూ హెడ్' ప్రతిపాదికన బదిలీలను ఆమోదించాలని కోరారు. సర్వీసు రికార్డుల్లో సకల జనుల సమ్మెలో పాల్గొన్నట్లు ఉండటంతో ఆంధ్రలో తెలంగాణ ఉద్యోగులు ద్వితీయశ్రేణులుగానే చలామని అవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. అలాగే భర్తలు తెలంగాణలో ఉన్న మహిళా ఉద్యోగులు తీవ్రమానసిక వేదన అనుభవిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అమిత్ షాకు స్వైన్ ఫ్లూ..
ఎయిమ్స్‌లో చికిత్స




న్యూఢిల్లీ : బిజెపి అధ్యక్షులు అమిత్ షా స్వైన్ ఫ్లూతో బాధపడుతున్నారు. బుధవారం సాయంత్రం ఆయన చికిత్స కోసం స్థానిక ఎయిమ్స్‌లో చేరారు. తనకు స్వైన్ ఫ్లూ సోకిన విషయాన్ని అమిత్ షా స్వయంగా నిర్ధారించారు. ప్రస్తుతం ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రజానీకం ప్రేమాభిమానాలతో త్వరలోనే కోలుకుంటానని ఆశిస్తున్నట్లు తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక వైద్య విజ్ఞాన సంస్థలోని ప్రైవేటు వార్డులో ఆయనను చేర్పించారు. రెండు రోజుల నుంచి జ్వరంతో షా బాధపడుతున్నారు. ఈ క్రమంలో శ్వాస, ఛాతీ సంబంధిత సమస్యలు తలెత్తడంతో వైద్యులు దీనిని స్వైన్‌ఫ్లూగా గుర్తించారు. ప్రస్తుతం ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా పర్యవేక్షణలో అమిత్ షా వైద్య చికిత్స జరుగుతోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

చంద్రబాబును నమ్మొద్దు!



మన తెలంగాణ/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రజల కష్టాలను పట్టించుకోని ముఖ్యమంత్రి చంద్రబాబును నమ్మవద్దని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కె.ఎ పాల్ ఆ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. నగరంలోని బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రాన్ని చంద్రబాబు భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చక్కగా తెలుగులో మాట్లాడమే రాని లోకేష్‌కు మూడు శాఖల మంత్రి బాధ్యతలను కట్టబెట్టారని, ఏం న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. కుల రాజకీయాలకు తెర తీసిన చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోడిలకు వచ్చే ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తాను బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేస్తున్నానని, ఇప్పటికే 1800 మంది కో ఆర్డినేటర్లను కలిశానని, ఎవ్వరూ ఊహించని విధంగా రానున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ల కలయిక తెలుగు రాష్ట్రాలకు ఒక శుభ పరిణామమన్నారు. కెసిఆర్ మరోసారి తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారని తాను ముందే చెప్పానని, తాను చెప్పినట్లుగానే జరిగిందన్నారు. ఎపిలో ప్రజాశాంతి పార్టీ, తెలంగాణలో తెరాస కలిసి తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి పాటుపడతామన్నారు. బిజెపికి గుండెకాయలాంటి అద్వానీని ప్రధాని నరేంద్ర మోడి అవమానించారని తెలిపారు. బిజెపి, టిడిపిలను ప్రజలు తరిమికొట్టాలని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాశాంతి పార్టీలో సభ్యులుగా చేరాలని కె.ఎ పాల్ కోరారు.

రాపోలు ఆనంద్ భాస్కర్‌కు 'సంసద్ రత్న' అవార్డు



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రస్తుత లోక్‌సభలోని 12 మంది ఉత్తమ పార్లమెంటేరియన్లను 'సంసద్ రత్న' అవార్డుకు 'ప్రైమ్ పాయింట్ ఫౌండషన్', 'ఇ మాగ్జిన్' సంస్థలు ఎంపిక చేసింది. చైన్నె కేంద్రంగా పనిచేసే ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్, ఈ మాగ్జిన్ ప్రెజెన్స్ సంస్థలు ఈనెల 19న ప్రదానం చేస్తాయి. అవార్డులకు ఎంపికైన పన్నెండు మందిలో రాపోలు ఆనంద్ భాస్కర్‌తో పాటు మరో మాజీ రాజ్యసభ సభ్యులతో పాటు ఒక స్టాండింగ్ కమిటీ సభ్యులు కూడా ఉన్నారు. తమిళనాడు గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం జరగనుంది.

దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ చేతుల మీదుగా 2010లో ప్రారంభమైన ఈ అవార్డులు ప్రతి ఏటా ఉత్తమ పార్లమెంటేరియన్లకు అందజేస్తున్నాయి. కేంద్ర మంత్రులు హన్‌రాజ్ ఆహిర్, అర్జున్‌రాం మేఘవాల్‌లతో పాటు ఎంపి ఆనంద్‌రావ్ అడ్సుల్‌లు జ్యూరీ కమిటీగా ఏర్పడి ఈ పన్నెండు మందిని ఎంపిక చేశారు. లోకసభలో వీరి పనితీరు, వివిధ అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొనడం, బిల్లులుపై చర్చించడం, అనుబంధ ప్రశ్నలు వేయడం తదితర అంశాలపై లోకసభ సెక్రటరియేట్, పిఆర్ఎస్ లెజిస్లేటివ్ సంస్థలు అందించిన సమాచారం ఆధారంగా వీరిని అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థలు పేర్కొన్నాయి. రాపోలు ఆనంద్‌భాస్కర్‌తో పాటు సుప్రియా సూలె (మహరాష్ట్ర), శ్రీరంగ్ అప్పా బర్నే (మహరాష్ట్ర), రాజీవ్ శంకర్‌రావు సాతవ్ (మహరాష్ట్ర), ధనుంజయ భీమ్‌రావ్ మహాదిక్ (మహరాష్ట్ర), డాక్టర్ హీనా గావిట్ (మహరాష్ట్ర), బర్తృహరి మెహతాబ్ (ఒడిషా), ఎన్‌కె ప్రేమచంద్రన్ (కేరళ), నిషికాంత్ దూబే (జార్ఖండ్), రజనీ పాటిల్ (మహరాష్ట్ర), డాక్టర్‌వీరప్ప మొయిలీ (కర్నాటక) తదితరులు ఉన్నారు.

కంది రైతుకు క్యాషేది!

- మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలకు మొండిచేయి
- 24 వేల మంది కంది రైతులకు రూ.150 కోట్లు పెండింగ్
- నెలరోజులుగా ఎదురుచూపులు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రైవేట్‌లో అమ్ముదామంటే మద్దతు ధర రాదు.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మితే సమయానికి నగదు రాదు.. ఫలితంగా రాష్ట్రంలోని కంది రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఒక వైపు కేంద్ర ప్రభుత్వం తక్కువ పరిమితిలో కొనుగోళ్లకు అనుమతివ్వగా, మరోవైపు పంటను అమ్ముకున్న రైతులకు సకాలంలో చెల్లింపులు జరగడం లేదు. ఫలితంగా వ్యవసాయం, రైతుల విషయంలో సిఎం కెసిఆర్ ఆశయాలకు అధికారులు తూట్లు పొడిచినట్లవుతుంది. ఇప్పటి వరకు దాదాపు రూ.150 కోట్లు రైతులకు మార్క్‌ఫెడ్ బాకీ పడింది. 24,318 రైతుల దగ్గర నుంచి క్వింటా ఎంఎస్‌పి రూ.5675 చొప్పున 2.60 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేసింది. కొనుగోళ్లు ప్రారంభించి నెల రోజులు గడిచినా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. వాటిని ఎప్పుడు రైతు ఖాతాకు మళ్లీస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి పంట కొనుగోలు చేసిన 72 గంటల్లోపే చెల్లింపులు చేయాల్సి ఉంది. మొత్తం 142 కేంద్రాలకు గాను 73 సెంటర్లలో కొనుగోళ్లు జరుపుతున్నారు. తాజాగా హాకా ద్వారా కొనుగోళ్లు జరిపేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ ఏడాది వానకాలంలో కంది 2.59 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతుందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అంచనా వేసింది. పండిన కందిని కేంద్ర ప్రభుత్వ అనుమతి మేరకు నాఫెడ్ సహకారంతో రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయాలి. అయితే వానకాలం రాష్ట్రం మొత్తం ఉత్పత్తిలో కేంద్ర ప్రభుత్వం కేవలం 70 వేల టన్నులు మాత్రమే ఎంఎస్‌పికి కొనుగోలు చేసేందుకు అనుమతించింది.



ప్రైవేట్‌లో క్వింటా రూ.4500లే

దేశవ్యాప్తంగా, ఇటూ రాష్ట్రంలోనూ కంది నిల్వలు పేరుకుపోవడంతో మార్కెట్‌లో మద్దతు ధర రాని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది కందులకు కేంద్రం కందులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) క్వింటాకు రూ. 5,675 ప్రకటించింది. అయితే మార్కెట్లో వ్యాపారులు మాత్రం కేవలం రూ. 4 వేల నుంచి రూ.4500 వరకు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల వద్దకు వెళితే నెల గడిచినా చెల్లింపులు చేయడం లేదు. గత్యంతరం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులనే ఆశ్రయించి నష్టపోతున్నారు. ఈ క్రమంలో మార్క్‌ఫెడ్ ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కై వారి నుంచి ఎంఎస్‌పి కొనుగోలు చేసే కుయుక్తులు పన్నుతున్నట్లు తెలిసింది. మధ్య దళారీ ఉండకూడదని, నిజమైన కంది రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ఎఇఒ, ఎఒ లనుంచి సర్టిఫికేట్ తీసుకునేలా వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి ఆదేశాలు చేశారు.

గత ఏడాది కూడా కేంద్రం ఇంతే

2017–18లో మార్క్‌ఫెడ్ కందులను సొంతంగా కొనుగోలు చేసింది. అప్పుడు కేంద్రం 75 వేల టన్నుల వరకు ఎంఎస్‌పి కింద కొనేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో మిగిలిన 1.86 లక్షల టన్నులను రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా ఎంఎస్‌పి కింద కొనుగోలు చేసింది. ఈ విషయంలో ఆ నాటి మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

అనర్హత వేటు చెల్లదు : కాంగ్రెస్ ఎంఎల్‌సిలు



మన తెలంగాణ/హైదరాబాద్ : స్థానిక సంస్థల కోటాలో స్వతంత్ర్య అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని, అలాంటప్పుడు తనపై అనర్హత వేటు ఎలా వేస్తారని నిజామాబాద్‌కు చెందిన కాంగ్రెస్ ఎంఎల్‌సి భూపతిరెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇది చీకటి రోజుగా ఆయన అభివర్ణించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భూపతిరెడ్డి మాట్లాడుతూ, ఎంఎల్‌సిగా తాను టిఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నిక కాలేదని, తనకు ఇచ్చిన నోటీసు తప్పుల తడకగా ఉందని అన్నారు. కాంగ్రెస్ పక్షం టిఆర్ఎస్‌లో విలీనమైనట్లు కొద్ది రోజుల క్రితం స్వయంగా శాసనమండలి బులిటెన్ విడుదల చేసిందని, మండలిలో కాంగ్రెస్ పక్షమే లేనప్పుడు ఆ పార్టీలో తాను ఎలా చేరినట్లు అవుతుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కార్యాలయం డైరెక్షన్‌లోనే మండలి చైర్మన్ స్వామిగౌడ్ నిర్ణయాలు తీసుకుంటున్నారని రాములు నాయక్ ఆరోపించారు. ప్రతిపక్షాన్ని లేకుండా చేయాలని చూస్తున్నారన్నారు. టిఆర్ఎస్‌లో చేరిన ఇతర పార్టీల ఎంఎల్‌సిలపై ఎందుకు అనర్హత వేటు వేయలేదని ప్రశ్నించారు. తమపై అనర్హత వేటు వేసి చట్టాన్ని అవహేళన చేశారని యాదవరెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పక్షమే టిఆర్ఎస్‌లో విలీనం అయినప్పుడు తమపై ఎలా చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. టిఆర్ఎస్‌లో ఉంటే ఒక న్యాయం, ప్రతిపక్షాలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు చెందిన ఎంతో మంది ప్రజాప్రతినిధులను టిఆర్ఎస్‌లోకి చేర్చుకున్నప్పుడు గుర్తుకురాని అనర్హత చట్టం ఇప్పుడే వెలుగులోకి వచ్చిందా అని ప్రశ్నించారు.

వైఎస్ షర్మిల ఫిర్యాదుపై దర్యాప్తు ముమ్మరం

- యూట్యూబ్, గూగుల్ సంస్థలకు పోలీసుల లేఖ
- సైబర్ క్రైం అదనపు డిసిపి రఘువీర్

మన తెలంగాణ/హైదరాబాద్ : వైఎస్ జగన్ సోదరి షర్మిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సైబర్ క్రైం అదనపు డిసిపి రఘువీర్ తెలిపారు. గతంలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో ముగ్గురిని అరెస్టు చేశామని, తాజా ఫిర్యాదు దర్యాప్తులో భాగంగా ఆమెపై వీడియోలను ప్రసారం చేసిన యు ట్యూబ్, గూగుల్ సంస్థలకు కూడా లేఖలు రాసి ఆ వీడియోలను అప్‌లోడ్ చేసినవారి వివరాలను, వాటి లింక్‌ల వివరాలను ఇవ్వాల్సిందిగాఆ లేఖలో కోరినట్లు తెలిపారు. మొత్తం 23 మంది పేర్లను ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారని, దానికి సంబంధించి 23 యుట్యూబ్ లింక్‌లపై ఆరా తీస్తున్నామని, ఆ రెండు సంస్థల నుంచి వచ్చే వివరాలతో దర్యాప్తు ఊపందుకుంటుందని వివరించారు. షర్మిల, ప్రభాస్‌లకు సంబంధించిన వీడియోలను ఎవరు అప్‌లోడ్ చేశారో వివరాలు లభ్యం కాలేదని, ఇందుకోసమే సహకరించాల్సిందిగా ఆ రెండు సంస్థలను కోరినట్లు వివరించారు. రెండు వారాల్లో ఆ సంస్థల నుంచి వివరాలు లభిస్తాయని భావిస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. షర్మిల తనంతట తానుగా ధైర్యంతో ముందుకొచ్చి తన దగ్గరున్న వివరాల మేరకు ఫిర్యాదు చేయడం ఆహ్వానించదగినదని రఘువీర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల కొన్ని యూట్యూబ్ ఛానళ్లు, ఫేస్‌బుక్ గ్రూపులలో ఎక్కువగా అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెట్టారని, సామాజిక మాధ్యమాల్లోని వీడియోలు, కామెంట్లకు సంబంధించి ఆయా లింక్ (యూఆర్‌ఎల్)లపై దర్యాప్తు చేపడుతున్నామన్నారు. విచారణ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని, యూట్యూబ్, ఫేస్‌బుక్ నుంచి సమాచారం వచ్చిన తర్వాత మరింత స్పష్టత వస్తుందని అన్నారు. వీడియోలు తయారు చేసిన వాళ్లతో పాటు దీని వెనుక ఉన్న వాళ్లను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నవారితో పాటు చేయిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకుని మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరుతూ షర్మిల తన భర్త అనిల్‌తో కలిసి హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేయడాన్ని ఆయన అభినందించారు.

గణనీయంగా పడిపోయిన
భూగర్భ జలాలు

- 68 మండలాల్లో 20 మీటర్లకు మించి పతనం
- కొల్చారం, దౌల్తాబాద్, బంట్వారంలలో 40 మీటర్ల దిగువకు..

మన తెలంగాణ/హైదరాబాద్ : భూగర్భ జలాలు రాష్ట్రంలోని 68 మండలాల్లో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. భూమట్టానికి 20 మీటర్లకు మించిన లోతుకు నీటిమట్టం ఈ 68 మండలాల్లో పడిపోయింది. ఇందులో మూడు మండలాల్లో అత్యంత ప్రమాదకర స్థాయిలో 40 మీటర్ల కంటే లోతుకు నీటిమట్టం తగ్గింది. మెదక్ జిల్లా కొల్చారం మండలం, సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం, వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలో నీటిమట్టం 40 మీటర్ల కంటే లోతుకు పడిపోయింది. సరైన వర్షాలు లేక, సకాలంలో వర్షాలు రాక, విపరీతంగా నీటిని వినియోగం వంటి రకరకాల కారణాలతో రాష్ట్రంలో నీటిమట్టం పడిపోతోంది. గడచిన దశాబ్దకాలంలో నీటిమట్టం సగటున 9.55 మీటర్లు ఉండగా, డిసెంబరు 2017లో 9.05 మీటర్లుగా ఉంది. ఈ రికార్డులన్నింటినీ తిరగరాస్తూ గత డిసెంబరులో రాష్ట్రంలో సగటున 11.15 మీటర్ల మేర భూగర్భ నీటిమట్టం నమోదైంది. ఏడాది కాలంలో 2.10 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. గత ఏడాది కాలంలో నల్లగొండ జిల్లా, అనుముల మండలంలో కనిష్టంగా 0.02 మీటర్లు, సంగారెడ్డి జిల్లా కంది మండలంలో గరిష్టంగా 23.9 మీటర్ల మేర నీటిమట్టం పెరిగింది. నల్లగొండ మండల కేంద్రంలో కనిష్టంగా 0.01 మీటర్, నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో గరిష్టంగా 28.42 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది.

రాష్టంలో 548 మండలాల్లో 68 మండలాల్లో మాత్రం ప్రమాదకర స్థాయిలో 20 మీటర్ల కంటే దిగువకు నీటిమట్టం పడిపోయింది. వికారాబాద్ మండలంలో గత ఏడాదిలోనే 21.40 మీటర్ల మేర గరిష్టంగా నీటిమట్టం పడిపోయింది. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి, బిజినేపల్లి మండలాల్లో గత ఏడాది కాలంలో కొద్దిగా నీటిమట్టం పెరిగిందని భూగర్భ జల శాఖ అధికారులు చెబుతున్నారు. అయినా 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు నీరు వెళ్లినందున ఆయా ప్రాంతాల్లో నీటి వినియోగంపై పొదుపును పాటించాల్సి ఉంటుందని, పరిస్థితి దిగజారకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



20 మీటర్ల కంటే లోతుకు

భూగర్భ జలమట్టం పడిపోయిన మండలాలివే

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట, కొత్తగూడెం మండలాలు, భూపాలపల్లి జిల్లాలో కాటారం మండలం, జనగాం జిల్లాలోని కొడకండ్ల, రఘునాధపల్లి మండలాల్లో భూగర్భ జలమట్టం ప్రమాదస్థాయికి చేరింది. ఇదేవిధంగా కామారెడ్డి జిల్లాలోని బిక్నూరు, బీబీపేట, దోమకొండ, కామారెడ్డి మండలాలు, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం, మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్, గండీడ్, మహబూబ్‌నగర్ అర్బన్, మిడ్జిల్, రాజాపూర్ మండలాలు, మెదక్ జిల్లాలోని అల్లాదుర్గ్, చేగుంట, కుల్చారం, నర్సాపూర్, పాపన్నపేట, శంకరంపేట రూరల్, శివంపేట, టేక్మాల్, తూప్రాన్ మండలాల్లో నీటిమట్టం 20 మీటర్ల కంటే దిగువకు పడిపోయింది. మేడ్చల్ జిల్లాలోని దుండిగల్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి, కల్వకుర్తి, వెల్దండ, నల్లగొండ జిల్లాలోని మర్రిగూడ, తిరుమలగిరి, నిర్మల్ జిల్లాలోని తానూరు, రంగారెడ్డి జిల్లాలోని ఫరూఖ్‌నగర్, మహేశ్వరం, మంచాల్, మొయినాబాద్, శంషాబాద్, తలకొండపల్లి మండలాల్లో 20 మీటర్ల కంటే దిగువకు నీటిమట్టం పడిపోయింది. సంగారెడ్డి జిల్లాలోని అంథోల్, గుమ్మడిదల్ల, హత్నూర, జిన్నారం, కల్హర్, కోహిర్, కొండాపూర్, నాగల్‌గిద్ద, న్యాలకల్, ఆర్‌సి పురం, రాయకోడ్, సంగారెడ్డి, సిర్గాపూర్, జహీరాబాద్ మండలాలు, సిద్ధిపేట జిల్లాలోని దౌల్తాబాద్, దుబ్బాక, మిర్దొడ్డి, ములుగు, రాయపోల్, తోగుట మండలాలు, సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి మండలం, వికారాబాద్ జిల్లాలోని బంట్వారం, మర్పల్లి, పరిగి, వికారాబాద్ మండలాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు, ఆత్మకూరు, సంస్థాన్ నారాయణపూర్, యాదగిరి గుట్ట మండలాలలో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరింది.

ఎదురు దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో ఎన్నికలు అనివార్యమమవుతాయి. బ్రెగ్జిట్ కోసం ఇయుతో బ్రిటన్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఇయు నేతలు ఇదివరకే ఆమోదించిన విషయం తెలిసిందే. అయితే బ్రెగ్జిట్‌కు బ్రిటన్ పార్లమెంటులో ఆమోదం అభించడం అంత సులభం కాదు. ఎందుకంటే థెరెసా మే కుదుర్చుకున్న ఒప్పందం బ్రిటన్‌కు నష్టం కలిగించేలా ఉందని మెజారిటీ సభ్యులతో పాటుగా ఆమె మంత్రివర్గంలోని మంతులే వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. బ్రిటన్ పార్లమెంటులో బ్రెగ్జిలట్‌పై ఓ వైపు ఓటింగ్ జరుగుతుండగా మరో వైపు పార్లమెంటు వెలుపల ఒప్పం దానికి వ్యతిరేకంగా, అనుకూలంగా జనం పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు.

త్వరగా నిర్ణయం తీసుకోండి: ఇయు

ఇదిలా ఉండగా, బ్రెగ్జిట్‌పై త్వరగా నిర్ణయానికి రావాలని యూరోపియన్ యూనియన్ నేతలు బ్రిటన్‌కు విజ్ఞప్తి చేశారు. సమయం మించి పోతోందని, వీలయినంత త్వరగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని బ్రిటన్‌ను తాను కోరుతున్నానని యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జీన్–క్లాడ్ జన్‌కర్ అన్నారు. కాగా బ్రెగ్జిట్‌పై తాను కుదుర్చుకున్న ఒప్పందంపై సభ్యులను ఒప్పించడంలో థెరెసా మే విఫలమయ్యారని, ఇయు కౌన్సిల్ అధ్యక్షుడు డొనాల్డ్ టస్క్ అన్నారు., ఒప్పందం అసాధ్యమయినప్పుడు, ఎవరికీ ఒప్పందం అక్కరలేనప్పుడు, సరయిన పరిష్కారం ఏమిటో చెప్పే ధైర్యం ఎవరికైనా ఎలా ఉంటుందని కూడా ఆయన అన్నారు. అయితే గత ఏడాది నవంబర్‌లో మేతో తాము కుదుర్చుకున్న ఒప్పందానికి ఆమోదం తెలిపే ప్రణాళికపై ఇయు పార్లమెంటు, వ్యవస్థలు తమ ఒత్తిడిని కొనసాగిస్తూనే ఉంటాయని కూడా ఆయన స్పష్టం చేశారు. అంతేకాదు ఇయునుంచి వైదొలగడానికి ఇయు, థెరెసా మే మధ్య కుదిరిన ఒప్పందం న్యాయమైనది. సరయినదేనని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆపరేషన్ రిటర్న్‌గిఫ్ట్!

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యామ్నాయంలో భాగంగా వైఎస్ఆర్‌సిపి మద్దతును కోరారు. కాంగ్రెస్, బిజెపిలు లేని కూటమికి మద్దతుపై చర్చించారు. త్వరలో ఈ చర్చల కొనసాగింపుగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్న కెసిఆర్ విజయవాడలో జగన్‌తో సమావేశం కానున్నారు.

కెసిఆర్ టు కెటిఆర్ టు ఒవైసీ

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే టిఆర్ఎస్ కేంద్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో కెసిఆర్ తొలిసారిగా చంద్రబాబుకు రిటర్న్‌గిఫ్ట్ అనే ప్రస్తావన తెచ్చారు. ఆ తర్వాత ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సైతం దానికి సానుకూలంగా స్పందించి ఆ రిటర్న్‌గిఫ్ట్ కోసం తాను కూడా ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని వ్యాఖ్యానించారు. ఒవైసీ ఈ వ్యాఖ్యలు చేసిన రోజుల వ్యవధిలోనే వైఎస్ఆర్‌సిపి శాసన సభ్యుడు నగరానికి వచ్చి భేటీ కావడం విశేషం. గత నెల జగన్ పుట్టినరోజు సందర్భంగా టిఆర్ఎస్ ఎంపి కవిత, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంఎల్‌ఏ హరీశ్‌రావు తదితరులు ట్విట్టర్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పుడు ఏకంగా జగన్, కెటిఆర్‌లు భేటీ అయ్యి ఆంధ్రప్రదేశ్‌లోని తాజా రాజకీయ పరిస్థితులు, రెండు జాతీయ పార్టీలకు వ్యతిరేకంగా కెసిఆర్ ఆలోచనల మేరకు ఏర్పడనున్న ఫెడరల్ ఫ్రంట్‌కు ఇచ్చే మద్దతు తదితరాలపై చర్చించారు. ఈ మధ్యలో తలసాని శ్రీనివాస యాదవ్ సైతం ఏకంగా ఆంధ్రప్రదేశ్‌లోనే పర్యటించి రిటర్న్‌గిఫ్ట్ పై అక్కడే వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

కెటిఆర్, జగన్ భేటీపై టిడిపి ఆక్రోశం

కెటిఆర్, జగన్‌ల భేటీపై ఆంధ్ర తెలుగుదేశం పార్టీ నేతలు ఆగ్రహాన్ని, అక్కసును వెళ్ళగక్కారు. ఆ రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, సాగునీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌సి బుద్ధా వెంకన్న తదితరులు ఈ భేటీను తప్పుపట్టారు. వీరి భేటీ వెనక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

ముగ్గురిపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

అనర్హత వేటు వేయాల్సిందిగా టిఆర్ఎస్ చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్ ఇటీవల చర్చలు జరిపారు. ఇరు పక్షాల తరఫున న్యాయవాదులు సైతం ఈ సమావేశానికి హాజరై వాదనలు వినిపించారు. ఈ వ్యవహారాన్ని న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ స్వామి గౌడ్ ఇటీవల వ్యాఖ్యానించారు. టిఆర్ఎస్ ఫిర్యాదు చేసిన నలుగురిలో కొండా మురళి తన ఎంఎల్‌ఏసి సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాన్ని చైర్మన్ ఆమోదించడంతో మిగిలిన ముగ్గురిపై రాజ్యాంగంలోని పదవ షెడ్యూలులో ఉన్న 2 (1) ఏ, 3 సెక్షన్లతో పాటు 191 (2) ప్రకారం అనర్హత వేటు వేస్తున్నట్లు బుధవారం నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు ఈ మేరకు ముగ్గురి అనర్హతపై వేర్వేరు బులెటిన్లు జారీ చేశారు. ఇందులో రాములు నాయక్ గవర్నర్ కోటాలో ఎంఎల్‌సిగా నామినేట్ కాగా, యాదవరెడ్డి ఎంఎల్‌ఏల కోటాలో ఎంఎల్‌సిగా, భూపతిరెడ్డి నిజామాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిగా ఎన్నికయ్యారు. ఈ ముగ్గురిపైనా అనర్హత వేటు పడడంతో శనివారం నుంచి జరిగే శాసనమండలి సమావేశాల్లో హాజరయ్యే అవకాశాన్ని కోల్పోయారు.

మండలిలో ప్రతిపక్షం లేకుండానే..

నలభై మంది సభ్యులున్న రాష్ట్ర శాసనమండలిలో ఈసారి ప్రతిపక్షం లేకుండానే శనివారం నుంచి సమావేశాలు జరగనున్నాయి. మండలిలో కాంగ్రెస్‌కు మొత్తం ఆరుగురు సభ్యులుండగా ఇందులో కొండా మురళి రాజీనామా చేయగా, నలుగురు సభ్యులు (ఆకుల లలిత, సంతోష్‌కుమార్, దామోదర్‌రెడ్డి, ఎంఎస్ ప్రభాకర్‌రావు) ఇటీవల శాసనసభా పక్ష సమావేశాన్ని నిర్వహించి మూడింట రెండు వంతుల సభ్యులు టిఆర్ఎస్‌లో చేరడానికి సిద్ధమైనందున కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని టిఆర్ఎస్‌లో విలీనం చేయాల్సిందిగా చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిశీలించిన చైర్మన్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని టిఆర్ఎస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇక కాంగ్రెస్ తరపున గెలిచిన షబ్బీర్ ఆలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డిలు మాత్రమే మిగిలారు. శాసనమండలిలో కాంగ్రెస్ శాసనసభా పక్షమే లేకుండా పోయింది. కాంగ్రెస్‌కు చెందిన ఈ ఇద్దరూ ఇకపైన ఏ పార్టీ సభ్యులుగా చెప్పుకుంటారనేది కీలకంగా మారింది. బిజెపి తరపున రామచంద్రరావు, ఎంఐఎం తరపున అమీనుల్ హసన్ జాఫ్రిలు ఉన్నారు.

ఏకగ్రీవాలతో గులాబీ హల్‌చల్

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 212 పంచాయతీలు ఏకగ్రీవం
- టిఆర్ఎస్ పక్షానికి బాసటగా ఎక్కువ పంచాయతీలు
- ఏకగ్రీవాల కోసం శ్రమిస్తున్న ఎంఎల్ఏలు
- మూడో విడత తరువాత పెరిగే అవకాశం
- అభివృద్ధిని ఆకాంక్షించే పంచాయతీల్లో ఏకగ్రీవాలు



మనతెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవాల జోరు పెరుగుతోంది. కొత్త పంచాయతీలు గిరిజన తండాలు, ఏకగ్రీవ ఎన్నిక కోసం సాగిస్తున్న మంతనాలు కొలిక్కి వస్తున్నాయి. ఇప్పటికి రెండు విడతల్లో భారీగా ఏకగ్రీవమయ్యాయి. కేవలం అభివృద్ధిని ఆకాంక్షించి పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడిజిల్లాలో 212 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో ఆరు పంచాయతీలు మినహా మిగిత పంచాయతీల్లో టిఆర్ఎస్ మద్దతు దారులు ఏకగ్రీవమయ్యారు. మూడో విడత నామినేషన్ల పర్వం ముగిసిన తరువాత ఏకగ్రీవాల సంఖ్యమరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టిఆర్ఎస్ పల్లెల్లో పట్టు నిలుపుకునేందుకు పగడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతుంది. పంచాయతీ ఎన్నికల్లో పల్లెలన్ని టిఆర్ఎస్‌కు దక్కేలా ఎంఎల్ఏలు ముందుండి తీవ్రంగా శ్రమిస్తున్నారు.బెల్లంపల్లిలో 8, చెన్నూర్‌లో 6, ఆసిఫాబాద్‌లో 3 అత్యధికంగా భోథ్‌లో 60, ఖానాపూర్ 52, సిర్పూర్‌లో 18, నిర్మల్ 32,ముథోల్ 03, ఆదిలాబాద్ 27మొత్తం 212 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కాగా కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఏకగ్రీవం వైపు దృష్టిని కేంద్రీకరించారు. ఓటర్లు తక్కువగాఉండడం,చిన్న పంచాయతీలు కావడం వల్ల సమిష్టి నిర్ణయంతో సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. ఆదివాసీ గిరిజన తండాలలో గిరిజనులంతా ఒక వేదికగా ఏర్పడి నమ్మకమైన వ్యక్తులకు సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తునానరు. స్థానిక ఎన్నికల్లో 76 పంచాయతీలు ఏకగ్రీవం కాగా ప్రస్తుతం ఏకగ్రీవాల సంఖ్య మూడింతలు పెరిగింది. ప్రధానంగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రభుత్వ పరంగా గ్రామానికి నజరానాలు వచ్చే అవకాశాలు ఉండడంతో ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చేనిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చునని ఆలోచనతో పలు గ్రామాల ప్రజలు అడుగులు వేస్తున్నారు. కొమురంభీం ఆసిఫాబాద్‌జిల్లా ఆసిఫాబాద్ మండలం రాపల్లిపంచాయతీ ఎస్‌సిలకు కేటాయించగా అక్కడ ఎస్‌సి సామాజిక వర్గం ఓటర్లు లేకపోవడంతో నామినేషన్‌లు దాఖలు చేయలేదు. అదే విధంగా మండలంలోని అడాదస్నాపూర్ నుంచి వెంకటాపూర్ కొత్తపంచాయతీ ఏర్పాటు చేసినందుకు నిరసనగా ఆగ్రామస్థులు నామినేషన్‌లను దాఖలుచేయలేదు. అంతే కాకుండా పలు చోట్ల టిఆర్ఎస్ మద్దతు దారులు నామినేషన్‌లు సమర్పించిన పంచాయతీల్లో ఇతరులు నామినేషన్ పత్రాలను సమర్పించకపోవడంతో అధికారులు ఏకగ్రీవంగా ప్రకటించారు. మంత్రి వర్గ విస్తరణకంటే ముందు ఎన్నికలు జరుగుతుండడంతో ఎంఎల్ఏలు ఏకగ్రీవం కోసం తీవ్రంగా శ్రమిస్తూ అత్యధిక శాతం పంచాయతీలను తమ ఖాతాలో వేసుకొని అధిష్ఠానం మెప్పు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బరిలో ఉండే పోటీ దారులను బుజ్జగించి ఏకగ్రీవం చేసేందుకు మంతనాలు జరుపుతున్నారు. మూడో విడత పంచాయతీ పోరులో కూడా అత్యధిక శాతం పంచాయతీలను ఏకగ్రీవం చేసే దిశగా ఎంఎల్ఏలు ముందుకు సాగుతున్నారు.

తుది సమరానికి ఏర్పాట్లు సిద్ధం

జిల్లాలో పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతండగా ఇప్పటి వరకు రెండు విడతల ఎన్నికలకు ఏర్పట్లను పూర్తి చేసిన అధికారులు మూడో విడత ఎన్నికలకు కూడా అధికారులు అన్ని విదాలుగా ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో 29 నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 30న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ నిర్వహించే ఏర్పాట్లు చేశారు. భోజన విరామం తరువాత ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ చేపట్టి పూర్తయ్యే వరకు నిర్వహిస్తారు. కౌంటింగ్ పూర్తయిన తరువాత ఎన్నికైన వార్డు సభ్యులతో చేతులు ఎత్తించి ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. మూడోవిడత ఎన్నికల్లో భాగంగా దండేపల్లి మండలంలోని 31 పంచాయతీలు, 278 వార్డులు,లక్షెట్టిపేట 18 పంచాయతీలు 160 వార్డులు, హాజీపూర్ 17 పంచాయతీలు 156 వార్డులు, జన్నారం మండలంలోని 29 పంచాయతీలు 272 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.



జనగామ జిల్లాలో కాల్పుల కలకలం

వైన్‌షాపు వర్కర్లను బెదిరించి రూ.6.70లక్షలు అపహరణ

మన తెలంగాణ / జనగామ క్రైం : జనగామ జిల్లాలోని కొడకండ్ల మండలంలో కాల్పుల కలకలం చోటు చేసుకుంది. మొండ్రాయిలోని తిరుమల వైన్స్ వర్కర్స్ మంగళవారం రాత్రి 11:30 గంటలకు పని ముగించుకొని స్వస్థలమైన పాలకుర్తికి వెళ్తున్న క్రమంలో కొడకండ్ల మండలం రామన్న గూడెం సమీపంలో ఐదుగురు దుండగులు మాటు వేసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వర్కర్స్‌పై తపంచతో (నాటుతుపాకీ) బెదిరించి రెండు రౌండ్లు గాలిలోకి వదిలి వారి వద్ద ఉన్నా రూ.6.70లక్షలు అపహరించుకుపోయారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో నాటు తుపాకీతో కొంతమంది దుండగులు సంచరిస్తున్నారని ప్రజల్లో కలకలం రేగింది. అట్టి విషయాన్ని పోలీసులు దుష్ప్రచారం, నమ్మొద్దని కొట్టిపారేసారు. కానీ ఆ దుండగులే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనస్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ మధుసూదన్, స్థానిక పాలకుర్తి సీఐ రమేష్‌నాయక్, స్థానిక ఎస్సైలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ ఘటనపై ఎలాంటి సమాచారం దొరకలేదని, ఇంకా దుండగుల గురించి జల్లెడ పడుతున్నామన్నారు.

సంక్రాంతి ఉత్సవాల్లో అపశ్రుతి

ఎడ్ల బండి చక్రాల కిందపడి యువకుడి మృతి



మన తెలంగాణ/బిజినేపల్లి : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వడ్డెమాన్ గ్రామంలో సంక్రాంతి పండుట రోజు విషాదం నెలకొంది. ఎద్దుల బండ్లను అలంకరించి ఆలయం చుట్టూ తిప్పే క్రమంలో ప్రమాదవశాత్తు ఎద్దుల బండి చక్రాల కిందపడి జనార్దన్ (32) తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు అతనిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. జనార్ధన్ మృతితో ప్రభుత్వ ఆసుపత్రిలో రోధనలు మిన్నంటగా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి 7 నెలల క్రితమే వివాహము అయిన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

మృతిడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

వడ్డెమాన్‌లో బండి చక్రాల కిందపడి మతి చెంది జనార్దన్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పరామర్శించి మృతుడికి నివాళులు అర్పించారు. జనార్దన్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చాడు.

తల్లి మృతిపై కుమారుడి అనుమానం

కోర్టు ఉత్తర్వులతో ఆర్నెల్లకు మృతదేహం వెలికితీత



మనతెలంగాణ / కరీంనగర్ క్రైం : కన్నతల్లి మృతదేహంపై ఆమె చిన్న కుమారుడు అనుమానం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించగా ఆర్నెళ్ల తరువాత మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన కరీంనగర్ మండలంలోని నగునూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కరీంనగర్ రూరల్ సిఐ శశిధర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగునూరు గ్రామానికి చెందిన అంకమల్ల రామయ్య-రామమ్మ(70)లను ఐదుగురు సంతానం. వారిలో ఇరువురు కుమారులు కాగా ముగ్గురు కుమార్తెలు. అయితే గత సంవత్సరం సెప్టెంబర్‌లో రామమ్మ మృతి చెందింది. అప్పుడు ఆమె మృతదేహం మీద గాయాలుండగా చిన్న కుమారుడు రాజయ్య తన తల్లిది సహజ మరణం కాదని తన సోదరుడు అతని కుటుంబ సభ్యులు కలిసి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేయగా ఆ గ్రామపెద్దలు అతనికి నచ్చజెప్పి కర్మకాండ పూర్తి చేయడం జరిగింది. అయితే రాజయ్యకు ఉన్న అనుమానంతో కోర్టును ఆశ్రయించి కేసు చేయగా కోర్టు రీపోస్టుమార్టం చేయాలంటూ కరీంనగర్ రూరల్ పోలీసులను ఆదేశించింది. ఈనెల 7వ తేదీన కోర్టు నుంచి ఉత్తర్వులు అందుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు విషయాన్ని కరీంనగర్ తహసీల్దార్ జి.కుమరస్వామికి తెలియజేశారు. ఆయన సూచన మేరకు ఆయన సమక్షంలోనే పాతిపెట్టిన రామమ్మ మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి రీపోస్టుమార్టం పరీక్షల కోసం కొన్ని శరీర భాగాలను తీసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించడం జరిగింది. రీ పోస్టుమార్టం నివేదిక ఆధారాన్ని కేసు విచారణ ఉంటుందని కరీంనగర్ రూరల్ సిఐ శశిధర్‌రెడ్డి పేర్కొనగా మృతదేహం వెలికితీతను పురస్కరించుకుని ఏలాంటి గొడవలు తలెత్తకుండా ఉండేందుకు కరీంనగర్ రూరల్ ఎస్.ఐ చంద్రశేఖర్ బందోబస్తు నిర్వహించారు.

ప్రకాష్‌కు 'పర్యావరణ సంరక్షక్' అవార్డు ప్రదానం



మన తెలంగాణ / హైదరాబాద్ : జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాష్‌కు 'పర్యావరణ సంరక్షక్' అవార్డు లభించింది. వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్ర సింగ్ సారథ్యంలోని తరుణ్ భారత్ సంగ్ ఈ అవార్డుకు ప్రకాష్‌ను ఎంపిక చేసింది. అయితే ఇది ముఖ్యమంత్రి కెసిఆర్, వి.ప్రకాష్ జలవనరుల రంగంలో చేస్తున్న విశేష కృషికి దేశవ్యాప్త గుర్తింపుగా భావించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మహాత్మాగాంధీ మనవడు అరుణ్ గాంధీ, ముని మనమడు తుషార్ గాంధీ చేతుల మీదుగా జనవరి 15, 16వ తేదీల్లో రాజస్థాన్ బీకంపురాలో జరిగిన కార్యక్రమంలో వి.ప్రకాష్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రసింగ్ వి.ప్రకాష్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి ప్రముఖ పర్యావరణ వేత్తలు, జలవనరుల సంరక్షణ కోసం అహర్నిశలు కృషిచేస్తున్న సామాజిక కార్యకర్తలు, పలువురు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు హాజరయ్యారు. తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను తన ప్రసంగంలో వి.ప్రకాష్ ప్రస్తావించారు. గతంలో తన జన్మదినాన్ని వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్ర సింగ్ నెక్కొండలోని మిషన్ కాకతీయ చెరువు గట్టున జరుపుకోగా, వి.ప్రకాష్ తన 62వ జన్మదినాన్ని రాజేంద్రసింగ్ ఆశ్రమంలో జరుపుకోవడం విశేషం.

ఇవిఎంల కదలికపై పటిష్ట నిఘా

సాఫ్ట్‌వేర్ సాయంతో జిపిఎస్ ద్వారా నియంత్రణ



మన తెలంగాణ / హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను ముగించిన రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. అసెంబ్లీ ఎన్నికలపై పూర్తి స్థాయిలో విశ్లేషణ చేసిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం పొరపాట్లు, లోపాల నుంచి గుణపాఠాలు తీసుకుని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎలాంటి సమస్యలకు తావు లేకుండా పటిష్టంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇవిఎం ట్రాకింగ్ సిస్టమ్'ను పకడ్బందీగా తీర్చిదిద్ది నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడమే కాకుండా తయారైంది మొదలు ఎన్నికలు జరిగి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచేంత వరకు జిపిఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) ద్వారా ప్రతీ కదలికను కనిపెట్టేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు ప్రారంభించింది. తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇవిఎం ట్రాకింగ్ సిస్టమ్ అనే విధానాన్ని అమలుచేసినప్పటికీ అది కొన్ని దశల వరకు మాత్రమే పరిమితమైంది. ఇప్పుడు కొత్త ఇవిఎంలు ఫ్యాక్టరీలో తయారై గేటు దాటి బైటకు వచ్చింది మొదలు ఓట్ల లెక్కింపు ప్రక్రియ వరకు పూర్తిగా ఒక్కో ఇవిఎం ఎక్కడ నుంచి ఎక్కడకు పోతుందో ఈ సాఫ్ట్‌వేర్‌లో నమోదవుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయంలోని ఓ అధికారి వివరించారు. ఈ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారా జరుగుతోంది కాబట్టి ఇవిఎంల కోడ్ నెంబర్ ఆధారంగా నిర్దిష్ట సమయంలో అది ఎక్కడ ఉందో, ఎక్కడి నుంచి ఎక్కడకు కదిలిందో స్పష్టంగా తెలిసిపోతుందని పేర్కొన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఢిల్లీలో జరిగిన అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారుల సమావేశంలో రానున్న పార్లమెంటు ఎన్నికలకు ఆయా రాష్ట్రాల సంసిద్ధత, తాజాగా అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన రాష్ట్రాల అనుభవాలపై సమీక్ష జరిగినట్లు ఆ అధికారి వివరించారు. త్వరలోనే ఇవిఎం ట్రాకింగ్ సిస్టమ్‌కు సంబంధించిన నూతన సాఫ్ట్‌వేర్, నూతన మార్గదర్శకాలు వస్తాయని, దాని ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పటిష్టమైన శిక్షణ ఇస్తామని వివరించారు. తాజా అసెంబ్లీ ఎన్నికలకు తక్కువ సమయమే ఉండడం, సిబ్బందికి ఇచ్చే శిక్షణ కూడా చాలా తక్కువ సమయంలోనే నిర్వహించాల్సి రావడంతో రాష్ట్రంలోని మొత్తం 33 వేల పైచిలుకు పోలింగ్ కేంద్రాల్లో సుమారు వందకుపైగా పోలింగ్ కేంద్రాల్లో కొన్నిచోట్ల మానవ తప్పిదాలు జరిగాయని, పోలింగ్ ప్రక్రియ ముగిసిపోయిన తర్వాత 'క్లోజ్' అనే బటన్‌ను నొక్కడం ద్వారా పోలింగ్ నమోదును ముగించామనే సందేశాన్ని ఇవిఎంలకు ఇవ్వలేకపోయారని, శిక్షణ తర్వాత కూడా ఆ సిబ్బంది ఈ విషయంలో పొరపాటు చేశారని వివరించారు. ఆ కారణంగానే ఓట్ల లెక్కింపు సమయంలో సైతం కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఈసారి ఇలాంటి పొరపాటు జరగడానికి ఆస్కారం లేకుండా చాలా ముందుగానే ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తామని వివరించారు. ఇవిఎంల పనితీరు విషయంలో ఎలాంటి పొరపాట్లూ లేవని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కొన్నిచోట్ల ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది పొరపాట్లు చేసిన కారణంగా వారి స్థానంలో కొత్తవారిని నియమించాల్సి వచ్చిందని, ఇది కూడా తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఇబ్బందికరంగా మారిందని ఆయన చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో ఇది పునరావృతం కాకుండా ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతీ ఒక్కరికీ అన్ని అంశాల్లో లోతైన శిక్షణ ఇస్తామని, ఇప్పటి నుంచే దాన్ని ప్రారంభించి తగినంత సమయాన్ని కూడా వెచ్చిస్తామని ఆయన తెలిపారు.

2500 రైతు వేదికల నిర్మాణం!

అధికారులకు వ్యవసాయ శాఖ ఆదేశాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల నిర్మాణంపై వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. వ్యవసాయ విస్తరణ అధికారుల క్లస్టర్ల పరిధిలో 2500 రైతు వేదికలు నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు వెంటనే ప్రభుత్వ స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారులకు ఆదేశాలు పంపింది. వాస్తవానికి గత ఏడాదిలోనే రైతు వేదికల నిర్మాణంపై సిఎం కె.చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా రూ.158 కోట్లు బడ్జెట్‌లో చూపారు. రైతు సమన్వయ సమితి సభ్యుల సమావేశాల్లో కొందరు రైతు వేదికల నిర్మాణానికి కొంత విస్తీర్ణంలో భూములను ఇవ్వడానికి కూడా ముందుకొచ్చారు. అలా తొలి విడతలో 19 జిల్లాల్లో 958 రైతు వేదిక (రైతు సమావేశ మందిరాలు)లను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని నిధుల కోసం వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ఫైలును పంపింది. ఇందులో 198 మండలాలు, 652 ఎఇఒ క్లస్టర్ పరిధిలో మొత్తంగా 958 మొదటి విడతలో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలను జిల్లా వ్యవసాయాధికారులు వ్యవసాయ శాఖకు పంపారు. ఇందుకు మొత్తం 328 ఎకరాల స్థలాన్ని కూడా గుర్తించారు. ఇందులో గ్రామ, మండల, జిల్ల రైతు సమన్వయ సమితులకు చెందిన సభ్యుల విరాళల భూములు కూడా ఉన్నాయి. ఒక్కో రైతు వేదికకు రూ.12 లక్షల చొప్పున కేటాయించనున్నారు. అయితే అప్పటికే ఎన్నికల వాతావరణం రావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. ఇప్పుడు మళ్లీ టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో వ్యవసాయ విస్తరణ అధికారి (ఎఇఒ) క్లస్టర్లు, మండల వ్యవసాయాధికారి (ఎమ్ఎఒ) స్థాయిలో మొత్తంగా 2500 రైతు వేదికలను నిర్మించాలని వ్యవసాయ శాఖ భావిస్తోంది. రాష్ట్రంలో 5 వేల ఎకరాలకు ఒక ఎఇఒ ఉన్నారు. ఎఇఒ క్లస్టర పరిధిలో మూడు గ్రామాలకు కలిపి అందరికీ అందుబాటులో ఉండేలా గ్రామంలో రైతు వేదికలను నిర్మిస్తారు. వేదికల్లో మైకు, కుర్చీలు, ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా తీర్చిదిద్దుతారు. ఆ మూడు గ్రామాలకు చెందిన రైతు సమితి సభ్యుల సమావేశాలు అక్కడే నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. రైతులకు సంబంధించిన ప్రతీ కార్యక్రమం ఇక్కడే నిర్వహిస్తారు. ఇప్పటివరకు మండల స్థాయిలోనూ ఇలాంటి సమావేశ మందిరాలు లేవు. కనీసం వ్యవసాయాధికారులకు కూడా మండలాల్లో పూర్తిస్థాయిలో కార్యాలయాలు లేవు. అటువంటిది మూడు గ్రామాలకు కలిపి ఒక సమావేశ మందిరం నిర్మిస్తుండటంతో రైతుల వద్దకు ప్రభుత్వ పథకాలు చేరే అవకాశముంది.

కోదాడలో ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రమాదంలో ముగ్గురు మృతి
- ఒకరికి స్వల్ప గాయాలు
- కారు టైరు పగలడంతో ప్రమాదం





మన తెలంగాణ/కోదాడ క్రైమ్ : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ శివారు గ్రామం కొమరబండ బైపాస్ వద్ద కారు టైరు పగలడంతో అదుపు తప్పి ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కోదాడ రూరల్ ఎస్సై దశరథ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని చెర్లపల్లిలో నివాసం ఉంటున్న రావి వెంకటనాగ మురళికృష్ణ(48) కుటుంబంతో కలిసి సంక్రాంతి సందర్భంగా అత్తగారి గ్రామం నూజీవిడు వెళ్లి తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో కొమరబండ బైపాస్ వద్ద ఈ రోడ్డు ప్రమాదం జరిగినట్లు తెలిపారు. టైర్లు పగలడంతో డివైడర్లను ఢీ కొట్టడంతో కార్లో ఉన్న ముగ్గురు రావి వెంకటనాగమురళికృష్ణ (48), కవిత (42), దనుషా (16) అక్కడికక్కడే మరణించినట్లు తెలిపారు. మురళికృష్ణ కుమారుడు మౌనికకృష్ణ స్వల్ప గాయాలతో బ్రతికి బయటపడ్డాడని, అతనిని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ ఘోర రోడ్డు ప్రమాద విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన సూర్యాపేట జిల్లా ఎస్పి ఆర్. వెంకటేశ్వర్లు, కోదాడ డిఎస్పి, సుదర్శన్‌రెడ్డి, కోదాడ రూరల్ సిఐ రవి కుమార్, పట్టణ సిఐ శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలానికి చెరుకోని ప్రమాదాలకు గల కారణాలను పరిశీలించారు. మృత దేహాలను శవ పరీక్ష నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తిరుమలలో ఘనంగా పార్వేట ఉత్సవం



మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి : కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారికి పార్వేట ఉత్సవము మకర సంక్రమణ నకు మరుసటిరోజైన కనుమ పండుగనాడైన బుధవారం తిరుమలలో అత్యంత ఘనంగా జరిగింది. ఇదే సందర్భంగా గోదాపరిణయోత్సవం కూడా కన్నుల పండుగగా జరిగింది. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ శ్రీ గోదాదేవి చెంత నుండి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. ఈ మాలలను శ్రీవారి మూలమూర్తికి అందంగా అలంకరించారు. బుధవారం స్వామివారికి ప్రాతఃకాలారాధన పూర్తి అయిన తరువాత శ్రీమలయప్పస్వామివారు తిరుచ్చిలో వేంచేసారు. వారి వెంటనే మరో తిరుచ్చిపై శ్రీ కృష్ణస్వామి వేంచేసారు. అనంతరం పార్వేట మండపమునకు వెళ్ళి, ఆ మండపమునందు పుణ్యాహము జరిగిన తరువాత మంచెలో వేంచేసారు. శ్రీస్వామివారికి ఆరాధనము, నివేదనము జరిగాయి. అనంతరం ఉభయదార్లకు తాళ్ళపాక వారికి, మఠంవారికి మర్యాదలు, స్వామివారు మండపమును వదలి ప్రాంగణమునకు వచ్చారు. శ్రీకృష్ణస్వామివారిని మాత్రము సన్నిధి గొల్లపూజ చేసిన చోటుకు వేంచేపుచేసి పాలువెన్న ఆరగింపు అయి హారతి జరిగిన తరువాత శ్రీమలయప్పస్వామివారి సన్నిధికి వెళ్ళారు. తరువాత ఆ గొల్ల సమర్పించిన పాలు వెన్న శ్రీమలయప్పస్వామివారికి నివేదనము హారతి గొల్లకు బహుమానము జరిగింది. తరువాత శ్రీమలయప్పస్వామివారు ముందునకు కొంత దూరము పరుగెత్తి వారి తరపున అర్చకులు బాణమువేసిన తరువాత వెనుకకు వచ్చారు. ఈ విధంగా మూడు సార్లు జరిగింది. స్వామివారి వేటను తిలకించడానికి పార్వేట మండపానికి వేలాదిగా భక్తులు విచ్చేసారు. శ్రీమలయప్పస్వామివారు ఉత్సవము పూర్తయి మహాద్వారమునకు వచ్చి హత్తీరాంజీవారి బెత్తమును తీసుకొని సన్నిధిలోనికి వేంచేసారు. ఇంతటితో ఎంతో వేడుకగా జరిగే పారువేట ఉత్సవము ఘనంగా ముగిసింది. ఈ ఉత్సవంలో ఆలయ ఉపకార్య నిర్వహణాధికారి హరీంద్రనాథ్, షేష్కర్ రమేష్ బాబు, బోక్కసంసెల్ ఇన్‌చార్జ్ గురురాజస్వామి, ఫార్‌ఫతేదార్ శశిధర్, ఇతర ఉన్నతాధికారులు, భక్తులు పాల్గొన్నారు.





వింత పక్షి ప్రత్యక్షం

మన తెలంగాణ/గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెంలో వింతైన పక్షి ప్రత్యక్షమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాదె నాగయ్య రత్తమ్మ నివాసం సమీపంలో ఈ వింతైన పక్షి కనిపించింది. ఈ వింత పక్షిని చూసేందుకు గ్రామస్తులందరూ తరలివచ్చారు.

వివాదం నడుమనే సుప్రీం జడ్జిలుగా ఇద్దరికి పదోన్నతి

న్యూఢిల్లీ : ఇద్దరు జడ్జిలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి లభించింది. ఢిల్లీ హైకోర్టు జడ్జి సంజీవ్ ఖన్నా, కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దినేష్ మహేశ్వరిని అత్యున్నత న్యాయస్థానం జడ్జిలుగా నియమించినట్లు తెలిపే నోటిఫికేషన్ బుధవారం వెలువడింది. ఇద్దరి నియామకంతో సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్య 28కి చేరుతుంది. ఇంకా మూడు ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంటుంది. అత్యున్నత న్యాయస్థానానికి మహేశ్వరి, ఖన్నాలను జడ్జిలుగా తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి నాయకత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియం ఈ నెల 11వ తేదీనే రాష్ట్రపతికి సిఫార్సు చేసింది. దీనికి ఇప్పుడు రాష్ట్రపతి ఆమోదం దక్కింది. దీనితో వారి నియామక ప్రకటన వెలువడింది. అయితే ఖన్నాకు పదోన్నతి ప్రతిపాదనపై పలు స్థాయిలలో నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఈ దశలోనే వాటిని ఖాతరు చేయకుండా నోటిఫికేషన్ వెలువడింది. ఢిల్లీ బార్ కౌన్సిల్ వారు తీవ్రస్థాయిలో ఖన్నా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. ఇతర రాష్ట్రాల హైకోర్టుల న్యాయమూర్తుల సీనియార్టీలను పరిగణనలోకి తీసుకోకుండా , అభ్యంతరాలను లెక్కచేయకుండా ఏకపక్షంగా ఖన్నా పదోన్నతి కల్పించారని విమర్శలు వెల్లువెత్తాయి

అమెరికాలో చికిత్సకు ఆర్థిక మంత్రి జైట్లీ?

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తీవ్ర అనారోగ్య సమస్యతో అమెరికాలో చికిత్సకు వెళ్లినట్లు వెల్లడైంది. అయితే అధికారవర్గాలు దీనిని నిర్ధారించలేదు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో జైట్లీ ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే మూత్రపిండాల మార్పిడి ఆపరేషన్‌తో కోలుకుని తిరిగి లోక్‌సభకు, కొన్ని సమావేశాలకు హాజరవుతూ వచ్చిన జైట్లీ ఇప్పుడు తిరిగి అనారోగ్యం పాలయినట్లు వెల్లడైంది. జైట్లీ త్వరగా కోలుకోవాలని తాము ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ తెలిపారు. సాధారణ వైద్య పరీక్షలు, అంతకు ముందటి ఆపరేషన్ తరువాత తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి అతి కొద్ది రోజుల కోసం ఆయన అమెరికాకు వెళ్లినట్లు సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 31వ తేదీనే పార్లమెంట్ తాత్కాలిక బడ్జెట్ సమావేశాలు ఆరంభం అవుతాయి. ఫిబ్రవరి ఒకటవ తేదీన ఆర్థిక మంత్రి జైట్లీ బడ్జెట్ లోక్‌సభలో ప్రవేశపెట్టాల్సి ఉంది. సాఫ్ట్ టిష్యూ క్యాన్సర్ సంబంధిత సమస్యలతో ఆయన బాధపడుతున్నట్లు ది వైర్ పత్రిక తెలిపింది. అయితే ఆయన రెండు వారాల వ్యక్తిగత సెలవుపై అమెరికాకు వెళ్లినట్లు , న్యూయార్క్‌లో వైద్య పరీక్షలు జరిపించుకోనున్నట్లు వెల్లడైంది. ఒక వేళ తిరిగి ఆపరేషన్ జరిగితే పది పదిహేను రోజుల వ్యవధిలోనే ఆయన తిరిగి దేశానికి చేరుకుంటారా? అనేది స్పష్టం కావడం లేదు. దీనికి సంబంధించి అధికారిక వివరణ త్వరలో వెల్లడవుతుందని భావిస్తున్నారు. గత ఏడాది జైట్లీకి ఆపరేషన్ జరిగినప్పుడు రైల్వే మంత్రి పియూష్ గోయల్ ఆర్థిక మంత్రిత్వశాఖ బాధ్యతలను కూడా స్వీకరించారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలకు ముందు అత్యంత కీలకమైన బడ్జెట్‌ను దేశ ప్రజల ముందు జైట్లీ ఉంచుతారా? లేదా అనేది స్పష్టం కాలేదు.

కరివేపాకు సాగుతో కాసుల పంట

మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే అధిక లాభాలు



మన తెలంగాణ/ఖమ్మం : వాణిజ్య పంటలను నమ్ముకుని, పంట మంచి దిగుబడి వచ్చినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక నష్టపోయిన రైతులు ఒక సందర్భంలో పెట్టుబడులకు సైతం డబ్బులు లేక అప్పులపాలవుతున్నారు. ప్రకృతి కనికరించకపోవడం, కనికరించినా చీడ పీడలు, పండిన పంటకు గిట్టుబాటు ధర రాక వరుస నష్టాలను చవిచూసిన రైతాంగం ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించి దీర్ఘకాలిక పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. ఆరుగాలం కష్టపడ్డ కూలీ మందం కూడా రైతుకు గిట్టుబాటు కాని పరిస్థితి నుంచి నేడు సొంతంగా పెట్టుబడులు పెట్టుకుని మార్కెట్‌కు అనుగుణంగా ఉద్యానవన పంటలతోపాటు వివిధ కూరగాయల పంటలను సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. ప్రధానంగా ఖమ్మం జిల్లాలో ఖమ్మం రూరల్, అర్బన్, తిరుమలాయపాలెం, కూసుమంచి, ముదిగొండ, కొణిజర్ల, వైరా, తల్లాడ, మధిర, ఏన్కూర్, జూలూరుపాడు, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, ఇల్లందు, మణుగూరు, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో గత రెండు మూడు సంవత్సరాలుగా కరివేపాకు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరిన్ని అద్భుతాలు సృష్టిస్తామని రైతులు భరోసాతో చెబుతున్నారు. సర్కార్ స్పందించి తమకు భరోసా కల్పించాలని కోరుతున్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో సుమారు 500 నుంచి 1000 ఎకరాల్లో కరివేపాకు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. కరివేపాకు సాగుకు ఖమ్మం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి విత్తనాలు తెచ్చుకుని సాగు చేస్తున్నారు. ఎకరాకు 90 కిలోల దాకా విత్తనాలు కావాలి. ఎకరాకు రూ. 70వేలు పెట్టుబడి అవుతుంది. ఒక్కసారి విత్తనం వేస్తే నేల స్వభావాన్ని బట్టి రెండు మూడేళ్లకు పైగా దిగుబడి వస్తూనే ఉంటుంది. ఎకరాకు ఐదు ప్యాకెట్ల ఫాస్పేట్ వాడాల్సి వస్తుందని, ఇందుకు రూ.5వేలు ఖర్చవుతుందని తెలుపుతున్నారు. చీడపీడల నివారణకు పది రోజులకు ఒకసారి పురుగు మందులు పిచికారి చేస్తారు. నాలుగు నెలలకు ఒక కోత వంతున ఎకరానికి తొమ్మిది టన్నుల దిగుబడి వస్తుంది. దిగుబడి బాగుంటే పది టన్నులు కూడా వస్తుంది. ఆకును నేరుగా మార్కెట్‌కు తీసుకొస్తే రైతుకు మంచి లాభం వస్తుంది. కాని ఎక్కడికి తీసుకెళ్లాలో రైతులకు తెలియక పోవడంతో దళారులు రంగ ప్రవేశం చేస్తున్నారు. వ్యాపారులు కొందరు పొలం దగ్గరకు వచ్చి కిలోల చొప్పున కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం రైతుకు కిలోకు రూ.2 వస్తుండటంతో డిసెంబర్ నెల ప్రాంతంలో రూ.15 నుంచి 20 వరకు లభిస్తుంది. ఖర్చులు పోగా ఏటా ఎకరాకు రూ.50 వేల నుంచి లక్ష వరకు ఆదాయం పొందిన రైతులు కూడా ఉన్నారు. మా పంటను తక్కువ ధరకు కొని వ్యాపారులు ప్రధాన నగరాల్లో అమ్మి లాభాలు గడిస్తున్నారని తెలుసు, కానీ ఏం చేయాలో తెలియక వచ్చిన దానితో సరిపెట్టుకుంటున్నామని రైతులు అంటున్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో వందలాది మంది రైతులు కరివేపాకు సాగు చేస్తున్నా దీనికి సంబంధించిన ఉద్యానవనశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు తెగులు వ్యాపిస్తే గతంలో దీనిని సాగు చేసిన రైతుల సలహాలతోనే నివారణ చర్యలు చేపట్టాల్సి వస్తుందని వారు తెలిపారు. అలాంటి సమయాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు అందిస్తే మెరుగైన దిగుబడులు సాధిస్తామని రైతులు తెలిపారు. కరివేపాకు పంటకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మేము ప డిన కష్టం దళారుల పాలు కాకుండా ఉంటుందని వారు చెబుతున్నారు. ఈ పంట సాగుకు రుణ సౌకర్యం, బీమా లాంటివి కల్పిస్తే మరింత స్థాయిలో కరివేపాకు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడల్లో సత్తాచాటిన తెలంగాణ బాలబాలికల జట్లు



మన తెలంగాణ /సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేటలో జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీల్లో బుధవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలుర, బాలికల జట్లు ఘన విజయం సాధించాయి. ఈ నెల 12న పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఈ క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాల్లో 29 రాష్ట్రాలకు చెందిన బాలుర, బాలికల జట్లు పాల్గొన్నాయి. ఐదు రోజుల పాటు కొనసాగిన ఈ క్రీడా పోటీల్లో చివరి రోజు ఢిల్లీ బాలుర జట్టు, తెలంగాణ బాలుర జట్టు తలపడగా తెలంగాణ బాలుర జట్టు విజయం సాధించింది. అలాగే హర్యానా బాలికల జట్టు, తెలంగాణ బాలికల జట్టు పోటీపడగా చివరికి తెలంగాణ బాలికల జట్టు విజయం సాధించింది. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, పట్టణ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, జిల్లా కలెక్టర్ దేవరకొండ కృష్ణభాస్కర్, సిపి జోయల్ డేవిస్, జాయింట్ కలెక్టర్ పద్మాకర్, డిఇఒ రవికాంత్, తదితరులు అభినందించి బహుమతులను ప్రదానం చేశారు.



ప్రేమ పేరుతో ప్రియురాలి మృతి


- మనస్థాపంతో ప్రియుడి తండ్రి మృతి
- పాలంపేటలో విషాదం
- పోలీసుల బందోబస్తు మధ్య మృతదేహాలకు అంత్యక్రియలు





మన తెలంగాణ/వెంకటాపూర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గత రెండ్రోజుల్లో ఇద్దరు పురుగుల మందు తాగి మృతి చెందారు. వివరాల్లోకివెళ్తే పాలంపేట గ్రామానికి చెందిన బోడ సుమలత, సం జీవ దంపతుల కూతురు సిందూజ జవహర్‌నగర్ గ్రామంలో ఉన్న మాడల్ స్కూల్‌లో సెకండీయర్ బైపిసి చదువుతుంది. పాలంపేట గ్రామానికి చెందిన కొండబర్తుల రమేష్, సిందూజ గత సంవత్సరం నుండి ప్రేమించుకుంటున్నారు. సిందూజ మైనర్ కావడం వలన మేజర్ అయ్యే వరకు ప్రేమించుకున్న విషయాన్ని ఎవ్వరికి చెప్పకుండా ఉన్నారు. సిందూజ తల్లిదండ్రులు హైద్రాబాద్‌లో పని నిమిత్తం వలస వెళ్లారు. పాలంపేటగ్రామానికి తరుచూ వస్తుండేవారు. ప్రేమించుకునే విషయాన్ని తల్లిదండ్రులకు తెలియకుండా అలాగే మబ్యపెట్టింది. ఇది చిన్న చిన్నగా అందరికి తెలిసిపోవడంతో సిందూజకు సంబంధించిన బాబాయ్ తల్లిదండ్రులు సిందూజను మందలించారు. దాంతో మనస్థాపం చెందిన సిందూజ పురుగుల మందు తాగి సోమవారం మృతి చెందింది. సిందూజ తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరహరి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సిందూజ తల్లిదండ్రులు వారి కుటుంబ సభ్యులు అందరు కోపంతో సిందూజ మృతదేహాన్ని కొండబర్తుల రమేష్ ఇంటి ముందు ఉంచి ధర్నా చేశారు. దీంతో గొడవ పెద్దగా కావడంతో పోలీసులు గొడవను సద్దు మనిగించారు. ఇలా గొడవ పెద్దది కావడంతో కొండబత్తుల రమేష్ తండ్రి రాజు మనస్తాపంతో మంగళవారం పురుగుల మందు తాగాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ములుగు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. కొండబత్తుల రమేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలు కాకుండా ఎస్ఐ నరహరి 144 సెక్షన్ ఏర్పాటుచేశారు. ఎలాంటి గొడవ లేకుండా మృతదేహాలకు అంత్యక్రియలు అయ్యేంత వరకు గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. ప్రస్తుతం పాలంపేటలో విషాధం నెలకొంది.

స్వాతంత్ర్య సమరయోధుడు లక్ష్మారెడ్డి మృతి



మన తెలంగాణ/హుజూర్‌నగర్ : ప్రము ఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకుడు కాకి లక్ష్మారెడ్డి(88) అనారోగ్య ంతో బు ధవారం మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన ఖ మ్మం ఆస్పత్రిలో చికిత్స పొం దుతూ మృతిచెందారు. ఆయనకు భార్య, నలుగురు కు మారులు, ఒక కుమార్తె ఉన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సమర యోధుల సంఘానికి ఎనలేని సేవలను అందించి, ఎందరో పేదలకు అండగా ఉన్నారు. సిపిఐఎంఎల్ చంద్రపుల్లారెడ్డి న్యూడెమోక్రసిలలో క్రియాశీలకంగా పనిచేసి, రాష్ట్ర స్థాయిలో వివిధ హోదాల్లో పని చేశారు.

గొంతుకోసి యువకుడి హత్య

మనతెలంగాణ/ తంగళ్లపల్లి: పండుగపూట స్నేహితులతో గడిపి వస్తానని చెప్పి ఇంటి నుం చి బయలుదేరిన యువకుడు హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన పత్రి సాయి(22) డిగ్రీ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా గడిపివస్తానని కుటుంబీకులకు తెలిపి బయటకు వెళ్లాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో పండుగపూట స్నేహితుల ఇంటిలో ఉంటాడని కుటుంబీకులు భావించారు.

ప్రాణం తీసిన పతంగి



మన తెలంగాణ/సదాశివనగర్: గాలిపటం ఎగురవేస్తూ బాలుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సదాశివనగర్ గ్రామానికి చెందిన పోలబోయిన ధర్మపురి అనే బాలుడు మంగళవారం సాయంత్రం గాలిపటం ఎగురవేస్తూ 44వ జాతీయ రహదారి దాటుతుండగా స్విఫ్ట్ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బాన్సువాడ సమీపంలోని పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ధర్మపురి సంక్రాంతి సెలవుల్లో ఇంటికి వచ్చి ప్రమాదంలో మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జె. నరేష్ తెలిపారు.

పంచలోహ విగ్రహాల చోరీ

- నాగ్‌సాన్‌పల్లి గుడి ధ్వంసం
- శంకర్‌పల్లిలో రూ.10కోట్లకు బేరసారాలు?
- వ్యాపారి చొరవతో పోలీసుల వలలో దొంగల ముఠా?





మన తెలంగాణ/వికారాబాద్ జిల్లా ప్రతినిధి/కోటపల్లి : వికారాబాద్ జిల్లా, కోటపల్లి మండలం, నాగ్‌సాన్‌పల్లిలో పురాతన సంగమేశ్వర ఆలయంలో విలువైన పంచలోహ విగ్రహాలను ఎత్తుకుపోయారు. వాటిని శంకర్‌పల్లిలో ఓ వ్యాపారి వద్ద విక్రయించేందుకు బేరమాడిన దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. రూ.7 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఓ వ్యాపారి సిద్ధపడగా రూ.10 కోట్లకు విక్రయించేందుకు బేరసారాలు ఆడిన ముఠా ఆట కట్టించారు. ఓ వ్యాపారి ఇచ్చిన కీలక సమాచారంతో నవాబ్‌పేట పోలీసులు వారిని పట్టుకున్నారు. స్థానికుల కథనం మేరకు నాగ్‌సాన్‌పల్లి గ్రామానికి కూతవేటు దూరంలో చెర్వు పక్కన మాజీ సర్పంచ్ అనంతరాములుగౌడ్ వ్యవసాయ క్షేత్రంలో పురాతన సంగమేశ్వర ఆలయం ఉంది. పదేళ్ల క్రితం గుడి నిర్మాణాన్ని అర్థాంతరంగా నిలిపివేశారు. అక్కడ విలువైన పంచలోహ విగ్రహాలు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. నాలుగు రోజుల క్రితం దొంగలు ఆలయంలోకి ప్రవేశించి విగ్రహాలను ధ్వంసం చేశారు. లోపల ఉన్న పంచలోహ విగ్రహాలను ఎత్తుకుపోయారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పట్టణంలో పలువురు వ్యాపారుల వద్ద వాటిని అమ్మాలని ప్రయత్నించారు. అందులో ఓ వ్యాపారి రూ.7 కోట్లకు బేరం ఆడినట్లు సమాచారం. అందుకు నిరాకరించిన ముఠా రూ.10 కోట్లు కావాలని డిమాండ్ చేయగా చివరకు వారి మధ్య బేరం కుదిరింది. అంతలోనే సదరు వ్యాపారి నవాబ్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ముఠా కోసం మాటు వేసిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకుని, విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. సంఘటనపై పోలీసులు ఇంకా కేసు నమోదు చేయలేదు. వివరాలను మీడియాకు వెల్లడించలేదు. అంతకంటే ముందుగానే కేసు ఛేదించడం పట్ల పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు. గతంలో జిల్లాలో జరిగిన పలు ఆలయాల చోరీ కేసుల్లో నవాబ్‌పేటకు చెందిన దొంగలు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. 2008లో అనంతపద్మనాభ స్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన ముఠా సభ్యుల్లో ఒకరు, నవాబ్‌పేట మండల వాసి కావడం గమనార్హం.

ఫారెస్టు భూములకు పట్టాలిస్తాం

మహబూబాబాద్ ఎంపి అజ్మీరా సీతారాం నాయక్



మనతెలంగాణ/గార్ల : గత అనేక సంవత్సరాలుగా ఆటవీ ప్రాంతాల్లో ఫారెస్టు భూములు సాగుచేసుకుంటున్న గిరిజనులకు భూమి హక్కులు పట్టాలు అందించేందకు కెసిఆర్ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు మహబుబాబాద్ ఎంపి అజ్మీరా సీతారాం నాయక్ తెలిపారు. మండల పరిధిలోని పెద్దకిష్టాపురంలోగంగవత్ లక్ష్మణ్ నాయక్ నివాసగృహంలో ఏర్పటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు రాష్ట్రంలోని ఫారెస్టు భూములపై జాయింట్ సర్వే చేయించాలని లిఖితపూర్వకంగా తెలియజేశామన్నారు. ఫారెస్టు భూములు సాగుచేస్తున్న ప్రాంతాల్లో అధికారులు పాకిస్తాన్ భారతదేశం మధ్య సరిహద్దు కంచే వేసినట్లు గిరిజనులు సాగుచేసుకుంటున్న భూముల చుట్టు ఫారెస్టు అధికారులు ట్రంచ్ పనులు చేపట్టడం సరైంది కాదన్నారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములపై ఫారెస్టు అధికారుల వేధింపులు మానుకోవాలని ఆయన కోరారు. గార్ల మేజర్ గ్రామ పంచాయతీని కలిసికట్టుగా ఏకగ్రీవం చేసుకున్న ప్రజలందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మహబుబాబాద్ నియోజక వర్గం పరిధిలోని ఏకగ్రీవంగా గెలుపొందిన పంచాయతీలకు పార్లమెంటు అభివృద్ధి నిధుల నుండి 5లక్షలు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. కెసిఆర్ ఆలోచన విధానాలతో తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజన అభివృద్ధి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఆయన వివరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అధిక నిధులు రాబట్టి తండాలను అభివృద్ధి పథంలో తీసుక పోవడానికి తమవంతు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విభజన చట్టంలో పొందుపర్చిన విధంగా బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పడానికి కెసిఆర్ ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరుపుతున్నట్లు ఆయన వివరించారు. ఇల్లెందు నియోజక వర్గంలో టిఆర్‌ఎస్ ఓటమి చెందిందని కార్యకర్తలు నిరాశ పడవద్దని రాష్ట్ర కెసిఆర్ ప్రభుత్వం అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేసినట్లుగానే కోరం కనకయ్య చొరవతో ఇల్లెందు ప్రాంతాన్ని పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలలో ఓటమి గెలుపు సహజమేనని దీన్ని అసరా చేసుకొని ఇల్లెందు నియోజకవర్గంలో టిఆర్‌ఎస్ కార్యకర్తలపై పెత్తనం చేయాలనే ఆలోచించే పార్టీలకు తగిన గుణపాఠం చెపుతామని ఆయన హెచ్చరించారు. ఈసమావేశంలో ఇల్లెందు మార్కెట్ కమిటి చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, జెడ్పిటిసి ఎద్దు మాధవి, ఎంపిటిసి బానోత్ కిషన్ నాయక్, గార్ల ఏకగ్రీవ సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, టిఆర్‌ఎస్ మండలాధ్యక్షులు వడ్లమూడి దుర్గా ప్రసాద్, నాయకులు ఎద్దు వెంకన్న, కోలా కుమార్ గౌడ్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, మూడు బిచ్చా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు

మనతెలంగాణ/కుభీర్ : మండంలోని డొడర్న తాండా(1) లో శివశంకర్ జాతరలో, రాంనాయక్ స్మారకార్థం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలకు ముథోల్ నియోజకవర్గంలోని పలు మండలలాతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల నుండి మల్లయోదులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కుస్తీ పోటీలు చూపరులను ఎంతగానో అలరించాయి. రాంనాయక్ స్మారకార్థం గత 23 సంవత్సరాలుగా గ్రామంలో శివశంకర్ జాతరలో భాగంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. బిద్రెల్లి గ్రామానికి చెందిన రాజు పోటీలలో గెలపొందగా ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి చేతుల మీదుగా రూ. 4000 నగదు బహుమతిని మల్లయోదునికి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రాథోడ్ యోగిత, మాజీ సర్పంచ్ రాథోడ్ శంకర్, మాజీ జెడ్పిటీసీ చౌహన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత బస్తీలో టిడిపి నేత దారుణ హత్య


మన తెలంగాణ/చార్మినార్: ఆర్థిక లావాదేవిలలో తలెత్తిన వివాదం ఓ తెలుగుదేశం నాయకుడి హత్యకు దారితీసింది. చార్మినార్ ఇంఛార్జ్ ఎసిపి ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం ఘన్సీబజార్‌కు చెందిన పీటర్ రవి(43) తెలుగుదేశం పార్టీలో చురుకుగా పనిచేస్తున్నాడు. గత కొద్ది రోజులుగా భగవాన్‌దేవి ఆసుపత్రి సమీపంలో ఉన్న నోమీనాథ్ మఠం మొదటి అంతస్థులో నివసిస్తున్నాడు. ఇతనికి పురానాపూల్‌కు చెందిన యువకులతో ఆర్థిక లావాదేవిలలో విభేదాలున్నాయి. మంగళవారం రాత్రి రవి మఠంలో ఉండగా మద్యం మత్తులో ద్విచక్రవాహానంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఇతనితో ఘర్షణ పడ్డారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న కత్తులతో రవిని విచక్షణ రహింతగా పొడిచి ద్విచక్రవాహానాలపై పరారయ్యారు. రవి తీవ్రగాయలతో రక్తం మడుగులో పడి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చార్మినార్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి మృతదేహాన్ని మార్చురికీ తరలించారు. నింధితుల ఆచూకి కోసం ప్రత్యేక బృందాలను నియమించామని త్వరలో పట్టుకుంటామని మీర్‌చౌక్ ఎసిపి ఆనంద్ తెలిపారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం..అధికారి సస్పెన్షన్



మన తెలంగాణ/మఠంపల్లి: జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో రిటర్నింగ్ అధికారి నిర్లక్ష్యంతో సస్పెన్షన్‌కు గురైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మఠంపల్లి ఎంపిడిఓ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో రిటర్నింగ్ అధికారిగా వ్యవహిస్తున్న వెంకటేశ్వర్లు ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అమయ్‌కుమార్ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియామవళి ప్రకారం అభ్యర్థుల జాబితాను నోటీసు బోర్డులో సాయంత్రం 6గంటల వరకు సమాచారం ఇవ్వనందుకు అతనిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఉపాధ్యాయ సంఘాల సభ్యులు మాట్లాడుతూ పిఆర్‌టియు టియస్ ఆధ్వర్యంలో సస్పెన్షన్‌ను విరమించుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని 14 మందికి గాయాలు



మన తెలంగాణ/చివ్వెంల: స్కూల్ బస్సు కంటైనర్ ఢీకొని 14మంది విద్యార్థులు గాయాలైన సంఘటన మంగళవారం తెల్లవారుజామున మూడు గంటలకు చివ్వెంల మండల కేంద్రంలోని చెరువుకట్ట వద్ద జరిగింది. బుధవారం చివ్వెంల ఎస్సై సిహెచ్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం చందూరు మండలం పుల్లెంల గ్రామం జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ నెల 10న విహార యాత్రకు వెళ్లారు. ద్వారకా తిరుమల, అన్నవరం, సింహాచలం, వైజాగ్, అరకు, భద్రాచలం, ఆలయాలు సందర్శించి తిరుగు ప్రయాణంలో మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం నుండి సూర్యాపేటకు వస్తుండగా చివ్వెంల గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద సూర్యాపేట నుండి ఖమ్మం వెళ్తున్న ట్రక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిఖిత, పావని, పారిజాత లనే ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగతా వారికి స్వల్ప గాయాలు కావడంతో సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిర్వహించి విద్యార్థులను గ్రామానికి తరలించారు.

తులారం ప్రాజెక్ట్‌తో గిరిజనుల కల సాకారం



- మరో 5వేల ఎకరాలకు సాగునీటికి నివేదిక
- పనుల పూర్తికి ప్రభుత్వం అడుగులు
- దశాబ్దాలుగా అసంపూర్తిగా కాల్వలు
- గత పాలకుల నిర్లక్ష్యంతో పెరిగిన ప్రాజెక్టు వ్యయం



(ఫైల్ ఫొటో)

మనతెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి : గత కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం తులారం ప్రాజెక్టు, పాలకుల నిర్లక్ష్యంతో ప్రాజెక్టు అసంపూర్ణంగా నిర్మించడంతో దాని నిర్మాణం వ్యయం నేడు ఐదురెట్లు పెరిగింది. నాటి ఖమ్మం జిల్లా నేటి మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం మండలంలోని గౌరారం గ్రామం వద్ద రెండు గుట్టల మధ్యలో వట్టివాగుపై తులారం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కాకతీయుల కాలంలో నాటి రైతు బియన్ గుప్త 20 సంవత్సరాల వయసు నుండి అలుపెరుగని పోరాటం చేసి తన జీవితాన్నే ప్రాజెక్టు నిర్మాణం కోసం త్యాగం చేశారు. దీంతో ఈ ప్రాంతానికి సాగునీరు అంది రైతులు రెండు పంటలు పండించుకుంటారని బియన్ గుప్త ఆశయం. ఈ పనులు పూర్తి చేయడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో నాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రూ.4కోట్లు వెచ్చించింది. దీంతో 1200 ఎకరాలకు సాగునీరు అందుతుందని నాటి ప్రభుత్వం అంచనా వేసింది. కానీ కాంట్రాక్టర్లు నాణ్యతాలోపంతో చేసిన పనుల వల్ల, ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో తులారం ప్రాజెక్టు కాలువ పనులు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిలువెత్తు అద్దంగా దర్శనమిస్తున్నాయి. నేడు తులారం ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి ప్రాజెక్టు వ్యయం తడిసి మోపెడైంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రధానంగా గౌరారం, వెంకట్రాంపురం, బాలాజీపేట గ్రామ పంచాయతీల్లో సాగు, తాగునీటి సమస్య సంపూర్ణంగా పరిష్కారం అవుతుందని, సాగునీరు అందుతుందని రైతుల ఆశలు ఆడియాసలుగానే మిలిలిపోయాయి. 2005లో ప్రాజెక్టు పూర్తవ్వడానికి రూ.4కోట్లతో ప్రధాన కాల్వలకు, అవసరమైన భూములను సేకరించేందుకు వెచ్చించారు. ప్రాజెక్టులో నీరు నిండినా ఆయకట్టుకు నీరు అందని దుస్థితి నెలకొంది. వాస్తవానికి ప్రధాన కాల్వ ద్వారా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 7మండలాల చెరువులకు నీరందించే విధంగా ఇరిగేషన్ అధికారులు నమూనా రూపొందించి అంచనా వేశారు. నేటికీ ప్రధాన కాలువ పూర్తి కాకపోవడంతో ఆయ గ్రామాల రైతులు గత 10ఏళ్ళుగా వర్షాధారంగానే వ్యవసాయం చేస్తున్నారు. అనుసంధాన కాలువలు పూడుకుపోయాయి. సిమెంట్ పనులు ధ్వంసమయ్యాయి. వట్టివాగుపై నిర్మించిన ట్రాఫాపై నుండి నీరు పొర్లిపోయి వాగులో కలుస్తున్నాయి. నాసిరకం పనులతో ప్రధాన కాలువ కల్వర్టులు, రైడ్‌వాల్స్ శిధిలావస్థకు చేరుకున్నాయి. ట్రాఫా సైతం దెబ్బ తినడంతో లీకులతో నీరు వృధాగా పోతోందని, దీంతో రెండు పంటలు పండే భూములు వర్షాధారంపై ఆధారపడడంతో రైతు కుటుంబాలు చితికిపోతున్నాయని వారు ఆందోనళ చెందుతున్నారు.

ప్రాజెక్టు రీడిజైనింగ్?

తులారం ప్రాజెక్టు రీడిజైనింగ్‌తో మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలో పంట పొలాలు సమస్యశ్యామలం చేసేందుకు, వందలాది గ్రామాల్లో తాగునీరు అందించేందుకు ప్రాజెక్టు నిర్మాణం రీడిజైనింగ్ చేసేలా టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రాజెక్టు నిర్మాణంతో జిల్లా కేంద్రంలో శాశ్వత తాగునీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని ఆయన అంచనా. ఈ నేపధ్యంలో భారీ నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును కలిసి ప్రాజెక్టు గురించి నివేదిక ఇచ్చారు. అప్పటి నుండి ఈ ప్రాజెక్టు రీడిజైనింగ్ చేసి ఈ ప్రాంతంలో సుమారు 5వేల ఎకరాలకు పైబడి సాగు నీరు అందించే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని



మాజీ మంత్రి హరీష్‌రావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించడంతో తులారం ప్రాజెక్టు ఆధునిక నిర్మాణానికి మార్గ సుగమమైంది. 2019లో ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఇప్పటికే 12వేల ఎకరాలకు నీరు అందుతున్నప్పటికీ మహబూబాబాద్ జిల్లాలో బయ్యారం, గార్ల, డోర్నకల్, ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల్లో మరో 5వేల ఎకరాలు సమస్యశ్యామలం కానున్నాయి. అలాగే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజలకు శాశ్వతంగా త్రాగునీరు అందించవచ్చు.

సతి కోసం పతి పోరాటం

- మహిళా రిజర్వేషన్ స్థానాల్లో భర్తల హడావుడి
- సర్పంచ్‌గా మహిళ ఉన్న చోట ఉపసర్పంచ్ పదవి కోసం పురుషుల ఎత్తులు

మన తెలంగాణ/సదాశివనగర్: ఈసారి గ్రామపంచాయతీ ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్‌లు సగానికంటే ఎక్కువే రావడంతో అక్కడ బరిలో ఉన్న మహిళా అభ్యర్థుల కోసం వారి కుటుంబంలోని పురుషులు ప్రచారాలు చేస్తున్నారు. ఎలాగైనా సర్పంచ్ కావాలనే కలలు కన్నవారికి రిజర్వేషన్‌లు నిరుత్సాహపరచడంతో తమకు అనుకూలంగా ఉన్నవారికి మద్దతుగా వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. కొందరు ఎన్నికలకు దూరంగా ఉండి వచ్చేసారి అవకాశం వస్తే చూద్దాం అంటుంటే మరికొందరు మాత్రం తమ కుటుంబ సభ్యుల్లోని మహిళలు, తల్లి గాని, భార్య, చెల్లి, వదిన ఇలా వారిలో ఎవరికి ఉత్సాహం ఉన్నా ఎన్నికల బరిలో ఉంచారు. కొన్ని చోట్ల ఉత్సాహం లేని మహిళలకు భర్తగాని, కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు మనోధైర్యానిచ్చి పోటీకి ఒప్పించారు. 'కేవలం పదవిలో మీరు పనులన్నీ మేమే చేస్తాం' అంటూ సతులతో నామినేషన్‌లు వేయించి తాను సర్పంచ్ బరిలో ఉన్నామంటూ పతులు ప్రచారం చేస్తూ గ్రామస్తులతో ఓట్లను అభ్యర్థిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ స్థానాల్లో నామినేషన్ వేసిన మహిళా అభ్యర్థులు తమ స్వంత గ్రామంలో ఓటర్లందరికి తెలియకపోవడం ఎవరో మహిళా సర్పంచ్ కోసం బరిలో ఉందన్న మాటేగానీ పోటీలో ఉన్న అభ్యర్థి ఎవరో ఓటర్లకు తెలియదంటే మహిళా సీటు కోసం పురుషుల పోటీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

మహిళా సర్పంచ్ స్థానాలు ఉన్నచోట ఉపసర్పంచ్ పదవి కోసం పోటీ తీవ్రమైంది. ఎందుకంటే సర్పంచ్ అభ్యర్థి మహిళా అయి ఉంటే అక్కడ ఉపసర్పంచ్ పదవిలో కొనసాగుతూ సర్పంచ్‌తో సరి సమానంగా కొనసాగవచ్చని ఆశావహులు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ పదవి కోసం కొన్ని చోట్ల అభ్యర్థులు వార్డు మెంబర్లను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి పెద్దమొత్తంలో తాయిలాలు అందిస్తున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. దీంతో పాటు పంచాయతీరాజ్ చట్టంలో చేరిన సవరణల ప్రకారం సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌కు చెక్‌పవర్ ఇవ్వడం వలన ఈ పదవికి పోటీ అధికమైంది.

ఈ 'పాప'ం ఎవరిదీ...?



మన తెలంగాణ / ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో హుసేనియ మసీదు పక్కనే ఉన్న మురికి కాలువ పక్కన గల ముళ్ల పొదల్లో ఏడు నెలల పిండం లభ్యమైంది. సంక్రాంతి సందర్భంగా చిన్నారులు పతంగులు ఎగరవేస్తుండగా ఈ ఘటన బయటకు వచ్చింది. చిన్నారులు ఆడుకుంటూ పతంగులు మురికి కాలువలో పడిపోవడంతో ఈ పిండాన్ని చూసి తొలుత బొమ్మ అనుకుని పెద్దలకు తెలిపారు. అయితే ఈ బొమ్మ కాదని పిండం అని నిర్ధారించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పసికందు పిండాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మనవత్వాన్ని మంటకలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పని చేసిన వారికి చట్ట పరంగా శిక్షించే విధంగా చూడాలని కాలనీ వాసులతోపాటు మసీదు ఇమామ్ మంజుర్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. .

ప్రచారం షురూ

- కలిసొచ్చిన సంక్రాంతి పండుగ
- గ్రామాలలో మొదలైన విందులు, వినోదాలు
- పోటా పోటీగా రెండవ విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం
- యువజన నాయకులు ప్రచారం



మండలంలో 36 గ్రామ పంచాయతీలు,ఏకగ్రీవం 8, 28 గ్రామ పంచాయతీలలో 133 సర్పంచ్ అభ్యర్థులు భరిలో ఉన్నారు.
మండలంలో మొత్తం వార్డులు 320. అభ్యర్థులు 681 నామినేషన్
ఏకగ్రీవం : 108.. 212 మంది భరిలో ఉన్నారు.

మనతెలంగాణ/రఘునాథపల్లి : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండో విడుత నామినేషన్లు, ఉపసంహరణ ఘట్టం గురువారం నాటికి ముగియడంతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. మండలంలో 36 గ్రామపంచాయతీలు ఉండగా 8 మపంచాయతీలు ఏకగ్రీవం కాగా 28 గ్రామాలలో ఈ నెల 25న ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థులు గుర్తు రాకున్న పండుగ వాతావరణం రావడంతో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్, వార్డు సభ్యులు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లును ఆకట్టుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు ప్రారంభించారు. ఆర్థిక వనరులు ఉన్న గ్రామాలలో ఇది కాస్త ఎక్కువుగా కనిపిస్తోంది. ఆదాయంతో పాటు పాలకవర్గాలకు ప్రత్యేక గుర్తింపు ఉండడంతో ఆయ గ్రామాల్లో ఎలాగైనా గెలుపొందాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లును మచ్చిక చేసుకోవడానికి అస్త్రశస్త్రాలను ప్రయోగిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న వారికి గతంలో ఏఏ రూపాల్లో వారకి సాయం చేశాం...గుర్తుచేసుకోని వారిని తమ వైపు తిప్పుకుంటున్నారు.

ఓటర్లను ప్రసన్నం చేసుకోనేందుకు గాలం

మండలంలో రెండో విడుత 36 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా ఇందులో 8 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 28 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. పోటీలో నిలిచిన అభ్యర్థులు, వారి బంధువులు ప్రచారానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే పట్టణాల్లో ఉండే వారంతా సంక్రాతి పండుగకు వారి సొంత గ్రామాలకు వెళ్లారు. ఎన్నికల్లో ప్రచారం చేస్తున్న వారికి సంక్రాంతి పండుగ కలిసొచ్చింది. పోటీల్లో ఉన్న అభ్యర్థులు ఎన్నికల విందులు ప్రారంభించారు. ఆదాయానిచ్చే గ్రామాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు గాలం వేస్తున్నారు.

బుజ్జగింపులు మొదలు..

మండల స్థాయి నుండి వివిధ గ్రామాల్లో గతంలో బాధ్యతలు నిర్వర్తించిన నేతలు సైతం ఈ సారి గ్రామపంచాయతీ ఎన్నికల బరిలో నిలిచారు. పోటీలో నిలిచిన అభ్యర్థులు ఓటర్ల ప్రసన్నాకి పాట్లు పడుతున్నారు. ఆర్థిక వనరులు ఉండే గ్రామాల్లో ఈ జోష్ కాసింత ఎక్కువుగా కనిపిస్తోంది. ఆయ గ్రామాల్లోని కుల సంఘాల నాయకులను కలుస్తూ వారి సంఘం అభివృద్ధికి విందులు, డబ్బులు ఇస్తున్నట్లు సమాచారం.

ప్రచారం వద్దనే డబ్బులు..

సర్పంచ్‌తో సమానంగా ఉప సర్పంచ్ పదవికికూడా నువ్వా..నీనా? అన్నట్లుగా పోటీ పడుతున్నారు. కొత్త పంచాయతీ రాజ్ చట్టంలో ప్రభుత్వం సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు కలిపి సంయుక్తంగా చెక్ పవర్, తీర్మానాలు, నిధులు ఖర్చుతోపాటు పలు అవకాశాలు కల్పించింది. దీంతో ఉప సర్పంచ్ పదవిని దక్కించుకునందుకు పెద్ద నాయకులు కూడా వార్డు మెంబర్లుగా పోటీలో దిగారు. కొందరు ప్రచారంలో పోటీ అభ్యర్థులకు ప్రచారం చేయకంటూ డబ్బులిస్తున్నట్లు సమాచారం. దీంతోపాటు ఆయ గ్రామా పంచాయతీల్లో ప్రచారం వద్దనే డబ్బులను పంపిణీ చేయన్నుట్లు ప్రణళికలు రూపొందించుకున్నట్లు సమాచారం.


అనుమానంతో భార్యను చంపిన భర్త

మన తెలంగాణ / ఎల్.బి.నగర్ : అనుమానంతో కట్టుకున్న భార్యను గొంతు నులిమి హత్యచేసి పారిపోయిన ఓ భర్త ఉదంతమిది. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఈ దారుణం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాము అనే ఆటో డ్రైవర్ తన భార్య శ్వేతతో కలిసి భగత్ సింగ్‌నగర్‌లో నివసిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అయితే రాము తాను సంపాదించిన డబ్బంతా మద్యం తాగడానికే ఖర్చుచేస్తూ, తన భార్య శ్వేతపై అనుమానం పెంచుకున్నాడు. ప్రతిరోజు చిత్తుగా తాగి ఇంటికి వచ్చి శ్వేతను చితకబాదేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి చిత్తుగా తాగి వచ్చిన రాము మద్యం మత్తులో శ్వేతను గొంతు నులిమి హత్య చేసి పరారయ్యాడు.

ఉదయం నిద్రలేచిన పిల్లలకు తమ తల్లి ఎంతకూ లేవకపోవడం చూసి చుట్టుపక్కల వారికి చెప్పడంతో వారు వచ్చి చూసారు. అప్పటికే శ్వేత మృతిచెంది ఉండటంతో సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చూరికి తరలించి కేసును దర్యాప్తు జరుపుతున్నారు.

విలీన గ్రామాలపై వీడని ఉత్కంఠ

- రాజకీయ భవిష్యత్తుపై మధనపడుతున్న ప్రజాప్రతినిధులు
- విలీనంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజానీకం



మనతెలంగాణ/హుజూరాబాద్ : నగరపంచాయతీలకు రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను నగర పంచాయతీలలో కలిపి నగర పంచాయతీలను మున్సిపాల్టీలుగా మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో గ్రామాల్లో ఉండే ప్రజాప్రతినిధుల్లో ఆందోళన మొదైలైంది. సర్పంచ్, ఎంపిటిసిల ఎన్నికలకు సంవత్సర వ్యవధి ఉండటంతో గ్రామాలను నగరపంచాయతీలలో కలపడంతో ఆ గ్రామాల్లో ఉండే ప్రజాప్రతినిధులు అవాక్కయ్యారు. గ్రామాలను నగర పంచాయతీలలో కలిపితే తమ భవిష్యత్తు ఏమిటానని సందేహాలు ప్రజాప్రతినిదుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామాల్లోని ప్రధానకూడళ్ల వద్ద ప్రజాప్రతినిధులు రాజకీయ భవిష్యత్తు గురించి చర్చించుకుంటున్నారు. హుజూరాబాద్ మండలంలో 20 గ్రామపంచాయతీలు ఉండగా 27 గ్రామాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంత జనాభా 50 వేలకు పైగానే ఉంటుంది. హుజూరాబాద్ ఒకప్పుడు గ్రామపంచాయతీగా ఉండగా నగర పంచాయతీగా మార్చుతూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే టిఆర్‌ఎస్ ప్రభుత్వం నగరపంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చుతూ అసెంబ్లీ సమావేశాల ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు గ్రామాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. హుజూరాబాద్ నగరపంచాయతీకి సమీపంలోని కొత్తపల్లి, బోర్నపల్లి, ఇప్పల నర్సింగాపూర్, దమ్మక్కపేట గ్రామాలను హుజూరాబాద్ నగరపంచాయతీలో కలిపి మున్సిపాలిటీ ఏర్పాటు చేయగా బోర్నపల్లి, దమ్మక్కపేట గ్రామ ప్రజలు కోర్టును ఆశ్రయించడంతో విలీనం ప్రక్రియకు బ్రేక్ పడింది. కాగా ఈ నెల మూడో విడుత నుంచి గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. కాగా హుజూరాబాద్ మున్సిపాలిటీలో అయినా గ్రామాలకు రిజర్వేషన్‌లు కేటాయించలేదు. కానీ అధికార యంత్రాంగం మాత్రం కోర్టు ఉత్తర్వుల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

గ్రామాలను నగరపంచాయతీల్లో విలీనం చేయడంతో గ్రామాల్లో భవిష్యత్తు ఏమిటాని పలువురు ఆశావహులు తమకు అర్థం కానీ పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పనులు అసంపూర్తిగా నెలకొన్నాయి. పలు గ్రామాల్లో పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం 14వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేయగా గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు ఆ పనులపై దృష్టి సారించారు. పనులు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంపై ప్రజాప్రతినిధులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి గ్రామాల విలీనంపై మిశ్రమ స్పందన వస్తుంది. గ్రామాలను నగర పంచాయతీలలో కలిపితే ఇంటి, నల్లా పన్నులు పెరిగిపోతాయనే ఆందోళన మొదలైంది. గ్రామీణప్రాంతాల్లో ఉండే ప్రజలు దాదాపు వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాలే కాకుండా కూలీ నాలీ చేసుకుంటూ పొట్ట నింపుకునే కుటుంబాలు. మున్సిపాల్టీ పరిధిలోకి గ్రామాలు వెళ్లినట్లయితే పన్నుల బాదుడు పెరగనుండటంతో గ్రామస్థులు విలీనంపై శ్రద్ధ చూపడం లేదు. తాజాగా బోర్నపల్లి గ్రామాన్ని హుజూరాబాద్ నగర పంచాయతీలలో కలపొద్దని కోరుతూ గ్రామ ప్రజలంతా ర్యాలీగా వచ్చి పట్టణంలో ఆందోళన చేసిన సంఘటనలు ఉన్నాయి. ఏదేమైనా ప్రభుత్వ నిర్ణయం గ్రామీణ ప్రాంత ప్రజలకు మేలు చేకూరుస్తుందో లేదా వేచి చూడాల్సి పరిస్థితి ఉంది.

మన తెలంగాణ
10
హైదరాబాద్
గురువారం
17 జనవరి, 2019
www.manatelangana.news

ట్రావెల్



తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మరో సుందర పర్యాటక క్షేత్రం ఎలగందుల కోట. ఇది కరీంనగర్ పట్టణానికి సుమారు 13 కి.మీ దూరంలో ఉంది. దాదాపు వెయ్యేళ్ళ చరిత్ర కలిగిన ఈ కోట కాకతీయుల కళావైభవానికి నిదర్శనంగా దర్శనమిస్తుంది. హిందూ ముస్లింల సంస్కృతికి చిహ్నంగా ఇది అలరారుతోంది.

కాకతీయుల కళావైభవానికి నిదర్శనం

ఎలగందుల కోట



ఎలగందుల ప్రాచీన నామధేయం బహుధాన్యపురం, వెలిగందుల. ఈ చుట్టుపక్కల ప్రాంతాలలో తెల్ల కందులు పండించేవారట. ఆ కారణంగా ఈక్షేత్రాన్ని ఆ కాలంలో తెల్లకందులని పిలిచేవారట. కాలక్రమంలో అదే వెలిగందులుగా, ఎలగందులుగా రూపాంతరం చెందింది.

కాకతీయుల కాలంలో అంటే 1083–1323 సంవత్సరాల మధ్య కాలంలో ఈ కోటను నిర్మించారు.మహ్మద్ బిన్ తుగ్లక్ ఈ కోట కళాత్మకతకు అబ్బురపడి దీనిని కాకతీయుల నుంచి స్వాధీనపరచుకున్నాడు.అనంతరం ఔరంగజేబు అలంగిరి మసీదు, కోట పక్కన బింద్రాబన్ కట్టించాడు.1724లో మొదటి నిజాం పాలనలోకి వచ్చిన తరువాత దీని ప్రాధాన్యతను పెంచి, గుర్తింపుని తీసుకొచ్చాడు. నిజాం పాలనలో ఈ కోట కరీంనగర్ కు ప్రధాన కార్యాలయంగా ఉండేది. మానేరు నదీతీరంలో తాటిచెట్ల మధ్య సుందర ప్రాకృతిక దృశ్యాల నడుమ ప్రశాంతమైన వాతావరణంలో అలరారుతోంది.

ఈ కోట హైదరాబాద్ నిజాం ఉల్ ముల్క్ నిజాం అసఫ్జాహ్ I (1724–1748) , ముగ్రాబ్ ఖాన్ హయాంలలో, అమిన్ ఖాన్ ఎలగందల్‌కు ఖిలేదార్ గా నియమించబడ్డాడు. నవాబ్ సలాబత్ జంగ్ హయాంలో మిర్జా ఇబ్రహీం దంసా ఖిలేదార్ అయ్యాడు. సికందర్ ఝా (1803–1823) హయాంలో 1754 లో దంసా ఈ కోటను పునర్నిర్మించాడు. బహదూర్ ఖాన్ , కరీముద్దీన్ లు తరువాతికాలంలో ఖిలేదార్లుగా పనిచేశారు. కరీముద్దీన్ పేరుమీదుగానే కరీంనగర్ గా మారింది. 1905 లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ సందర్భంగా, ఆరవ నిజాం మహబుబ్ ఆలీ ఖాన్ జిల్లా కేంద్రాన్ని ఎలగందల్ నుంచి కరీంనగర్ కి మార్చాడు.

ఈ కోటలో ఎక్కువ భాగం మధ్యయుగానికి చెందిన ఐరోపా ఖండంలోని కోటలతో పోలి ఉంది.అప్పటి టర్కీ, ఫ్రెంచి ఇంజినీర్ల ప్రభావం దీని మీద ఉండొచ్చని పరిశోధకులు చెబుతున్నారు. సుమారు 200 అడుగుల ఎత్తులో మూడుకిలోమీటర్ల వరకు ఈ కోట వ్యాపించి ఉంది. ఈకోటంతా చార్మినార్ తరహాలోనే కనిపిస్తుంది.

శత్రువుల నుండి దాడులను నిరోధించడానికి ఎలగందల్ పాలకులు కోట చుట్టూ సుమారు 5 మీటర్లు వెడల్పు , 4 మీటర్లు లోతైన నీటి కందకాన్ని ఏర్పాటు చేసి అందులో మొసళ్లను వదిలేవారట.

రవాణ సదుపాయం కరీంనగర్ పట్టణం నుంచి ఏదైనా వాహనంలో ఇక్కడకు సులువుగా చేరుకోవచ్చు. అలాగే కరీంనగర్ నుంచి వేములవాడ వెళ్లే దారిలో బావుపేట బస్టాండులో దిగాలి. అక్కడ నుంచి ఆటోల్లో ఎలగందుల కోటకు చేరుకోవచ్చు.

భోజన, వసతి సదుపాయాలు కరీంనగర్ అతి సమీపంలో ఉండడం వల్ల ఇక్కడకు చేరుకునే వారికి భోజన వసతి సదుపాయాలకు ఎలాంటి ఇబ్బంది లేదు.

'ఐ ఎక్స్‌ప్లోర్ తెలంగాణ'తో సమగ్ర సమాచారం..



తెలంగాణలో చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. కాకపోతే ఎక్కడ ఏమేం ఉన్నాయో చాలా మందికి తెలియదు. అలాంటివారి కోసమే 'ఐ ఎక్స్‌ప్లోర్ తెలంగాణ' (i Explore Telangana) అనే యాప్ పుట్టుకొచ్చింది. తెలంగాణలో విహారానికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక, సాహస, విహార స్థలాలు, అభయారణ్యాలు, ఉద్యానవనాలు, బోటింగ్ యూనిట్స్ ఇలా రకరకాల విభాగాల్లోని పర్యాటక కేంద్రాల గురించి సమగ్ర వివరాలు దీంట్లో ఉంటాయి. అక్కడికి ఎలా వెళ్లాలో జీపీఎస్ కూడా యాప్‌లోనే పొందవచ్చు. పర్యాటక కేంద్రాలు తెరిచే, మూసే సమయాలు, ప్రవేశ రుసుము ఇలాంటివి తెలుస్తాయి. ప్యాకేజీ బుకింగ్, రైలు టికెట్లు, బస్సుల రాకపోకలు, హెల్త్‌కేర్ సెంటర్లు, అత్యవసర సమయంలో ఉపయోగపడే ఫోన్ నెంబర్లు..ఇలా తదితర వివరాలన్నీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఆరా తీయండి ఆరగించండి..!



ఎంతో ఇష్టంగా మనం కోరుకున్న విహారప్రాంతాలకు వెళ్తుంటాం. కానీ మంచి హోటల్ ఎక్కడుందో..ఎక్కడ భోజనం బాగుంటుందో లాంటి వివరాలు మాత్రం మనకు తెలియదు. అలాంటప్పుడు నెట్‌లో హోటల్స్ వెదికి రివ్యూలను చదివి అక్కడికి వెళ్తే నిరాశ చెందే అవకాశం కూడా లేకపోలేదు. మరి అలాంటప్పుడు ఏంచేయాలంటే...చక్కగా స్థానికులను అడిగితే మంచిది. ఆయా ప్రాంతంలో ఉన్న రెస్టారెంట్లు, ఆహార విషయాలు స్థానికులకు తెలిసినంతగా మరొకరికి తెలియకపోవచ్చు. అందుకే ఆన్‌లైన్ రివ్యూలు కాకుండా.. స్థానికుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఎక్కడ తినాలో నిర్ణయించుకోండి. ప్రయాణాల్లో చాలామంది స్ట్రీట్ ఫుడ్ జోలికి వెళ్లరు. కానీ బడ్జెట్‌లో వేడివేడి రుచులు కావాలన్నా.. ఆ ప్రాంతానికే ప్రత్యేకమైన రుచులు ఆస్వాదించాలన్నా స్ట్రీట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లాలి.

ట్రావెల్ కౌన్సిలింగ్

మల్లెల తీర్థం ఎక్కడుంది? ఎలా చేరుకోవాలి?

ఎ. నాగరాజు, రావులపాలెం

మల్లెల తీర్థం ఓ సుందర పర్యాటక క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. శ్రీశైలం మార్గంలో ఉన్న మన్ననూరు ఫారెస్టు చెక్ పోస్టు నుంచి వట్ వార్లపల్లి మీదుగా ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు. ఇక్కడ అద్భుతమైన జలపాతాలు, కోనేరు ఉంది. కొండల మీద నుంచి వచ్చే ఈ నీటి జలాలు ఓషధి విలువలతో కూడుకున్నవని భావిస్తారు. అలాగే ఇక్కడ స్నానాలు చేస్తే పాపాలు పోతాయని, మోక్షం సిద్ధిస్తుందని చెబుతారు. అయితే ఈ జలపాతాలను చేరుకోవాలంటే నేల మట్టం నుంచి సుమారు 250 మెట్లు కిందకి దిగాల్సి ఉంటుంది. దట్టమైన నల్లమల అడవిలో ఉండడం వల్ల ఇక్కడ ఎలాంటి వసతులు ఉండవు. అయినప్పటికీ రోజూ వందలాది మంది పర్యాటకులు ఇక్కడకు వస్తారు.

శనీశ్వరుడికి ప్రత్యేక దేవస్థానమున్న క్షేత్రం ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడుంది? దాని విశేషలేమిటి?

పి. వాసంతి, విజయవాడ

శనీశ్వరుడికి ప్రత్యేక దేవస్థానమున్న క్షేత్రం మందపల్లి. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రావులపాలెం పట్టణానికి సుమారు ఎనిమిది కిలోమీటర్లు దూరంలో ఉంది. మంద



పల్లి శనైశ్చర స్వామి దేవస్థానంగా పేర్గాంచింది. ఇక్కడ శనీశ్వరుడు, శివుడ్ని ప్రతిష్టించాడు కనుక ఈ స్వామిని మందేశ్వర స్వామి అని, ఈ క్షేత్రాన్ని మందపల్లి అని పిలుస్తారు. ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి అందాల నడుమ అలరారుతున్న ఆలయమిది. ప్రతి శనివారంతో పాటు శని త్రయోదశి, శని జయంతి రోజులలో వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని తిలతైలాభిషేకాలు నిర్వహిస్తారు. ఇక్కడ స్వామికి తైలాభిషేకం చేయిస్తే సర్వ బాధలు పోతాయంటారు.

తమిళనాడులోని ఆరు సుబ్రహ్మణ్య క్షేత్రాలలో మొట్టమొదటి క్షేత్రం ఎక్కడుంది? దానినెలా చేరుకోవాలి?

ఎస్. కళ్యాణి, రామచంద్రపురం


తమిళనాడులోని ఆరు సుబ్రహ్మణ్య క్షేత్రాలలో మొట్టమొదటి క్షేత్రం 'పళముదిర్ చోళై '. ఇది తమిళ నాడులోని మదురై నగరానికి సుమారు 25 కిలోమీటర్లు దూరంలో ఉంది. తమిళనాడులోని ఆరుముఖ్యమైన సుబ్రహ్మణ్య క్షేత్రాలలో అతి పురాతనమైనదిగా, మొట్ట మొదటి క్షేత్రంగా ఇది అలరారుతోంది.

రోజూ వేలాది మంది భక్తులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తారు. ఇక్కడ కొలువైనస్వామి మురుగన్ స్వామి. నిత్యం వేలాది మంది భక్తులతో రద్దీగా ఉండే ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీ వల్లీ దేవసేనసహిత సుబ్రహ్మణ్య స్వామి కొలువయ్యారు. ఈదివ్యాలయ దర్శనం పూర్వ జన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు. మదురై నుంచి ఏదైనా వాహనంలో ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు.



ట్రావెల్ ఎక్స్‌పర్ట్
దాసరి దుర్గాప్రసాద్
7794096169

ఆధ్యాత్మిక సోయగం మౌంట్ అబు



రాజస్థాన్‌లోని సిరోహి జిల్లా ప్రకృతి అందాలకు చిరునామాగా, దేశంలో ఉన్న పర్యాటక ప్రాంతాలలో ముఖ్యమైనదిగా విరాజిల్లుతోంది. ఈ జిల్లాలో గల మౌంట్ అబూ ఒక వేసవి విడిది పర్వత ప్రాంతం. ప్రకృతి అందాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చగా పరచుకున్న కొండలు, మనస్సును కట్టిపడేసే మనోహరమైన సరస్సులు, ఆధ్యాత్మికతను పెంచే ఆలయాలతో పాటు , అనేక ధార్మిక కేంద్రాలకు ప్రసిద్ధి.

జైనులకు ఒక ప్రముఖ తీర్థ యాత్రా స్థలంగా విరాజిల్లుతున్న మౌంటు అబు 1220 మీ. ఎత్తు లో గల ఆరావళి పర్వత శ్రేణుల లోని ఎత్తైన శిఖరం మీద నెలకొని వుంది. ఆహ్లాదపరిచే ప్రకృతి అందాలు, చారిత్రక నేపథ్యం, పౌరాణిక ప్రాశస్త్యం అద్భుతమైన వాతావరణం కలిగి ఉండటం వల్ల రాజస్థాన్‌లోని అతి పెద్ద పర్యాటక ఆకర్షణలలో మౌంటు అబు ఒకటిగా విరాజిల్లుతోంది. ప్రధానంగా వేసవికాలం, వర్షాకాలంలో వేలాదిమంది పర్యాటకులు, భక్తులు ఈ సందర్శించుకునే ఈ క్షేత్రం ఒక ప్రముఖ వేసవి విడిదిగాను, హనీమూన్ స్పాట్‌గా నీరాజనాలందుకుంటోంది. ఆరావళీ పర్వతశ్రేణులలో ఉండే 'అబూ' అనే కొండమీద ఉన్న ఒక చిన్న పట్టణమే 'మౌంట్ అబూ'. సుమారు నాలుగు వేల అడుగుల ఎత్తున ఉన్న కొండమీద ఉండే ఈ అబూ పట్టణం రాజస్థాన్ రాష్ట్రం దక్షిణపు అంచుల్లోను, గుజరాత్ రాష్ట్రానికి ఆనుకుని ఉంటుంది.సర్ప దేవత అర్బుద పేరిట ఈ ప్రాంతాన్ని అర్బుదారణ్య అని కూడా పిలుస్తారు. పురాణాల ప్రకారం శివుని వాహనమైన నందిని రక్షించడానికి సర్పదేవత కిందికి వచ్చాడు. ఆ కారణంగా దీనికి అర్భుదా అని పేరొచ్చింది. తర్వాతి కాలంలో 'అర్బుదారణ్య' పేరు 'అబూ పర్వత' లేదా 'మౌంట్ అబూ' గా రూపాంతరం చెందింది. ఇక్కడ గుర్జర్లు లేదా గుజ్జర్లు నివసించేవారని, వారికీ అర్బుద పర్వతాలతో అనుబంధ ముండేదని ఈ ప్రాంతానికి చెందిన చారిత్రిక గ్రంధాలు, శాసనాల ద్వారా అవగతమవుతోంది.

అబు రోడ్ రైల్వేస్టేషన్ నుంచి మౌంట్ అబు 28 కి.మీ దూరంలో ఉంటుంది. అబు రోడ్ నుంచి ఇక్కడకు విరివిగా బస్సులు, ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి. ఓ వైవిధ్యమైన ఆధ్యాత్మికానందాన్ని, అపూర్వమైన స్మృతులను మిగిల్చే మౌంటు అబులోని అతి ప్రాచీన ఆలయమే అర్బుదా దేవి ఆలయం. దీనిని ఆధార్ దేవి ఆలయం అని కూడా పిలుస్తారు. మౌంట్ అబు ప్రాంతంలో అత్యంత ప్రాధాన్యాన్నిసంతరించుకున్న ఈ క్షేత్రాన్ని శక్తి పీఠంగా ఇక్కడి ప్రజలు భావిస్తారు. ఈ ఆలయాన్నిచేరుకోవడానికి 365 మెట్లు ఎక్కాల్సి ఉంటుంది.

అచల్ ఘర్ కోట: మౌంట్ అబుకు 11 కి.మీ దూరంలో ఉండే అచల్ ఘర్ కోట చారిత్రక విశేషాలతో ముడిపడి ఉంది. ఓ ప్రముఖ పర్యాటక క్షేత్రంగా విరాజిల్లుతున్న అచల్ ఘర్ కోట ప్రాంగణంలో అచలేశ్వర మహాదేవ్ ఆలయం ఉంది. ఈ కోటలో గల కొన్ని జైన దేవాలయాలు కూడా కోట ధార్మిక ప్రాముఖ్యత కు తోడ్పడుతున్నాయి.

రవాణ సదుపాయం: ఇతర ప్రాంతాల వారు గుజరాత్ మీదుగా ఇక్కడకు చేరుకోవడం తేలిక. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ వరకు దేశంలోని అన్ని ప్రధాన నగరాల నుంచి విమానాలు అందుబాటులో ఉన్నాయి. అక్కడి నుంచి అబు రోడ్‌కు రైలు ద్వారా చేరుకోవచ్చు.అలాగే న్యూఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, ముంబై వంటి నగరాల నుంచి అబు రోడ్ వరకు నేరుగా రైళ్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రసిద్ధ పర్యాటక క్షేత్రం కావడం వల్ల ఇక్కడ భోజన, వసతి సదుపాయాలకు ఎలాంటి ఇబ్బంది లేదు.

రామాయణానికి ప్రతిబింబం కన్నియ

హిందువులు విశ్వసించే పురాణ గ్రంథాలలో రామాయణం అగ్రభాగాన నిలుస్తుంది. శ్రీరాముని జీవిత విశేషాలలోని అనేక ఘట్టాలను వాల్మీకి మహర్షి అందంగా ఇందులో చిత్రీకరించారు. అయితే శ్రీరాముని జీవితానికి , శ్రీలంకకు ఓ అవినాభావ సంబంధం ఉంది. సీతామహా సాధ్విని రావణుడు ఎత్తుకెళ్ళిన చోటు శ్రీలంక. ఆ కారణంగానే రామాయణమంతా శ్రీలంక చుట్టూ తిరుగుతుంది.



రావణబ్రహ్మగా ఖ్యాతిగాంచిన రావణుడు అచంచల శివ భక్తుడు. గొప్ప రాజనీతిజ్ఞుడు. రోజుకి ఆరు కాలాల్లో శివార్చన చేసే రావణుడి బలహీనత స్త్రీ. ఆ స్త్రీలోలత్వమే శ్రీలంకను, రావణుడిని సర్వనాశనం చేసింది. రామాయణానికి సంబంధించిన మహత్తర ఘట్టాలెన్నో శ్రీలంకలో జరిగాయి. ఇటీవల జరిగిన పరిశోధనలుకూడా , లంకారాజ్యానికి చెందిన అనేక విషయాలను తెలియచేస్తున్నాయి. ఆ పరంపరలో శాస్త్రవేత్తలకు దొరికిన మరో అపురూప ప్రదేశమే 'కన్నియ'.

కన్నియ ఓ చారిత్రక ప్రదేశం. త్రేతాయుగం నాటి జ్ఞాపకాలను పదిలపరచుకున్నసుందర ధామం. రావణ బ్రహ్మ తల్లి కైకసి మరణానంతరం, ఆమె అంత్యక్రియలకు మంచినీరు కరువైందట. అప్పుడు రావణుడు తన త్రిశూలంతో ఏడుసార్లు నేలను గట్టిగా కొట్టాడట. దీంతో ఏడు ప్రాంతాలలోనూ నీటి ధార పైకి ఉబికి వచ్చింది. సముద్రానికి దగ్గరలో ఏర్పడిన మంచినీటి బావులివి. వీటినే ప్రస్తుతం రావణ వెల్స్ అని పిలవడం జరుగుతోంది. ఈ ఏడు బావులలో నీటి ఉష్ణోగ్రతలు ఏడు రకాలుగా ఉంటాయి. ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి అందాల నేపథ్యంగా సాగే కన్నియ క్షేత్రాన్ని రోజూ వేలాది మంది పర్యాటకులు సందర్శిస్తారు. కన్నియ ప్రాంతమంతా శ్రీలంక పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉంది. అందువల్ల ఈ ప్రాంతాన్ని అత్యంత జాగ్రత్తగా కాపాడుతున్నారు. చారిత్రక, పౌరాణిక విశేషాలతో ముడిపడి ఉన్న'కన్నియ' ప్రాంతంలో రావణుడి బావులను సందర్శించుకోవడానికి మనిషికి ఒక్కొక్కరు 50 రూపాయలు చెల్లించుకోవాలి. ప్రశాంతమైన వాతావరణంలో అలరారుతున్న ఈ రావణవెల్స్ ప్రాంతం నిత్యమూ వందలాది మంది భక్తులతో రద్దీగా ఉంటుంది. విశాలమైన ప్రాంగణంలో నిర్మించిన ఈ బావులు చిన్నచిన్నకుండాలుగా దర్శనమిస్తాయి. వీటి అడుగు భాగం కూడా కచ్చితంగా కనిపిస్తుంది. ఈ కుండాలలోని నీరు వేర్వేరు రుచులతో వేర్వేరు ఉష్ణోగ్రతలతో ఉండడం ఇక్కడి విశేషంగా చెబుతారు. సముద్రానికి సమీపంలో ఉన్నమంచినీటి బావులివి. ఈ ప్రాంగణంలోనే మరో పక్క శివాలయం కూడా దర్శనమిస్తుంది.

రవాణ సదుపాయం: కన్నియ క్షేత్రం కొలంబో నగరానికి సుమారు 325 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. అలాగే ట్రింకోమలికి 20 కి.మీ దూరంలో ఉంటుంది. ఇక్కడకు చేరుకోవాలనుకునే వారు ముందుగా కొలంబోకు వచ్చి అక్కడ నుంచి ఏదైనా వాహనంలో చేరుకోవచ్చు.

వీసా తప్పని సరి: శ్రీలంకలోని సుందర ప్రదేశాలను దర్శించుకోవాలనుకునే వారు తప్పక వీసా పొందాల్సి ఉంటుంది. ఈ దేశానికి చేరుకోవడానికి ఈవీసా కూడా అందుబాటులో ఉంటుంది.

భోజన, వసతి సదుపాయాలు: కన్నియలో భోజన వసతి సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అందువల్ల భోజన, వసతి సదుపాయాలను సమీప పట్టణమైన ట్రింకోమలిలో చేసుకోవడం ఉత్తమం.

మాట్లాడే భాష: శ్రీలంకలో సింహళం , తమిళం అధికారభాషలుగా గుర్తింపు పొందాయి. దేశమంతటా ఆంగ్లభాషను ప్రజలు అనుసంధాన భాషగా ఉపయోగిస్తుంటారు. అందువల్ల తమిళం, సింహళం భాషలు రాకపోయిరా ఇంగ్లీషు తో మ్యానేజ్ చేయొచ్చు.

కరెన్సీ: ఒక భారత రూపాయి విలువ శ్రీలంకలో రెండు రూపాయలకు(LKR) సమానం. శ్రీలంకలో ఎక్కడైనా భారత కరెన్సీ ఇచ్చి, శ్రీలంక కరెన్సీని తీసుకోవచ్చు.

తీవ్ర హెచ్చుతగ్గుల మధ్య స్వల్ప లాభాలు



ముంబై: తీవ్ర ఒడిదుడుకుల మధ్య దేశీయ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. కొనుగోళ్ల అండతో సూచీలు లాభాలతో ప్రారంభమైనప్పటికీ ఆద్యంతం హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ఆఖరికి స్వల్ప లాభాలను నమోదు చేశాయి. కొనుగోళ్ల అండతో ప్రారంభంలో సెన్సెక్స్ 100 పాయింట్లు పైగా లాభపడగా, నిఫ్టీ 10,900 మార్క్ పైన ట్రేడ్ అయ్యింది. అయితే డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోవడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లు కూడా బలహీనంగా ఉండటం మార్కెట్‌పై ప్రభావం చూపింది. దీంతో బుధవారం నాటి సెషన్‌లో సూచీలు తీవ్ర ఒడుదొడుకులకు గురయ్యాయి. ఒక దశలో నష్టాల్లోకి జారిన సూచీలు చివరకు స్వల్ప లాభాలను సాధించాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 3 పాయింట్లు లాభపడి 36,321 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 3.5 పాయింట్ల లాభంతో 10,890 వద్ద స్థిరపడింది. ప్రధానంగా ఎన్‌ఎస్‌ఇలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, యస్ బ్యాంక్, విప్రో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారత్ పెట్రోలియం షేర్లు లాభపడ్డాయి. మరోవైపు జెఎస్‌డబ్ల్యు స్టీల్, ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, యుపిఎల్ లిమిటెడ్, ఏసియన్ పెయింట్స్ షేర్లు నష్టపోయాయి.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,321.29	2.96	(0.01%)
నిఫ్టీ	10,890.30	3.50	(0.03%)



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.02
యూరో	80.96
బ్రిటిష్ పౌండ్	91.18
ఆస్ట్రేలియన్ డాలర్	50.68
కెనెడియన్ డాలర్	53.51
సింగపూర్ డాలర్	52.40
స్విస్ ఫ్రాంక్	71.89
చైనీస్ యువాన్	10.49
మలేషియన్ రింగిట్	17.19
న్యూజిలాండ్ డాలర్	47.86
హాంకాంగ్ డాలర్	8.98
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	232.67
సౌతాఫ్రికన్ రాండ్	5.09

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31020	33176.47	0.23%
ముంబై	31660	33860.96	0%
ఢిల్లీ	31600	33796.79	0%
కోల్‌కతా	31790	34000.00	0%
కేరళ	30150	32245.99	0%
బెంగళూరు	30340	32449.20	0.13%
హైదరాబాద్	31020	33176.47	0.23%
గల్ఫ్	137.45	147.00	−0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42600.00
ముంబై	₹ 42600.00
ఢిల్లీ	₹ 42600.00
కోల్‌కతా	₹ 42600.00
హైదరాబాద్	₹ 42600.00



ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ రేసులో ఇంద్రానూయీ



న్యూఢిల్లీ : గ్లోబల్ బివరేజ్ దిగ్గజం పెప్సికో సిఇఒ, భారతీయ మహిళ ఇంద్రానూయీ(63) ప్రపంచ బ్యాంక్ కొత్త ప్రెసిడెంట్ రేసులో ఉన్నారు. ఈ కీలక పదవి కోసం అమెరికా వైట్ హౌస్ ఆమె పేరను కూడా సూచించిందని ప్రముఖ అమెరికా వార్త సంస్థ వెల్లడించింది. ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవికి జిమ్ యోంగ్ కిమ్ రాజీనామా చేయడంతో కొత్త అధ్యక్షుడు ఎంపిక కోసం కసరత్తు జరుగుతోంది. అయితే కొత్త అధ్యక్షుడి ఎవరు అనే దానిపై రకరకాల ఊహాగానాలు వెలుడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్, ఐరాసలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీల పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. కాగా ఇప్పుడు తాజాగా పెప్సికో మాజీ సిఇఒ, ప్రముఖ భారత సంతతి మహిళ ఇంద్రానూయీ పేరు కూడా వినిపిస్తోంది. నూయీ ప్రపంచబ్యాంకు అధ్యక్షురాలు అయితే బాగుంటుందని అమెరికా అధ్యక్ష నివాసమైన వైట్‌హౌస్ భావిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ వైట్‌హౌస్ ఆమె పేరును ప్రతిపాదిస్తే అందుకు నూయీ అంగీకరిస్తారా లేదా అనే విషయంపై స్పష్టత లేదు. దాదాపు 12 ఏళ్ల పాటు పెప్సికోలో కీలక బాధ్యత నిర్వహించిన నూయీ గతేడాది ఆగస్టులో పదవీవిరమణ చేశారు. ప్రభావవంతమైన మహిళగా పేరు సంపాదించుకున్నారు.


ఆధార్ దుర్వినియోగంపై జాగ్రత్త అవసరం

మాజీ జాతీయ సలహాదారు ఎం.కె.నారాయణ్



కోల్‌కతా : దేశవ్యాప్తంగా ఆధార్ కార్డులు విస్తరించడం వల్ల భద్రతాపరమైన చర్యలు కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ జాతీయ సలహాదారు ఎం.కె.నారాయణ్ సూచించారు. సైబర దాడుల ముప్పు పొంచివున్న టాప్–5 దేశాల్లో భారత్ కూడా ఉందని ఆయన అన్నారు. బుధవారం ఇక్కడ బిసిసిఐ, సెనెర్స్–కె నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ సదస్సులో ఆయన ప్రసంగించారు. డిజిటల్ పరంగా భారత్ ప్రారంభ స్థాయిలోనే ఉందని, అదే సమయంలో ఆధార్ కార్డు వినియోగం ప్రతి రోజూ సర్వవాప్తమయిందని, గుర్తింపు కార్డుగా ఆన్‌లైన్‌లో ప్రతి అంశానికి దీనిని వినియోగిస్తున్నారని అన్నారు. మాల్వేర్ ఒక్కసారి కోడ్‌ను వినియోగిస్తే ఇది ఓపెన్ మార్కెట్లోకి వెళుతుంది. హ్యాకర్స్ దీనిని దుర్వినియోగం చేస్తారని పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ ఎంకె నారాయణన్ అన్నారు. పెరుగుతున్న ఇంటర్ కనెక్టివిటీతో సంప్రదాయ పరిమితులను కూడా సమర్థవంతంగా నాశనం చేస్తాయని ఆయన హెచ్చరించారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బిఎఫ్‌ఎస్‌ఐ), ఎనర్జీ, షిప్పింగ్ పవర్ వంటి క్లిష్టమైన మౌలిక సదుపాయాల తరంగాల్లోకి హ్యాకర్స్ ప్రవేశిస్తారని అన్నారు. భారత్‌లో వ్యాపారాలు అత్యంత ఎక్కువగా వీటి బారిన పడతాయని ఆయన హెచ్చరించారు.

గ్లోబల్ థింకర్స్ జాబితాలో ముకేశ్



న్యూఢిల్లీ : భారత్‌లో అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ మరో ఘనతను దక్కించుకున్నారు. ప్రతిష్టాత్మక ఫారిన్ పాలసీ ప్రచురించిన గ్లోబల్ థింకర్స్ 2019 జాబితాలో ముఖేష్ అంబానీ చోటు సంపాదించుకున్నారు. ఈ జాబితాలో అలీబాబా వ్యవస్థాపకుడు జాక్ మా, అమెజాన్ సిఇఒ జెఫ్ బెజోస్, ఐఎంఎఫ్ హెడ్ క్రిస్టిన్ లగార్డెలు కూడా ఉన్నారు. ప్రస్తుతం టాప్ 100 గ్లోబల్ థింకర్స్‌లో కొంతమంది పేర్లను మాత్రమే ప్రచురించిన ఈ సంస్థ జనవరి 22 నాటికి పూర్తి జాబితాను వెల్లడించనుంది. 44. 3 బిలియన్ డాలర్ల సంపదతో ముఖేష్ అంబానీ.. జాక్ మాను వెనక్కినెట్టి ఆసియాలో అత్యంత ధనవంతుడిగా అవతరించారు. ఆయిల్, గ్యాస్, రిటైయిల్ రంగాల్లో సత్తా చాటిన అంబానీ, ఇటీవల టెలికామ్ రంగంలోకి ప్రవేశించి జియోతో సంచలనం సృష్టించారు. జియోను ప్రారంభించిన ఆరు నెలల్లోపు 10 కోట్ల మంది కస్టమర్లను ఆకర్షించి స్మార్ట్‌ఫోన్ ఇంటర్‌నెట్ విప్లవానికి తెరతీశారు. ముకేశ్ రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థనే ఈ జియో, ఇంకా ఎన్నో ఉత్పత్తులతో ముకేశ్ సంచనాలకు నాంది పలికేందుకు సిద్ధమయ్యారు. 2019తో గ్లోబల్ థింకర్స్ జాబితా ప్రచురణ పదేళ్ల వసంతంలోకి అడుగు పెడుతోందని ఫారిన్ పాలసీ పేర్కొంది. వంద మంది గ్లోబల్ థింకర్స్‌లో మొత్తం 10 కేటగిరీలు ఉంటాయని, ముఖేష్ అంబానీ టాప్ 10 టెక్నాలజీ థింకర్స్‌లో చోటు దక్కించుకున్నారని వెల్లడించింది.

జెట్‌ఎయిర్‌వేస్‌కు షాకిచ్చిన ఎతిహాద్

స్టాక్ విలువ 7 శాతం పతనం





న్యూఢిల్లీ: గల్ఫ్‌కు చెందిన ఈ విమానయాన సంస్థ ఎతిహాద్ ఎయిర్‌లైన్స్.. జెట్ ఎయిర్‌వేస్‌లో వాటాలను పెంచుకునే విషయంలో షాకిచ్చింది. ఒక్కో షేర్‌కు రూ.150కి మించి ఇవ్వలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతం మార్కెట్లో జెట్ ఎయిర్‌వేస్ షేరు రూ.275 వద్ద ఉంది. అంటే ఎతిహాద్ 40 శాతం డిస్కౌంట్‌లో అడిగింది. ఎతిహాద్ ఆఫర్‌కు జెట్ ఎయిర్ ఇంకా స్పందించలేదు. ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. కాగా తమ డిమాండ్లకు అనకూలంగా ఉంటే తక్షణం 35 మిలియన్ డాలర్లు ఇచ్చేందుకు సిద్ధమని ఎతిహాద్ స్పష్టం చేసింది. డిస్కౌంట్‌కు షేర్లను ఇవ్వడంతోపాటు మేనేజ్‌మెంట్ బోర్డు నుంచి గోయల్ కుటుంబ సభ్యులు పూర్తిగా వైదొలగాలని ఎతిహాద్ కోరుకుంటోంది. ఒకవేళ చైర్మన్ ఎమిరిటస్ హోదా నరేష్ గోయల్‌కు ఇవ్వాల్సి వస్తే.. ఆయన పరిధులు ఎలా ఉండాలో కూడా స్పష్టం చేసింది. ఈ వార్తల నేపథ్యంలో బుధవారం ఈ స్టాక్ విలువ 7 శాతం నష్టపోయి రూ.272 వద్ద ముగిసింది.

ఎస్‌బిఐ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రైవేటు విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్‌ను గాడిన పడేసేందుకు బ్యాంకులు, ఇతర సంస్థలతో పాటు ఎస్‌బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) పునరుద్ధరణ ప్రణాళిక కోసం కసరత్తు జరుగుతోంది. నిధుల విషయమై ప్రణాళికను రూపొందిస్తున్నారని, చర్చలు జరుపుతున్నారని, బోర్డు డైరెక్టర్లలోనూ తరచూ మార్పులు జరుగుతున్నాయని విమాన సంస్థ వెల్లడించింది. వాటాల విక్రయం నేపథ్యంలో పునరుద్ధరణ ప్రణాళికపై అనిశ్చితి నెలకొంది. ఖర్చు తగ్గింపు, రుణం తగ్గించుకునేందుకు, నిధుల కోసం వివిధ అంశాలను పరిశీలిస్తున్నట్టు జెట్ ఎయిర్ పేర్కొంది.

ఐసిఐసిఐ బ్యాంక్ ఇడిగా మరో రెండేళ్లు విశాఖ ములై



న్యూఢిల్లీ : ఐసిఐసిఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇడి)గా విశాఖ ములైను మరో సారి నియమించారు. రెండేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగుతారని, దీనికి ఆర్‌బిఐ ఆమోదం తెలిపిందని బుధవారం ఐసిఐసిఐ బ్యాంక్ ప్రకటించింది. జనవరి 19 నుంచి తిరిగి నియామకం అమల్లోకి వస్తుందని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో బ్యాంక్ వెల్లడించింది. 2015 నుంచి ఆమె బ్యాంక్ ఇడి, హోల్‌సేల్ బ్యాంకింగ్ గ్రూప్ హెడ్‌గా సేవలందిస్తున్నారు.

నేడు ఇండస్ట్రీ చాంబర్లతో ఆర్‌బిఐ గవర్నర్ భేటీ



న్యూఢిల్లీ: ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ఇండస్ట్రీ చాంబర్లతో సమావేశం కానున్నారు. వారి సమస్యలు, ఇతర అంశాల గురించి తెలుసుకోనున్నారు. గత నెలలో 25వ ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు(ఎన్‌బిఎఫ్‌సి), సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో(ఎంఎస్‌ఎంఇ) సమావేశమయ్యారు. వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. జనవరి 17న పరిశ్రమ సంస్థలతో సమావేశం కానున్నామని ట్విట్టర్ ద్వారా దాస్ వెల్లడించారు. ఫిబ్రవరి 7న ఆర్‌బిఐ ఆరో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష జరుగనుంది. ఈ సమీక్షలో వడ్డీ రేట్లపై ప్రకటన చేయనున్న నేపథ్యంలో ముందుగా గవర్నర్ అందరితో సమావేశమైన అభిప్రాయాలను సేకరిస్తున్నారు. పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణం తగ్గిన నేపథ్యంలో వడ్డీ రేట్లను తగ్గించాలని పరిశ్రమ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. కాగ డిసెంబర్‌లో ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి దిగొచ్చింది. ఓ వైపు రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్టానికి, మరోవైపు టోకు ద్రవ్యోల్బణం 8 నెలల కనిష్టానికి దిగొచ్చాయి. ఆహార వస్తువుల ధరలు తగ్గడం, చమురు ధరల తగ్గదల రిటైల్ ద్రవ్యోల్బణం అత్యంత కనిష్టానికి దిగొచ్చింది. డిసెంబర్‌లో వినిమయ ధరల సూచీ(సిపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2.19 శాతం నమోదు చేసింది. అంతకు ముందు నవంబర్ నెలలో ఇది 2.33 శాతంగా ఉంది. అయితే 2017 డిసెంబర్‌లో 5.21 శాతం నమోదైంది.మరోవైపు డిసెంబర్ నెలలో టోకు ధరల సూచీ(డబ్ల్యుపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.80 శాతం నమోదైంది. చమురు ధరలు అదుపులో ఉండడం, కొన్ని ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో ఈసారి 8 నెలల కనిష్టానికి తగ్గింది. టోకు ద్రవ్యోల్బణం తగ్గడం ఇది వరుసగా రెండో నెల.. నవంబర్‌లో 4.64 శాతంగా, అక్టోబర్‌లో 5.54 శాతంగా ఉంది. అలాగే 2017 డిసెంబర్ నెలలో టోకు ద్రవ్యోల్బణం 3.58 శాతంగా ఉంది.. అంటే ప్రస్తుతం కంటే దిగువనే ఉంది. అయితే 2018 ఏప్రిల్‌లో నమోదైన 3.62 శాతం టోకు ద్రవ్యోల్బణం తర్వాత ఇదే కనిష్ఠం కావడం గమనార్హం. కాగా తయారీ రంగంలో ప్రతికూలతల కారణంగా గతేడాది నవంబర్‌లో దేశీయ పారిశ్రామిక ఉత్పత్తి క్షీణించింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపి) 0.5 శాతంతో 17 నెలల కనిష్టానికి పడిపోయింది.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
ఎస్ బ్యాంకు	209.15	203.50	208.35	203.00	5.35	2.64
ఇండియాబుల్స్ హెచ్ఎస్‌జి	838.00	808.00	829.60	808.85	20.75	2.57
ఇండస్‌ఇండ్ బ్యాంకు	1,532.00	1,495.95	1,526.70	1,495.20	31.50	2.11
విప్రో	339.80	329.05	336.55	329.80	6.75	2.05
బిపిసిఎల్	349.00	342.35	347.25	341.70	5.55	1.62
అల్ట్రాటెక్ సిమెంట్	3,908.00	3,835.20	3,887.00	3,827.65	59.35	1.55
ఇన్ఫోసిస్	737.80	728.50	736.80	726.60	10.20	1.40
గ్రాసిం	841.45	820.80	826.30	815.50	10.80	1.32
ఆదానీ పోర్ట్స్	390.70	379.20	389.30	385.15	4.15	1.08
ఐటిసి	136.00	134.15	135.80	134.55	1.25	0.93

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
జెఎస్‌డబ్ల్యూ స్టీల్	293.25	285.35	286.45	292.10	5.65	1.93
భారతి ఇన్‌ఫ్రాటెల్	284.40	274.50	275.85	279.75	3.90	1.39
బజాజ్‌ఫైనాన్స్	2,612.15	2,562.80	2,569.85	2,604.20	34.35	1.32
వేదాంత	202.25	195.70	196.30	198.90	2.60	1.31
యుపిఎల్	775.95	752.60	766.10	775.95	9.85	1.27
ఎసియన్ పెయింట్స్	1,412.95	1,387.70	1,389.75	1,405.95	16.20	1.15
భారతి ఎయిర్‌టెల్	345.25	331.40	333.95	337.75	3.80	1.13
హీరో మోటోకార్ప్	2,914.95	2,870.30	2,879.85	2,910.95	31.10	1.07
జీ ఎంటర్‌టైన్	475.75	450.20	452.10	456.80	4.70	1.03
హెచ్‌సిఎల్ టెక్	954.20	936.75	938.25	947.70	9.45	1.00

దీపికతో నా ప్రేమ బంధం ఎంతో ప్రత్యేకమైనది. మా ప్రేమ విషయంలో ఎన్నో ఒడుదుడుకులు వచ్చాయి. కానీ దీపికనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. ఆమె కోసం ఎంత దూరమైనా వెళ్లాలనుకున్నాను. చివరికి దీపికను పెళ్లాడి నేను అనుకున్నది సాధించాను.

–బాలీవుడ్ హీరో రణవీర్ సింగ్

సినిమా

ఆటోమేటిక్‌గా వచ్చేసింది


వెంకటేష్

సంక్రాంతికి విడుదలైన 'ఎఫ్2' చిత్రం విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు సీనియర్ స్టార్ వెంకటేష్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఆయన వరుణ్‌తేజ్‌తో కలిసి నటించారు. ఈ చిత్ర విజయం తర్వాత తాజాగా విలేకరులతో ముచ్చటిస్తూ తొలిసారిగా తన భార్య గురించి మాట్లాడారు వెంకటేష్. తన కుటుంబం, వ్యక్తిగత వివరాలను పెద్దగా బయటపెట్టని ఈ సీనియర్ హీరో 'ఎఫ్2' ఇచ్చిన విజయానందంతో తన భార్య గురించి కొన్ని విషయాలు చెప్పారు. ''మా ఆవిడతో లైఫ్ వండర్‌ఫుల్‌గా ఉంటుంది. ఆమె పక్కనుంటే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. భార్య పక్కనుంటే ప్రతి ఒక్కరికి మంచి ఎనర్జీ వస్తుందని నా ఫీలింగ్. ప్రతి రోజు సాయంత్రం మా భార్యకు కొంత సమయం కేటాయిస్తాను. అప్పుడు అన్ని విషయాలు మాట్లాడుకుంటాం. మంచి భోజనం తింటాం. లేదంటే ఏదైనా రెస్టారెంట్‌కు వెళ్తాం''అని అన్నారు. ఇక 'ఎఫ్2' సినిమాలో తన పాత్రను అంతలా ఎంజాయ్ చేస్తూ చేయడానికి కూడా తన భార్యే కారణమని అన్నారు వెంకటేష్. ఇక ఈ సినిమాలో హిట్ అయిన ఓ డైలాగ్‌పై ఆయన స్పందించారు. అది అనుకోకుండా పెట్టామన్నారు. టీజర్‌లో పెళ్లికి ముందు, పెళ్లయిన తర్వాత అంటూ నేను చెప్పిన ఓ డైలాగ్ ఉంటుంది. పెళ్లికి ముందు అంటూ వచ్చే వర్షన్ డైలాగ్‌ను గొప్పగా చెబుతాను. పెళ్లి తర్వాత అనే వర్షన్ డైలాగ్‌ను ఏడుస్తూ చెబుతాను. నటించేటప్పుడు అది ఆటోమేటిక్‌గా వచ్చేసింది. ఆ సీన్ బాగా వచ్చింది. అందుకే దర్శకుడు అనిల్ ఆ సీన్‌ను టీజర్‌లో కూడా పెట్టాడు. ఇక సంక్రాంతి బరిలో సిసలైన హిట్‌గా నిలిచిన 'ఎఫ్2' తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లో కూడా సక్సెస్ అయింది.

నా వెంటపడే ధైర్యం ఎవ్వరూ చేయలేదు


రకుల్‌ప్రీత్ సింగ్


ఇప్పుడు సినిమాల్లో హీరోయిన్స్ అంటే హీరోతో ప్రేమ వ్యవహారాల కోసమే అన్నట్లుంటారు. తమ కెరీర్ మొత్తంలో ఒకటీ అరా మినహాయిస్తే... మంచి రోల్స్ దొరికే ఛాన్సులు తక్కువ. అందరూ ఇదే దారిలో లేకపోయినా... మెజారిటీ హీరోయిన్ల తీరు ఇదే. కానీ రకుల్‌ప్రీత్ సింగ్ డిఫరెంట్ రోల్స్ చేస్తూ హీరోయిన్‌గా మంచి పేరుతెచ్చుకుంది. ఈ భామకు 'ప్రేమ' అంటే చిన్నచూపట. ''నా దృష్టిలో ప్రేమ అంటే చాలా చిన్న విషయం. అసలు నేను ఇలాంటి చిన్న చిన్న విషయాలకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వను''అని చెబుతోంది రకుల్. ప్రస్తుతం ఈ భామ తమిళ్ సినిమాలతో బిజీగా ఉంది. ఈ భామను ప్రేమపై మీ అభిప్రాయమేంటి అని అడిగితే... ''అసలు ప్రేమ గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. స్కూల్లో చదివే సమయంలో ఓ కుర్రాడు ఐ లవ్ యూ చెప్పాడు. నేనేంటి... ప్రేమించడమేంటి... అంటూ పెద్ద క్లాస్ తీసుకున్నాను. అయితే కాలేజీ రోజుల్లో మాత్రం నా వెంటపడే ధైర్యం ఎవ్వరూ చేయలేదు. ఒకవేళ ఎవరైనా వెంటబడ్డా నేను పట్టించుకోలేదు''అని అంటోంది రకుల్. అసలు సమయాన్ని వృథా చేయడం తనకు నచ్చదని... స్కూల్లో చదివే సమయంలో అయితే చదువులోనే కాదు ఆట పాటల్లోనూ నాకు ఫస్ట్ ర్యాంక్ అని అంటోంది ఈ భామ. అందరికంటే ముందుండాలి అని కోరుకునే తత్వమే... తనను ఈ స్థాయికి చేర్చిందని గర్వంగా చెప్పిన రకుల్‌ప్రీత్ సింగ్ ప్రేమలో మాత్రం తనది చివరి స్థానం అని అంటోంది

వచ్చే నెలలోనే పెళ్లి


విశాల్, అనీషా రెడ్డి

కొన్ని రోజులుగా విశాల్ పెళ్లి వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తన కొడుకుకి త్వరలోనే పెళ్లి చేయబోతున్నామంటూ విశాల్ తండ్రి జికె రెడ్డి కూడా ప్రకటించారు. తాజాగా ఓ ఈవెంట్‌లో తన పెళ్లి వార్తను విశాల్ కూడా నిర్ధారించారు. ఈ హీరోకు కాబోయే భార్య పేరు అనీషా రెడ్డి. హైదరాబాద్‌కు చెందిన ఈ అమ్మాయిని విశాల్ పెళ్లాడబోతున్నారు. ఇది లవ్ కమ్ అరేంజ్డ్ మ్యారేజ్ కావడం విశేషం. వీరిద్దరి ప్రేమను పెద్దలు ఒప్పుకున్నారు. వచ్చే నెలలో విశాల్‌అనీషా పెళ్లి జరుగబోతోంది. ఇంతకుముందు విశాల్ ప్రకటించినట్టుగానే చెన్నైలోని నడిగర్ సంఘం కొత్త భవనంలోనే వీరి పెళ్లి జరుగనుంది. ఇక అనీషా రెడ్డికి సినిమాల్లో నటించిన అనుభవం కూడా ఉంది. సూపర్ హిట్ అయిన పెళ్లి చూపులు, అర్జున్ రెడ్డి సినిమాల్లో అనీషా చిన్న పాత్రలు చేసింది. ఆతర్వాత సినిమాల్లో కనిపించలేదు. మొత్తానికి 41 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకోబోతున్నారు విశాల్. ప్రస్తుతం ఈ హీరో 'అయోగ్య' అనే సినిమాలో నటిస్తున్నారు. తెలుగులో హిట్ అయిన 'టెంపర్' సినిమాకు రీమేక్ ఇది.

విప్లవకారుడు ఓబయ్య



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి వరుసగా విజయవంతమైన చిత్రాలు చేస్తూ తమిళ ప్రేక్షకులను అలరిస్తున్నాడు. 2018లో అరడజను సినిమాల్లో నటించిన ఆయన ఈ ఏడాది కూడా మరో అర డజను సినిమాల్లో నటిస్తున్నాడు. వీటిలో మెగాస్టార్ చిరంజీవి చిత్రం 'సైరా నరసింహారెడ్డి' వంటి భారీ సినిమా కూడా ఉంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి ఓబయ్య అనే విప్లవకారుడి పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా అతని లుక్‌ను సినిమా టీమ్ విడుదల చేసింది. విజయ్ పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఈ పోస్టర్‌ను విడుదల చేశారు ఫిల్మ్‌మేకర్స్. ఈ పోస్టర్‌లో విజయ్ సేతుపతి శివ భక్తుడైన ఓబయ్యగా కనిపిస్తున్నాడు. చేతిలో కత్తితో గంభీరంగా దర్శనమిచ్చి ఆకట్టుకుంటున్నాడు.

బ్రహ్మానందంకు బైపాస్ సర్జరీ


బ్రహ్మానందం

స్టార్ కమేడియన్ బ్రహ్మానందం ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ముంబయిలోని ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ (ఎహెచ్ఐ)కు తీసుకువెళ్లారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి గుండెకు శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. సోమవారం నాడు బ్రహ్మానందంకు బైపాస్ సర్జరీ నిర్వహించారు. ప్రముఖ కార్డియాక్ సర్జన్ రమాకాంత్ ఆధ్వర్యంలో ఈ సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. బ్రహ్మానందం తనయులు రాజా గౌతమ్, సిద్ధార్థ్‌లతో పాటు ఇతర కుటుంబ సభ్యులు కూడా హాస్పిటల్ వద్దే ఉన్నారు. ఇక సర్జరీ విషయం తెలిసిన తర్వాత ఆయన అభిమానులు, చిత్ర పరిశ్రమలో ఆయనతో పనిచేసిన వారు బ్రహ్మానందం త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు పెడుతున్నారు. 1985లో 'అహ నా పెళ్లంట' సినిమా ద్వారా టాలీవుడ్‌లో అడుగుపెట్టిన బ్రహ్మానందం తెలుగులో వెయ్యికి పైగా సినిమాల్లో నటించారు. అత్యధిక చిత్రాలలో నటించినందుకు ఆయన గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించుకున్నారు.


సూపర్‌స్టార్ కృష్ణ, విజయనిర్మల, నరేష్, నవీన్ విజయ్ కృష్ణ తదితరులు

టైటిల్ బావుంటే సినిమా నగం సక్సెస్ అయినట్టే

నవీన్ విజయ్‌కృష్ణ, శ్రీనివాస్ అవసరాల హీరోలుగా మేఘా చౌదరి, సోఫియా సింగ్ హీరోయిన్‌లుగా తెరకెక్కుతున్న చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. బాలాజి సానల దర్శకత్వంలో శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్.రెడ్డి, ఎ.పద్మనాభ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగోను సూపర్‌స్టార్ కృష్ణ, ఫస్ట్‌లుక్‌ను విజయనిర్మల విడుదల చేశారు. ఇక హీరో ఫస్ట్‌లుక్‌ను నరేష్, నవీన్ లుక్ టీజర్‌ను కృష్ణ, విజయనిర్మల విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ''టైటిల్ బావుంటే సినిమా నగం సక్సెస్ అయినట్టే. ఈ సినిమాకు 'ఊరంతా అనుకుంటున్నారు' అనే పాజిటివ్ టైటిల్ దొరికింది. హీరో నవీన్ పాటలు, ఫైట్లు అన్నీ బాగా చేయగలుగుతున్నాడు. అతనికి మంచి భవిష్యత్తు ఉంటుంది''అని అన్నారు. నవీన్ మాట్లాడుతూ ''పాలకొల్లులో ఈ సినిమా షూటింగ్ చేశాం. ఇది చాలా మంచి సినిమా అవుతుంది''అని తెలిపారు. నరేష్ మాట్లాడుతూ ''నందిని నర్సింగ్‌హోమ్‌తో నవీన్ మంచి హీరోగా పేరు తెచ్చుకున్నాడు. హీరోగా నిలదొక్కుకోవాలని అతను కష్టపడుతున్నాడు. కథ బాగా నచ్చి ఈ సినిమా చేస్తున్నాడు. ఇది మంచి ఎంటర్‌టైనర్ అవుతుంది''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.ఎం.రాధాకృష్ణన్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది.

10 వసంతాల 'అరుంధతి'


అనుష్క, సోనూసూద్

తెలుగు తెరపై కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాల్లో కొన్ని మాత్రమే విజయం సాధించాయి. కొన్ని చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్లపరంగా సంచలనం సృష్టించాయి. ఆ చిత్రాలలో అనుష్క ద్విపాత్రాభినయంలో నటించిన 'అరుంధతి' ఒకటి. డార్క్ ఫాంటసీ హారర్ ఫిల్మ్‌గా రూపొందిన ఈ సినిమాను మల్లెమాల ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శ్యామ్‌ప్రసాద్ నిర్మించారు. శతాధిక చిత్రాల దర్శకుడు కోడి రామకృష్ణ జనరంజకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 2009 జనవరి 16న విడులైన 'అరుంధతి' బుధవారంతో 10 వసంతాలను పూర్తిచేసుకుంది. గద్వాల్ యువరాణి అరుంధతిగా, జేజమ్మగా రెండు విభిన్న పాత్రల్లో అనుష్క నటన ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అలాగే 'వదల బొమ్మాళి వదలా...' అంటూ పశుపతిగా విలన్ పాత్రలో సోనూసూద్ అభినయం ప్రేక్షకులను మైమరపించింది. కైకాల సత్యనారాయణ, మనోరమ, షాయాజీ షిండే, సుభాషిణి, చలపతిరావు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి కోటి సంగీతాన్ని అందించారు. వీటిలో డా.సి.నారాయణ రెడ్డి రచించిన 'జేజమ్మ...', వేటూరి సుందరరామ్మూర్తి రాసిన 'భ భ భుజంగం', అనంత శ్రీరామ్ సాహిత్యమందించిన 'చందమామ...' పాటలు బాగా ప్రాచుర్యం పొందాయి

పెళ్లి పీటలెక్కనున్న రిచా


జో,రిచా


ప్రభాస్ సరసన 'మిర్చి' సినిమాలో కథానాయికగా నటించిన రిచా గంగోపాధ్యాయ్ త్వరలో పెళ్లి చేసుకోనుంది. అమెరికాలో చదువుకోవడానికి వెళ్లిన ఈ భామ తన క్లాస్‌మేట్ జోతో ప్రేమలో పడగా తాజాగా నిశ్చితార్థం కూడా జరిగింది. తెలుగులో రవితేజ సరసన 'మిరపకాయ్', గోపీచంద్‌తో 'వాంటెడ్' సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది రిచా గంగోపాధ్యాయ్. ఈ అమ్మడి కెరీర్ 'భాయ్' సినిమాతో ముగిసింది. ఆతర్వాత ఉన్నత చదువుల కోసం ఆమె అమెరికాకు వెళ్లింది. ఇక తాజాగా తనకు కాబోయే భర్త జోతో కలిసి ఉన్న ఫొటోను రిచా తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. ''నా అభిమానులకు ఓ శుభవార్త చెబుతున్నాను. నాకు జోతో నిశ్చితార్థం పూర్తయింది. నేను, జో బిజినెస్ స్కూల్‌లో కలిశాం... ప్రేమలో పడ్డాం. రెండేళ్లు అద్భుతంగా గడిచిపోయాయి. నా జీవితంలో ఓ కొత్త దశలోకి అడుగుపెతున్నాను. మా పెళ్లి తేదీ ఇంకా ఖరారు కాలేదు''అని రిచా తెలిపింది. మొత్తానికి రిచా సినిమాలకు స్వస్తి చెప్పి పెళ్లితో కొత్త జీవితంలోకి అడుగుపెట్టబోతోంది. ఇకపై సినిమాల్లో నటించే ఆసక్తి లేదని ఆమె చెప్పేసింది.

టీనేజీలోనే డేటింగ్ చేసేదాన్ని


షెర్లిన్ చోప్రా

డబ్బుకోసమే తాను సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టానని బాలీవుడ్ నటి షెర్లిన్ చోప్రా పేర్కొంది. పలు బాలీవుడ్ సినిమాల్లో హాట్ హాట్‌గా నటించి సంచలనం సృష్టించింది ఈ భామ. ''చిన్న పిల్లగా ఉన్నప్పుడు నాకు డాక్టర్ కావాలని ఉండేది. కేవలం చనిపోయిన మా నాన్న కూడా డాక్టర్ అవడమే అందుకు కారణం కాదుగానీ... సైన్స్ అంటే నాకు చాలా ఇష్టం. కేవలం అకాడమిక్ విషయాల్లోనే కాకుండా ఇతర అంశాల్లో కూడా ముందుండేదాన్ని. అందాల పోటీలో గెలుపొందే వరకు అంతా బాగానే ఉంది. 19 ఏళ్లకు గ్లామర్ పిచ్చిలో పడి ఓ విభిన్న మార్గాన్ని ఎంచుకున్నాను. టీనేజ్‌లో నేను మోడలింగ్ చేసే రోజుల్లో నాకంటే వయసులో పెద్దవారితో డేటింగ్ చేసేదాన్ని. వాళ్లు నాకు ఎంతో విలువైన గిఫ్టులు ఇచ్చేవారు. దీంతో ఎవరు నన్ను నిజంగా ప్రేమిస్తున్నారు, గౌరవిస్తున్నారు... అనే విషయం తెలుసుకోవడం కష్టంగా మారింది. కానీ ఆతర్వాత నిజం తెలిసింది'' అని ఈ భామ చెప్పింది.

అప్పటి నుంచే నేను అథ్లెట్‌ని


జాక్వెలిన్ ఫెర్నాండెజ్

తెలుగులో ఇప్పుడు వస్తున్న యంగ్ హీరోలందరూ ఎంతో ఫిట్‌గా కనిపిస్తున్నారు. బాలీవుడ్ అంటే ఇంకా చెప్పే పని లేదు. అక్కడ యంగ్ హీరోలకు ఉండాల్సిన కనీస అర్హత ఫిట్‌గా ఉండడమే. అయితే ఈ హీరోల గురించి వారితో పనిచేసిన హీరోయిన్ చెబితే ఎంతో బాగుంటుంది. బాలీవుడ్‌లో హాట్ అండ్ ఫిట్‌గా ఉండే హీరోయిన్ జాక్విలిన్ ఫెర్నాండెజ్ తనతో కలిసి పనిచేసిన హీరోల ఫిట్‌నెస్ గురించి చెప్పింది. ''స్కూలు రోజుల నుంచే నేను అథ్లెట్‌ని. బాస్కెట్‌బాల్ ఆడేదాన్ని. ప్రతి రోజు జిమ్‌కు వెళ్లేదాన్ని. ఇప్పుడు కూడా ప్రతిరోజు జిమ్‌కు వెళ్లడం నాకు అలవాటుగా మారింది. అయితే నేను కలిసి పనిచేసిన హీరోలలో సల్మాన్ ఖాన్ ఫిట్‌నెస్ కింగ్. ఇకపోతే వరుణ్‌ధావన్‌తో కలిసి జిమ్‌లో ఎక్సర్‌సైజ్‌లు చేయడం నాకు బాగా ఇష్టం. వరుణ్ కూడా నాలాగే ఆలోచిస్తాడు. కొంచెం సేపు వ్యాయామాలు చేసిన వెంటనే ఏదైనా తిందామా అని అడుగుతాడు. చాలా ఫన్నీగా ఉంటాడు. టైగర్ ష్రాఫ్, జాన్ అబ్రహం కూడా జిమ్‌లో బాగా కష్టపడతారు''అని జాక్విలిన్ చెప్పింది. తన ఫిట్‌నెస్‌తో మరింత హాట్‌గా మారిన జాక్విలిన్ ప్రస్తుతం బాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతోంది.

పోటీ



ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

మహద్ ఉద్యమాన్ని ప్రారంభించిందెవరు?

పండిత రమాబాయి సరస్వతి (1858-1922)

- రమాబాయి స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి బాల్య వివాహాలను వ్యతిరేకించడానికి పూణేలో 'మహిళా ఆర్యసమాజం'ను స్థాపించింది.
- 1880లో బెంగాల్‌కు చెందిన బిహారీ దాస్ మెడ్ హలిని వివాహమాడింది.
- **సంస్థలు :** మహిళా ఆర్యసమాజం (మహిళల కొరకు), శారదాసదన్ (వితంతువుల కొరకు), ముక్తిసదన్ (కరువు బాధితుల కొరకు).
- ఈమె హిందూమతంపై విశ్వాసం కోల్పోయి క్రైస్తవ మతంను స్వీకరించింది.
- **బిరుదులు :** పండిత, సరస్వతి, కైజర్ ఇ హింద్
- 1887లో దేవసమాజాన్ని – లాహోర్‌లో శివనారాయణ అగ్నిహోత్రిగా ఏర్పాటు చేశాడు.

భారతదేశంలో పత్రికల వ్యాప్తి

- భారతదేశ ప్రథమ పత్రిక – బెంగాల్ గెజిట్ 1780 – కలకత్తాలో ఆంగ్లంలో.
- దీని స్థాపకుడు – జేమ్స్ ఆగస్టన్ హిక్కీ
- మద్రాస్ నుండి వచ్చిన తొలిపత్రిక – మద్రాస్ కొరియర్ (1784)
- బొంబాయి నుండి వచ్చిన తొలిపత్రిక – బాంబేహెరాల్డ్ (1789)
- బెంగాలీ భాషలో తొలిపత్రిక – సమాచార దర్పణ్ (1818) దీని స్థాపకుడు – విలియంహేరీ)
- 'Times of India' – 1861 – గతంలో దీని పేరు బాంబే టైమ్స్ (1838లో)
- భారతదేశలో తొలి సాయంకాల పత్రిక – మద్రాస్ మెయిల్ 1868– మద్రాస్
- అమృత్ బజార్ పత్రిక (తొలిగా బెంగాలీలో ప్రచురించబడి తర్వాత ఆంగ్ల పత్రికగా మారినది) 1868 – కలకత్తా సుషీల్‌కు మార్‌ఘోష్
- The Hindu – 1881 – మద్రాస్ (G.సుబ్రమణ్య అయ్యార్, వీరరాఘ వాచారి)
- ఆంధ్రదేశంలోని తొలి తెలుగు పత్రిక – సత్యదూత 1833 – బళ్ళారి క్రైస్తవ మిషనరీ సొసైటీ, ఆంధ్రప్రకాశిక – 1885 (తొలి రాజకీయ వార పత్రిక)
- కృష్ణ పత్రిక (తొలి రాజకీయ దినపత్రిక) – స్థాపకుడు – కొండా వెంకటప్పయ్య, తర్వాత నారాయణదాస్, తర్వాత ముట్నూరి కృష్ణారావులు నేతృత్వం వహించారు.

మత ఉద్యమాలు

- 19 శతాబ్దం ఆరంభంలో భారతదేశంలో అగ్రకులాలు, నిమ్న కులాల వారి మధ్య వ్యత్యాసం అధికంగా ఉండేది.
- అగ్ర కులాల ఆదిపత్యంనకు వ్యతిరేఖంగా భారతదేశంలో అనేక ఉద్యమాలు జరిగాయి. ఇవి ప్రధానంగా గుజరాత్, మహారాష్ట్ర, కేరళలో జరిగాయి.

గుజరాత్

- గుజరాత్‌లో అగ్రకులాల వారిని 'ఉజాలి పదాలు' అనేవారు నిమ్నకులాల వారిని కాలీపరాలు అనేవారు.
- గుజరాత్‌లో హోలీ విధానం ఉండేది (వంశపారం పర్యంగా బానిసత్వంలో ఉండుట).
- గుజరాత్‌లో అగ్రకులాల ఆదిపత్యంకు వ్యతిరేఖంగా పోరాటం చేసిన మొట్టమొదటి వ్యక్తి – కర్సందాస్ ముల్జీ.
- ఇతడు సత్యప్రకాష్ అనే పత్రిక ద్వారా అగ్రకులాల ఆదిపత్యంను వ్యతిరేకించాడు.

మహారాష్ట్ర

- మహారాష్ట్రలో అగ్రకులాలకు వ్యతిరేఖంగా పోరాటం చేసిన మొట్టమొదటి వ్యక్తి – బాలశాస్త్రీ జంబేకర్.
- బాలశాస్త్రీ జంబేకర్ 'దర్పణ్' అనే జర్నల్‌ను నడిపాడు.
- మహారాష్ట్రలో కొంతమంది విద్యార్థులు నిమ్నకులాలను చేయులకై స్టూడెంట్ లిటరరీ సొసైటీని ఏర్పాటు చేసారు. దీనిలో మరాఠా జ్ఞాన ప్రకాశ మండలి, గుజరాత్ జ్ఞాన ప్రకాశ మండలి ఉన్నాయి.
- పాండురంగతర్కడ్ పరమహంస మండలిని ఏర్పాటు చేసి అగ్రకులాల ఆధిపత్యంను ఖండించాడు.
- పరమహంస మండలిలో అతి ముఖ్యమైన సభ్యులు గోపాలహరిదశ్‌ముఖ్ (లోకహితవాది).
- మహారాష్ట్రలో నిమ్నకులాల ఆధిపత్యం కోసం అత్యధికంగా పోరాటం చేసిన వ్యక్తి – జ్యోతిబాపూలే.
- జ్యోతిబాపూలే పూలు అమ్ముకునే మాలి అనే తెగకు చెందినవాడు.
- జ్యోతిబాపూలే బిరుదు – మహాత్మ. ఇతని నవల – గులాంగిరి 1872.
- 1873లో సత్యశోదక్ సమాజ్‌ను ఏర్పాటు చేసి వెనుబడ్డ తరగతుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు తెలియజేసాడు.
- ఇషారా అనే పుస్తకంలో నిమ్నకులాల వారి హక్కులను తెలియజేసి అగ్రకులాల అధిపత్యంను ఖండించాడు.
- జ్యోతిబాపూలే తన భార్య సావిత్రి బాయిపూలేతో పూణే వద్ద వెనుకబడ్డ వర్గాల వారి కోసం ఒక పాఠశాలను ఏర్పాటు చేశారు.
- ఈ పాఠశాల నిర్వాహణకు డబ్బులను సమకూర్చినవారు జగన్నాథ్ శంకర్ సేఠ్, దావ్‌దాజి.
- మహద్ ఉద్యమాన్ని బాబా వాగ్లేకర్ ప్రారంభించాడు. తర్వాత ఈ ఉద్యమాన్ని డా. బి.ఆర్. అంబేద్కర్ నడిపించాడు.
- అంబేద్కర్ The Evils of Caste అనే పుస్తకాన్ని రచించాడు.
- అంబేద్కర్ వెనుకబడ్డ తరగతుల వారి అభివృద్ధి కోసం 'బహిష్కృత హిత కారిణి సభ' ఏర్పాటు చేసాడు.
- అంబేద్కర్ ఇండిపెండెంట్ ఇండియన్ లేబర్ పార్టీని ఏర్పాటు చేసి వెనుకబడిన వర్గాల వారి రాజకీయ హక్కుల కోసం పోరాటం చేశాడు.
- మహాత్మగాంధీ వెనుకబడ్డ వర్గాల వారికోసం మొట్టమొదటి సారిగా హరిజన్ (దేవుని బిడ్డలు) అనే పదాన్ని ఉపయోగించాడు.
- గాంధీ 1933లో వెనుకబడ్డ వర్గాల వారి అభివృద్ధి కోసం హరిజన్ సభను ఏర్పాటు చేసాడు.
- గాంధీ హరిజన్ అనే వార్తా పత్రిక ద్వారా భారతదేశంలో ఉన్న అంటరానితనంను దూరం చేయుటకు ప్రయత్నించాడు.
- 1932 పూనా ఒడంబడిక ద్వారా వెనుకబడ్డ వర్గాల వారికి ఎక్కువ నియోజకవర్గాలు కేటాయించబడేటట్లు చేసాడు.
- గాంధీ వెనుకబడ్డ వారి కోసం All india depressed class associationను ఏర్పాటు చేసాడు.

కేరళ

- కేరళలో అగ్రకులాల వారిని సవార్ణాలు అని, నిమ్న కులాల వారిని అవార్ణాలు అని పిలిచేవారు.
- కేరళలో నిమ్నకులాల అభివృద్ధి కోసం పోరాటం చేసిన మొట్ట మొదటి వ్యక్తి శ్రీ నారాయణగురు.
- ఇతను ఎజవా తెగకు చెందినవాడు.
- అగ్రకులాల వారి అధిపత్యంను ఖండిస్తూ 'జాతి మీమాంస వ్యాసం'ను రాశాడు.
- SNDP శ్రీనారాయణగురు ధర్మపరిపాలను యోగంను ఏర్పాటు చేసాడు. దీని ద్వారా కేరళలో వెనుకబడ్డ వారికి అనేక ఆలయాలను నిర్మించాడు.
- ఇతను ఈ విధంగా పేర్కొనేవాడు 'మానవాళికి ఒకే దేవుడు, ఒకే మతం, ఒకే కలం' ఉంటుంది.
- శ్రీనారాయణగురు శిష్యుడు సహధరన్‌అయ్యప్పన్ ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు 'మానవాళికి దేవుడు మతం, కులం' ఉండదు
- శ్రీనారాయణ గురు యొక్క అనుచరులను వియోబద్ధిస్టులు అంటారు.

వైకోమ్ సత్యాగ్రహము

- దీనిని 1924లో కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు T.K కేశవమీనన్, L.K మాధవన్ వైకోమ్‌లోని శ్రీ పార్వతి పరమేశ్వర ఆలయంలో ప్రారంభించారు.
- ఆ ఆలయ ప్రవేశ ఉద్యమానికి భారతదేశమంతటి నుంచి మద్ధతు లభ్యమైనది
- భారతదేశ నలుమూలల నుంచి అనేక జాతాలు వచ్చాయి.
- వీటిలోముఖ్యమైన ఖాతా ''ఆత్మ గౌరవ ఉద్యమ జాతా'' దీనిని పెరియార్
- E.V రామస్వామి నాయకర్ మధురై నుంచి వైకోమ్ వరకు చేపట్టారు.
- E.V రామాస్వామి నాయకర్ తమిళనాడులో లేదా మాద్రాస్ ప్రెసిడెన్సీలో అగ్రకులాల ఆధిపత్యంను ఖండించాడు.
- E.V రామాస్వామి నాయకర్ 'కుడిఅరసు' విదుతులై అనే పత్రికను ప్రారంభించాడు.
- పి. త్యాగరాయ శెట్టి నాయర్, ముదరియార్ జస్టిస్‌పార్టీని స్థాపించారు. (బ్రహ్మణులకు వ్యతిరేకంగా భారతదేశంలో స్థాపించి మొట్టమొదటి రాజకీయ పార్టీ)
- జస్టీస్ పార్టీ SOUTH INDIAN LIBERAL FEDERESTION అనే సంస్థ నుంచి పుట్టింది.
- ఈ సంస్థను స్థాపించినవారు(SILF) త్యాగరాజన్, T.M. నాయర్, ముదలియార్

శ్రీగురునాయూర్ ఉద్యమం

- దీనిని 1931లో కె. కేలప్పన్ (కేరళరాజకీయ ఖడ్గం) శ్రీ గురునాయూర్‌లో శ్రీ కృష్ణుడు దేవాలయంలో ప్రారంభించారు.
- దీనికి మద్ధతుగా వచ్చిన ముఖ్యమైన జాత సుబ్రహ్మణ్య తింబుంబుజాత. దీనిని కాలికట్ నుంచి శ్రీగురునాయూర్ వరకు తింబుంబు చేపట్టాడు.

A.K గోపాలన్

- ఇతను కేరళలో 500ల కంటే ఎక్కువ సమావేశంలో నిమ్నకులాల వారి హక్కులను తెలియజేస్తూ ప్రసంగించాడు. ప్రతి సమావేశంలో ఇతనిపై లాఠీచార్జీ జరిగింది.


ముస్లింలలో సంస్కరణలు


సర్‌సయ్యద్ అహ్మద్‌ఖాన్

- ముస్లింల సంస్కరణలకోసం పోరాటం చేసిన మొదటి వ్యక్తి సర్‌సయ్యద్ అహ్మద్ ఖాన్.
- ముస్లింల అభివృద్ధి బ్రిటిష్‌వారి మద్ధతు అవసరం అని భావించి బ్రిటిష్ మద్ధతుగా ఈ క్రింది వ్యాసాన్ని ప్రచురించాడు.
- 'లాయర్ మహ్మదీయన్స్ ఆఫ్ ఇండియా' (అస్బబ్ ఇ భగావత్ ఇ హింద్) ఇతని వార్తా పత్రిక 'తహరిక్ ఇ అఖ్లక్'
- 1857 తిరుగుబాటుకు సంబంధించి ''దకాజస్ ఆఫ్ ఇండియన్ మ్యూటిని'' అనే పుస్తకాన్ని రచించాడు.
- ఈ పుస్తకంలో 1857 తిరుగుబాటును ''సిపాయిల తిరుగుబాటు' అని పేర్కొన్నాడు.
- ముస్లింల అభివృద్ధికి విద్య ముఖ్యమని 1875లోఆలీఘడ్‌లో మహ్మదీయన్ ఆంగ్లో ఓరియంటల్ పాఠశాలను ఏర్పాటు చేశారు.
- 1877లో ఇది కళాశాలగా మారింది.
- 1916 తర్వాత ఇది ఆలీఘడ్ విశ్వవిద్యాలయంగా మారింది.
- అలీఘర్‌లో ఇతను ప్రారంభించిన ఈ పాఠశాల విద్య అలీఘర్ ఉద్యమం అని పేర్కొంటారు.

సూపర్ ఎర్త్‌లో ప్రాణికోటి?

లండన్ : గ్రహాంతరంలో ఇటీవల కనుగొన్న నూతన మహా భూగోళంలో ప్రాణికోటి ఉందని విశ్లేషిస్తున్నారు. భూమికి అతి దగ్గరలో ఉండే రెండవ సౌర వ్యవస్థ ఎరుపు పొట్టి గ్రహం బర్నార్డ్ చుట్టూ ఈ సూపర్ ఎర్త్ పరిభ్రమిస్తున్నట్లు ఖగోళ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. దీని ఆవిష్కరణనే ఓ అద్భుతం అయితే ఈ గ్రహాంతరం బర్నార్డ్ బి లేదా జిజె 699 బి అత్యంత శీతల స్థితితో ఉందని, ఇక్కడ ప్రాథమిక ప్రాణి మనుగడకు అన్ని విధాలుగా అవకాశం ఉందని వెల్లడైంది. జలం గడ్డకట్టే ప్రాంతంలో ఈ సూపర్ ఎర్త్ బర్నార్డ్ చుట్టూ 233 రోజుల పాటు తిరుగుతుంది. ఇక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ 170 డిగ్రీ సెంటీగ్రేడ్‌లుగా ఉంటాయని విశ్లేషించారు. అయితే ఇక్కడ జీవ కోటి ఆనవాళ్లు ఉన్నాయని, అంతేకాకుండా భారీ స్థాయిలో వేడి ఇనుము నిక్షేపాలు, అంతకు మంచిన స్థాయిలో భౌగోళిక ధార్మిక స్థితి ఉందని వెల్లడైనటు అమెరికాకు చెందిన విల్లానోవా వర్శిటీ పరిశోధకులు తెలిపారు. ప్రత్యేకించి జియోథర్మల్ పరిణామంతో ఈ మరో భూగోళంలో ప్రాణి ఉనికికి అవకాశాలు ఉన్నాయని , అక్కడి భౌగోళిక స్థితి దాదాపుగా అంటార్కిటికా ఉపరితలంతో పోలి ఉన్నాయని వర్శిటీ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ఎడ్వర్డు గియినన్ తెలిపారు. అతి త్వరలోనే ఇక్కడి వాతావరణం, ఉపరితల పరిస్థితులపై టెలీస్కోప్‌ల ద్వారా మరింత విస్తృత స్థాయిలో పరిశోధనలకు వీలేర్పడుతుందని ఎడ్వర్డు చెప్పారు. సూర్యునికి అతి దగ్గరిలోని రెండు సౌర వ్యవస్థల గురించి నిజానికి ఇప్పటివరకూ ఇతర గ్రహాలకు తెలియదని , ఖగోళంల కోటానుకోట్ల పాలపుంతలు , ఇప్పటివరకూ వెలుగులోకి రాకుండా ఉన్న గ్రహాలు ఉన్నాయని ఇంతకు ముందటి కెప్లెర్ అన్వేషణ గణాంకాలకు ఇది ఊతంగా మారిందని విశ్లేషించారు






ప్రాచీన జనాభాను కనుగొనే డిఎన్‌ఏ పరికరం

లండన్ : ప్రాచీన జనాభాను కచ్చితంగా అంచనా వేయగల డిఎన్‌ఏ పరికరాన్ని శాస్త్రవేత్తలు సృష్టించారు. వ్యక్తిగతంగా ఎవరి పోలికనైనా ప్రాచీన కాల జనాభాతో పోల్చి చూడగల సత్తా ఈ పరికరానికి ఉంది. ప్రస్తుతం పురాతన డిఎన్‌ఏను అధ్యయనం చేయడానికి అస్థిపంజరాన్ని బట్టి జనాభా ను వర్గీకరించడానికి చాలా సమాచారం కావలసి ఉంది. దీన్ని బట్టి ఆయా వర్గాల పుట్టు పూర్వాలు తెలుస్తాయి. బ్రిటన్ లోని యూనివర్శిటీ ఆఫ్ షెఫీల్డు కొత్త నిర్వచనాన్ని తెరపైకి తెచ్చారు. ఏన్షియంట్ ఏన్సెస్ట్రీ ఇన్‌ఫర్మేటివ్ మార్కర్స్ (ఎఎఐఎంఎస్) అని దీనికి పేరు పెట్టారు. ప్రాచీన జనాభాను వర్గీకరించడానికి అనేక మార్పుల సముదా యం అం దించే సమాచారం సరిపోతుంది. ఎఎఐఎంఎస్ తాలూకు చిన్న గ్రూపు ప్రాచీన జనం తాలూకు అస్థిపంజరాలను వర్గీకరించడానికి ఉపయోగపడుతుంది. సైన్సులో ఏన్సెస్టరీ ఇన్‌ఫర్మేటివ్ మార్కర్స్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆరోగ్య, ఫోరెన్సిక్ రంగాల్లో గత దశాబ్దకాలంగా వినియోగమవుతోంది. ఆధునిక మానవ సంతతి కన్నా పురాతన మానవ సంతతికి ఎక్కువ జీవవైవిధ్యం ఉంది. రానురాను కొన్ని తరాలు గడిచి నియోలిథిక్ పరిణామం వంటివి సంభవించి ఆ జీవవైవిధ్యం క్షీణించిందని పరిశోధకులు వెల్లడించారు.ఈరోజు చాలా మంది ఒకే పోలికలు కలిగిన వారెందరో ఉన్నారు. పురాతన డేటా చాలా సమస్యాత్మకంగా ఉంటోంది. డిఎన్‌ఏ పెద్ద మొత్తంలో డిగ్రేడ్ కావడమే దీనికి కారణం. ఈ సవాళ్లను అధిగమించడానికి సంప్రదాయ పద్ధతులతోపాటు ఆ ధునిక సాంకేతిక పద్ధతులను మేళవించి ఈ డిఎన్‌ఏ పరికరాన్ని రూపొందించినట్టు శాస్త్రవేత్తలు చెప్పారు.

– సైన్స్ విభాగం

పర్యావరణానికి ముప్పు తెస్తున్న డీశాలినేషన్ ప్లాంట్లు



ఉప్పునీటిని మంచినీరుగా మార్చ గలిగే డీశాలినేషన్ ప్లాంట్‌ల వల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతోందని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. ప్రపంచం మొత్తం మీద 1600 డిశాలినేషన్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ ప్లాంట్ల నుంచి పెద్దమొత్తంలో ఉప్పు నీటి వ్యర్థ జలాలు, విషపూరిత రసాయనాలు వెలువడుతున్నాయి. వాటివల్లనే పర్యావరణానికి భారీ నష్టం జరుగుతోంది. డీశాలినేషన్ ప్లాంట్లు ప్రతి రోజూ 95 మిలియన్ ఘనపు మీటర్ల తాజా మంచి నీటిని ఉత్పత్తి చేయడానికి 142 మిలియన్ ఘనపు మీటర్ల ఉప్పు ద్రావణాన్ని పంప్ చేస్తుంటాయి. ఇది వరకటి అంచనాకు ఇది 50 శాతం ఎక్కువ. సౌదీ అరేబియాలో సముద్ర జలాలను డీ శాలినేషన్ చేసేటప్పుడు 55 శాతం కన్నా ఎక్కువగా ఉప్పునీటి ద్రావణం ఉత్పత్తి అవుతోంది. హైపర్ సాల్టీ వాటర్ అంటే ఉప్పుసాంద్రత ఎక్కువగా ఉన్న జలాలు ఎక్కువగా సముద్రం లోకి పంప్ చేయడమవుతుంది. ఆ మొత్తం అమెరికా లోని ఫ్లోరిడా రాష్ట్రానికి ఒక అడుగు వంతున సరఫరా చేయడానికి సరిపోతుంది. 5 శాతం ఉప్పు కలిగిన నీటిని బ్రైన్ ద్రావణం అని పిలుస్తారు. అయితే ఇందులో క్లోరిన్, కాపర్ వంటి రసాయనాలను డిశాలినేషన్ కోసం వినియోగిస్తుంటారు. దీనికి విరుద్ధంగా సముద్ర జలాల్లో 3.5 శాతం ఉప్పు ఉంటుంది. వ్యర్థ రసాయనాలు పర్యావరణంలో పేరుకుపోయి మత్స్య సంపదకు అపాన నష్టం కలిగిస్తున్నాయి. ఈ ప్లాంట్ల సమీపాన ఆక్సిజనును బ్రైన్ కోతకోస్తోంది.

– సైన్స్ విభాగం



జల్లికట్టులో 49 మందికి గాయాలు

మదురై: తమిళనాడులోని మధురైలో సంప్రదాయ జల్లికట్టు ఉత్సవంలో మొదటి రోజున 49 మంది గాయపడ్డారు. మంగళవారం 500 ఎద్దులను అదుపు చేయడానికి అంతే సంఖ్యలో పోటీదారులు పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ నటరాజన్ మీడియాకు తెలిపారు. స్వల్పంగా గాయపడ్డ తొమ్మిది మందిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించామన్నారు. ఎద్దులకు రెట్టింపు సంఖ్యలో పాల్గొంటున్నారని పాల్గొంటున్నారని నటరాజన్ తెలిపారు. జల్లికట్టు నిర్వహించడంపై పలువురు జంతు ఉద్యమ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలువురిని ఎద్దులు పొడిచి చంపిన ఘటనలు చోటు చేసుకున్నాయి. 2016లో జల్లికట్టును సుప్రీం కోర్టు నిషేధించింది. ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో ప్రధాని నరేంద్ర మోడీ ఈ ఉత్సవం కొనసాగించేందుకు అనుమతించారు.

యుపిలో బిజెపికి 74 ఎంపి సీట్లు: నడ్డా



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో బిజెపి 74 లోక్‌సభ స్థానాలను గెల్చుకుని తీరుతుందని కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. బిజెపినే అత్యధికంగా స్థానాలు గెల్చుకుని తీరుతుందని,ఎస్‌పి – బిఎస్‌పి కూటమి ప్రభావం ఏమీ ఉండదని ఆయన తేల్చిచెప్పారు. పార్టీ సీనియర్ కార్యవర్గ సభ్యులతో సమావేశంలో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి బుధవారం ఇక్కడికి వచ్చారు. ఈ నేపథ్యంలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ఎన్నికల పర్యవేక్షకులుగా ఇటీవలే కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డాను నియమించారు. తాము అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని తమ పార్టీ ఖచ్చితంగా అత్యధిక స్థానాలను దక్కించుకుంటుందని చెపుతున్నానని మంత్రి వివరించారు. ఈసారి తమ పార్టీ పరిస్థితి బాగా మెరుగుపడుతుందని, రికార్డులు బద్ధలు అవుతాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికలలో బిజెపికి 71 స్థానాలు వచ్చాయి. మరో రెండు మిత్రపక్షాల ఖాతాలోకి వెళ్లాయి. ఇంతకు ముందటి రికార్డును అధిగమిస్తామని నడ్డా విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సారి ఎన్నికలకు బిజెపి వ్యూహం ఏమిటనే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇవ్వలేదు. వ్యూహాలను ముందుగా వెల్లడించడం కుదరదని, రక్షక్షేత్రంలోనే వీటిని అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

టైట్లర్‌ను చూపి భయపెడుతున్న కాంగ్రెస్ : సిర్సా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఢిల్లీశాఖ అధ్యక్షురాలిగా షీలాదీక్షిత్ బుధవారం బాధ్యతలు చేపట్టినప్పుడు నిర్వహించిన కార్యక్రమంలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లలో నిందితుడైన జగదీష్ టైట్లర్‌ను ముందు వరసలో కూచోబెట్టారని శిరోమణి అకాలీదళ్ (ఎస్ఎడి) నాయకుడు మంజీందర్ సింగ్ సిర్సా ఆరోపించారు. ఆనాటి అల్లర్ల కేసులకు సంబంధించి సాక్షులను భయపెట్టేందుకు కావాలనే ఇలా చేశారని ఆయన విమర్శించారు. సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసుల్లో టైట్లర్, కమల్‌నాథ్ జైలుకు వెళతారని తెలిసిన కాంగ్రెస్ భయపడుతోందని సిర్సా పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం టైట్లర్‌కు మద్దతిస్తోందని, ఎవరూ కూడా అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి ప్రయత్నించకూడదని ఈ చర్య సూచిస్తోందని మంజీందర్ సింగ్ వ్యాఖ్యానించారు. 'సజ్జన్‌కుమార్ నేరస్థుడని నిర్ధారణ కావడంతో ...ఇంత వరకూ తను కాపాడుతూ వచ్చిన నాయకులు జైలుపాలు కావచ్చని కాంగ్రెస్ భయపడుతోంది. తమ నాయకులకు వ్యతిరేకంగా ఎవరూ చర్య తీసుకోకూడదని ఇలాంటి చర్యల ద్వారా కాంగ్రెస్ న్యాయవ్యవస్థకు, పోలీసులకు సంకేతాలు పంపుతోంది' అని ఆయన ఆరోపించారు.

రాజకీయ ప్రయోజనం చూడొద్దు

కన్హయ కేసులో బిజెపికి శివసేన విజ్ఞప్తి



ముంబయి: జమ్ము– కశ్మీర్‌లో పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ (పిడిపి)తో కుమ్మక్కై దేశద్రోహం నేరారోపణ ఉన్న విద్యార్థి నాయకుడు కన్హయ కుమార్‌ను విమర్శించే నైతిక హక్కు భారతీయ జనతాపార్టీకి లేదని శివసేన బుధవారం పేర్కొంది. కుమార్‌పై ఉన్న దేశద్రోహం కేసు ద్వారా రాజకీయ ప్రయోజనం పొందే ప్రయత్నాన్ని అధికారంలో ఉన్న బిజెపి మానుకోవాలని శివసేన సూచించింది. పార్లమెంట్‌పై దాడి చేసిన అఫ్జల్ గురును అమరవీరుడని కొనియాడిన పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీతో జతకట్టి బిజెపి పాపం చేసిందని సేన ఘాటుగా విమర్శించింది. అలాంటి బిజెపికి కన్హయ కుమార్‌ను విమర్శించే నైతిక హక్కు ఎక్కడుందని శివసేన ప్రశ్నించింది. పిడిపి సారథ్యంలోని జమ్ము– కశ్మీర్ ప్రభుత్వంలో బిజెపి కొంతకాలం భాగస్వామిగా ఉంది. అయితే గత ఏడాది సంకీర్ణం నుంచి వైదొలిగింది. 2016 ఫిబ్రవరిలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో కన్హయ ఒక ఉద్యమానికి నాయకత్వం వహించి, దేశద్రోహ నినాదాలు చేశాడని పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు అతను, మరి కొందరిపై సోమవారం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు.

కెన్యా ఉగ్రదాడిలో 15 మంది మృతి

నైరోబి: కెన్యా రాజధారి నైరోబిలో ఉగ్రవాదులు జరిగిన ఆత్మాహుతి దాడిలో 15 మంది మృతి చెందారు. ఘటన జరిగిన 24 గంటల తర్వాత బుధవారం తాజాగా మరోసారి పేలుడు సంభవించింది. వెస్ట్‌లాండ్స్ ప్రాంతంలో డసిట్ డి2 కాంప్లెక్స్‌లో మంగళవారం మధ్యాహ్నం ఉగ్రవాదుల జరిపిన ఆత్మాహుతి దాడిలో 15 మంది మృతి చెందినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. పేలుళ్ల శబ్దంతో ఉద్యోగులు భయంతో బయటకు పరుగులు తీయగా, ఉగ్రవాదులు సహా మరి కొందరు కాంప్లెక్స్ లోపల చిక్కుకు పోయారు. విదేశీ బలగాలతోపాటు కెన్యా భద్రతా బలగాలు ఘటనా స్థలానికి చేరుకొని ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టాయి. కాంప్లెక్స్‌లో చిక్కుకు పోయిన పలువురు ఉద్యోగులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. పార్కింగ్‌లో ఉన్న మూడు కార్లను లక్ష్యంగా చేసుకుని పేలుళ్లకు పాల్పడగా, మరొకరు కాంప్లెక్స్ లోపల ఆత్మాహుతికి పాల్పడినట్లు కెన్యా పోలీస్ చీఫ్ జోసెఫ్ బయోనెట్ తెలిపారు. ఈ ఘటనకు తామే బాధ్యులమని ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ అల్–శబాబ్ ప్రకటించింది. నల్లటి వస్త్రాలతో సాయుధులైన నలుగురు ఉగ్రవాదుల కాంప్లెక్స్‌లోకి ప్రవేశించిన సిసిటివి దృశ్యాలను స్థానిక మీడియా ప్రసారం చేసింది. ఘటన జరిగిన 24 గంటల తర్వాత తాజాగా మరోసారి పేలుడు సంభవించింది. కాంప్లెక్స్ లోపల పేలుడు పదార్థాలు ఉండొచ్చనే అనుమానంతో బలగాలు తనిఖీలు చేపట్టాయి. ఉగ్రవాదులందరినీ అంతం చేసినట్లు కెన్యా అధ్యక్షుడు తెలిపారు.



ఈ గొడవంతా బిజెపి సృష్టే

మా ప్రభుత్వం స్థిరంగా ఉంది • మా ఎంఎల్‌ఎలు ఎవరూ రాజీనామా చేయడం లేదు: కర్ణాటక సిఎం కుమారస్వామి

న్యూఢిల్లీ: కర్నాటకలో తమ ప్రభుత్వాన్ని అస్థిరపర్చిందుకు బిజెపి న్యూసెన్స్ సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి ఆరోపించారు. అయితే ప్రస్తుత సంక్షోభం అతి త్వరలోనే సమసిపోతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తాను ప్రధాని నరేంద్ర మోడీని కలవబోతున్నట్లు, రాష్ట్ర మంత్రివర్గంనుంచి నలుగురు కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేయనున్నట్లు వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. కాంగ్రెస్, జెడి (ఎస్) మధ్య సంబంధాలు బలంగా ఉన్నాయని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని ఆయన మరోసారి నొక్కి చెప్పారు. మంగళవారం ఇద్దరు ఇండిపెండెంటట్ ఎంఎల్‌ఎలు సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడం రాష్ట్రంలో చెలరేగిన రాజకీయ యుద్ధాన్ని కొత్త మలుపు తిప్పాయి. దీంతో అధికార, ప్రతిపక్ష బిజెపిలు రెండూ కూడా తమఎమ్మెల్యేలను ప్రత్యర్థులు తమ వైపునకు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించుకుంటున్న విషయం తెలిసిందే.' ప్రధాని మోడీని కలిసే ఆలోచనలేదు, కాంగ్రెస్ మంత్రులెవరూ రాజీనామా చేయడం లేదు. కాంగ్రెస్ లేదా జెడి(ఎస్)నుంచి ఎంఎల్‌ఎలెవరూ రాజీనామా చేసికి బిజెపి వైపు వెళ్లడం లేదు,అలాంటిదేదీ జరగబోదు. బిజెపినే ఈ గందరగోళం సృష్టిస్తోంది' అని కుమారస్వామి పిటిఐతో అన్నారు. కాంగ్రెస్–జెడి(ఎస్) సంకీర్ణ ప్రభుత్వం సుస్థిరంగా ఉం దని ఆయన స్పష్టం చేస్తూ, తమ పార్టీకి చేందిన ఎంఎల్‌ఎలు ఎవరు కూడా బిజెపి ఇవ్వజూపిన ప్రలోభాలకు లొంగరని కూడా చెప్పారు. అంతేకాదు, ప్రస్తుత సంక్షో భం ఒకటి రెండు రోజుల్లో సమసి పోతుందని కూడా ఆయన చెప్పారు.' నా ప్రభుత్వం స్థిరంగా ఉంది, కాం గ్రెస్–జెడి(ఎస్) కలిసే ఉన్నాయి. పార్లమెంటు ఎన్నికల్లో కూడా మేము కలిసే ఉంటాం' అని ఆయన స్పష్టం చేశారు. కర్నాటకలో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బిజెపి కుట్రపన్నుతోందని ఆయన ఆరోపిస్తూ, రాష్ట్రంలోని 165 తాలూకాలు తీవ్ర కరవుతో అల్లాడుతూ ఉన్న సమయంతో బిజెపి తమ 104 మంది ఎంఎల్‌ఎలను హర్యానాలోని గుర్గావ్ రిసార్ట్‌లో ఎందుకు ఉంచాల్సి వచ్చిందని ప్రశ్నించారు. 'తిరిగి అధికారంలోకి రావడానికి బిజెపి ఎంత తహతహలాడుతూ ఉందో ఈ దేశ ప్రజలకు తెలిసివచ్చింది. ప్రజల ముందు వాళ్లు ఫూల్స్‌గా మారారు. మా జెడి(ఎస్) ఎంఎల్‌ఎలు కొందరికి భారీ మొత్తాలు ఆఫర్ చేయడం ద్వారా వారు ప్రజాస్వామ్యా న్ని అపహాస్యం చేశారు'అని కుమారస్వామి దుయ్యబట్టారు. అంతే కాదు మీడియాలో తప్పుడు సమాచారం ప్రచారం చేయడం ద్వారా బిజెపి ప్రజలను తప్పుదోవపట్టిస్తోందని కూడా ఆయన ఆరోపించారు. కాగా, కర్నాటకలో కాంగ్రెస్–జెడి(ఎస్)



సంకీర్ణ ప్రభుత్వం బలంగా, సుస్థిరంగా ఉందని లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే అంటూ, రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చడానికి బిజెపి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కర్నాటకలో కాంగ్రెస్–జెడి(ఎస్) సంకీర్ణ ప్రభుత్వం సుస్థింగా ఉం దని, భవిష్యత్తులో కూడా అలాగే ఉంటుందని ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఖర్గే స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో కుమ్ములాటలు లేవు

కాగా కాంగ్రెస్‌లో ఎలాంటి అంతర్గత కుమ్ములాటలు లేవని, ముంబయిలో ఉన్న పార్టీ ఎంఎల్‌ఎలతో తాను ఎప్పటికప్పుడు మాట్లాడుతూనే ఉన్నానని, కర్నాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కెసి వేణుగోపాల్ స్పష్టం చేశారు. అంతేకాదు గురువారం నాటికల్లా ఒక స్పష్టత వస్తుందని కూడా ఆయన చెప్పారు. 'ఒక్క ఎంఎల్‌ఎ కూడా కాంగ్రెస్‌ను వీడడం లేదు. ముంబయిలో ఉన్న కాంగ్రెస్ ఎంఎల్‌ఎలతో నేను మాట్లాడాను. అందుకే ఇంత నమ్మకంగా చెబుతున్నాను. గురువారం సాయంత్రానికల్లా కర్నాటకపై ఒక స్పష్టత వస్తుంది' అని వేణుగోపాల్ బుధవారం బెంగళూరులో విలేఖరులతో మాట్లాడుతూ చెప్పారు. కుమారస్వామి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చడానికి అసంతృప్త ఎంఎల్‌ఎ రమేశ్ జార్కిహోళి నేతృత్వంలో కొంతమంది ఎంఎల్‌ఏలు బిజెపితో చేతులు కలపబోతున్నట్లు వచ్చిన వార్తలపై అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా వేణుగోపాల్ ఈ విషయం చెప్పారు. జార్కిహోళిని గత నెల రాష్ట్ర మంత్రివర్గం నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఈ నెల 18న సమావేశమై తాజా పరిస్థితులను సమీక్షించనుంది.

మెడికోల ఇంటర్న్‌షిప్ ధ్రువీకరణకు త్రిసభ్య కమిటీ

డిఎంఈ డాక్టర్ రమేష్ రెడ్డి

మన తెలంగాణ/ హైదరాబాద్ : వైద్య విద్యార్థుల ఏడాది ఇంటర్న్‌షిప్ ధృవీకరించేందుకు అన్ని వైద్య కళాశాలల్లో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేస్తూ తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యా శాఖ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. తక్షణం ఇవి అమలులోకి వస్తాయని ఆ శాఖ డైరెక్టరు డాక్టరు కె. రమేష్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. విధులకు హాజరుకాకుండానే సర్టిఫికెట్లు తీసుకొంటున్నారనే ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తోంది. ఎంబిబిఎస్ పూర్తయిన తర్వాత ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఏడాది పాటు ప్రభుత్వ బోధనాసుపత్రిలో విధులు నిర్వహించాలి. అది పూర్తయితేనే రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ చేస్తుంది. విద్యార్థుల హాజరు ఆధారంగా ఆసుపత్రి సూపరింటెండెంటు ఇంటర్న్‌షిప్ ధృవీకరించాల్సి ఉంటుంది. నాలుగున్నరేళ్ల విద్య తర్వాత ఇంటర్న్‌షిప్ ప్రాక్టికల్స్‌లా పనిచేస్తుందని ప్రభుత్వం ఈ నిబంధన విధించింది. అయితే కొందరు విద్యార్థులు అడ్డదారుల్లో అటెండెన్స్ సర్టిఫికెట్లు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. దీన్ని అడ్డుకొనేందుకు రెండేళ్ళ క్రితం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కూడా అమల్లోకి తెచ్చారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చినప్పుడు, వెళ్ళేటపుడు విధిగా బయోమెట్రిక్ హాజరు వేయాలి. ఆసుపత్రిలో హాజరు నమోదు తోపాటు ఆ సమాచారం విద్యార్థుల తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్ ద్వారా అందేలా ఏర్పాట్లుచేశారు. ఈ అటెండెన్స్‌ను జతచేస్తూ సూపరింటెండెంటు, సంబంధిత యూనిట్ అధిపతి ఇచ్చే ధృవీకరణ ఆధారంగా ఎంబిబిఎస్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ చేసేలా నిబంధనలను కఠినతరం చేశారు. అయితే కొద్ది కాలం ఇది సక్రమంగానే సాగినా తర్వాత యథావిధిగా గాడితప్పినట్టు ఆరోపణలు వెలువడ్డాయి. విధులకు హాజరు కాకుండా అటెండెన్స్ సర్టిఫికెట్లు పొందుతున్నారని, దీనికి పెద్ద ఎత్తున డబ్బుచేతులు మారుతున్నదని ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళింది. ఇటీవల డైరెక్టరు డాక్టరు కె. రమేష్ రెడ్డి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు ఈ విషయాలు బయటపడ్డాయి. దీంతో అటెండెన్స్ నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తోంది. గాంధీతో పాటు, ఉస్మానియా ఆసుపత్రి, నిజామాబాద్, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్ రిమ్స్‌కు కొత్త నిబంధనలను జారీచేశారు. ఆయా కళాశాలల్లో పనిచేసే ముగ్గురు సీనియర్ ప్రొఫెసర్లతో కమిటీలను ఏర్పాటు చేసారు. వీరు పరిశీలించి ధృవీకరించిన అనంతరం సూపరింటెండెంట్లు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు జారీచేయాలన్నది ఆయన ఆదేశాల సారాంశంగా తెలుస్తోంది. నిబంధనలను అతిక్రమిస్తే కమిటీ సభ్యులపై చర్యలుంటాయని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పొడిగించాల్సి ఉంటుందని ఆయన ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచే పదిశాతం ఇబిసి కోటా

40 వేల కాలేజీలకు వర్తింపు • అదనపు సీట్ల సంఖ్యపై సస్పెన్స్

న్యూఢిల్లీ : వచ్చే విద్యాసంవత్సరం నుంచే విద్యాసంస్థలలో పది శాతం ఇబిసి కోటా అమలు జరుగుతుందని కేంద్ర మానవ వనరుల మంత్రి ప్రకాశ్ జవదేకర్ చెప్పారు. అగ్రవర్ణాలకు చెందిన పేదలకు ప్రభుత్వోద్యోగాలు, విద్యాసంస్థలలో పదిశాతం రిజర్వేషన్ల కోటా బిల్లు ఆమోదం , రాష్ట్రపతి సంతకం, తద్వారా చట్టంగా రూపొందడం తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఏడాది ప్రారంభం అయ్యే నూతన విద్యాసంవత్సరంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో ఈ కోటా అమలు ప్రక్రియ చేపడుతారని జవదేకర్ తెలిపారు. అన్ని రకాల ఉన్నత విద్యాసంస్థలకు ఈ కోటా వర్తింపు ఉంటుందని చెప్పారు. అయితే ఈ క్రమంలో ఎస్‌సి, ఎస్‌టిలు, ఒబిసిలకు ఇప్పటివరకూ ఉన్న కోటాపై ఎటువంటి ప్రభావం పడదని, అది యథాతథంగా ఉంటుందని మంత్రి వివరించారు. తాజా ఇబిసి కోటాను దేశవ్యాప్తంగా ఉన్న 40,000 కాలేజీలు, దాదాపు 900 విశ్వవిద్యాలయాలలో వర్తింపచేస్తారని చెప్పారు. 2019 విద్యాసంవత్సరం నుంచే తాజా పదిశాతం రిజర్వేషన్ల కోటా అమలు అవుతుందని , జనరల్ కేటగిరిలోని పేద వర్గాలకు దీనిని వర్తింపచేయడం వల్ల ఉన్నత విద్యాసంస్థలు, వివిధ విశ్వవిద్యాలయాలలో దాదాపు పాతిక శాతం సీట్లను పెంచడం జరుగుతుందని మానవ వనరుల మంత్రిత్వశాఖ తరఫున ప్రకటన వెలువడింది. తాము మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులతో , యుజిసి అధికారులతో , అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) వారితో తగు విధంగా సంప్రదింపులు జరిపినట్లు, తదనుగుణంగానే కోటాకు అనుగుణంగా సీట్ల భర్తీ చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. తమ నిర్ణయం మేరకు 2019– 2020 విద్యాసంవత్సరంలో రిజర్వేషన్ల అమలు జరుగుతుంది. దాదాపు పాతిక శాతం సీట్లను అదనంగా కల్పించడం జరుగుతుంది. అనేక విద్యాసంస్థలలో ఈ కోటా అమలు సక్రమంగా అమలు జరుగుతుందని వివరించారు. అయితే ఖచ్చితంగా ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా సృష్టించే సీట్ల సంఖ్యను మంత్రి వెల్లడించలేదు. ఓ వారం రోజులలోనే అన్ని అంశాలపై మార్గదర్శక సూత్రాలను ఖరారు చేయడం జరుగుతుంది. అప్పటికానీ ఎన్ని సీట్లు అదనంగా వస్తాయనేది వెల్లడి కాదని మంత్రి స్పష్టం చేశారు.త్వరలోనే కోటా అమలు ప్రక్రియ కార్యాచరణ నిబంధనావళిని జారీ చేయడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో వివిధ వర్శిటీలు అనుబంధ విద్యాసంస్థలు రాబోయే విద్యాసంవత్సరం కోసం ఇప్పుడు ముద్రించే విద్యావకాశాల పుస్తకంలో స్పష్టంగా ఈ కోటా వివరాలను, దానితో పాటు అందుకు అనుగుణంగా చేపట్టే వ్యవస్థాగత ఏర్పాట్లను ప్రస్తావించాల్సి ఉంటుందని మంత్రి సూచించారు.

సిఎల్‌పి నేత ఎంపికపై ఉత్కంఠ

- రేసులో ఉత్తమ్, భట్టి విక్రమార్క, రాజ్‌గోపాల్‌రెడ్డి, శ్రీధర్‌బాబు
- నేడు ఉదయం 9 గంటలకు పార్టీ శాసనసభ్యుల సమావేశం
- హైదరాబాద్‌కు చేరుకున్న ఏఐసిసి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ సిఎల్‌పి నేత ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ పదవి కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర స్థాయిలో పోటీపడుతున్నారు. రేసులో టిపిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాటు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్‌గా కొనసాగిన మల్లు భట్టివిక్రమార్క, మాజీ మంత్రి డి. శ్రీధర్‌బాబు, నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి తదితరులు ప్రధానంగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. దీంతో సిఎల్‌పి పదవికి ఎవరిని ఎంపిక చేయాలన్న అంశం ఏఐసిసికి కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలో పార్టీ శాసనసభ్యుల అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు అందరికి ఆమోదయోగ్యమైన నేతను ఎంపిక చేసేందుకు పార్టీ అధిష్ఠానం ఏఐసిసి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌ను ప్రత్యేకంగా బుధవారం రాత్రి హైదరాబాద్‌కు పంపించింది. నగరానికి చేరుకున్న ఆయన రాత్రి తొమ్మిది గంటల సమయంలో మెహదీపట్నంలోని గోల్కొండ హోటల్‌లో టిపిసిసి కోర్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎల్‌పి నేతగా ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం సిఎల్‌పి పదవి కోసం నేతల్లో తీవ్ర స్థాయిలో పోటీ నెలకొన్న నేపథ్యంలో అన్ని కోణాల్లో ఆలోచించిన మీదటనే నిర్ణయం తీసుకోవాలని ఏఐసిసి ప్రధాన కార్యదర్శికి టిపిసిసి కోర్ కమిటీ సభ్యులు సూచించినట్లుగా సమాచారం. రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఒకే తాటికిపైకి తీసుకురావడం, అసెంబ్లీలో టిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే సమర్థత, కార్యదక్షత గల నేతను ఎంపిక చేయాలని మూకుమ్మడిగా కోరారని తెలిసింది. అయితే ప్రస్తుతం టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికే ఆ పదవిని అప్పగిస్తే ఎలా ఉంటుందన్న అంశంపై కూడా చర్చకు వచ్చినట్లుగా తెలుస్తోంది. అయితే పిసిసి అధ్యక్షుడి హోదాలో ఉన్న ఆయనకు పార్టీ అధిష్ఠానం మరో పదవి ఇస్తుందా? అన్నది కూడా అనుమానంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన సిద్ధంగా ఉంటే పిసిసి అధ్యక్ష పదవిని మరో నాయకుడికి అప్పగించి సిఎల్‌పి నేతగా ఉత్తమ్‌ను ఎంపిక చేస్తే ఎలా ఉంటుందన్న అంశంపై కూడా చర్చించినట్లు పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. అదే సమయంలో భట్టి విక్రమార్క పార్టీకి అందిస్తున్న సేవలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని టిపిసిసి కోర్‌కమిటీ సమావేశంలో నేతలు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. అయితే గురువారం ఉదయం తొమ్మిది గంటలకు జరిగే కాంగ్రెస్ శాసనసభ్యుల సమావేశంలో వారి అభిప్రాయలు, సలహాలు, సూచనలకు పరిగణనలోకి తీసుకుని సిఎల్‌పి నేతను ఎంపిక చేస్తారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ కుంతియా, ఏఐసిసి కార్యదర్శులు బోసురాజు, సలీం, శ్రీనివాస్, పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల సమక్షంలో సిఎల్‌పి నేతను ఖరారు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ పదవి ఎవరిని వరిస్తుందన్న ఉత్కంఠకు మరి కొద్దిగంటల్లో తెరపడే అవకాశం ఉంది.



వేణుగోపాల్‌కు ఘనస్వాగతం

బుధవారం రాత్రి ఏడు గంటల సమయంలో నగరానికి చేరుకున్న వేణుగోపాల్‌కు విమానశ్రయంలో పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. వారిలో పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసిసి కార్యదర్శులు బోసురాజు, సలీం, శ్రీనివాస కృష్ణన్, పార్టీ రాష్ట్ర కోశాధికారి గూడురు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

ఒక్క రోజులోనే ఐటి రిటర్న్?

- వినూత్న ప్రాజెక్టు రూపకల్పనకు ఇన్ఫోసిస్‌కు బాధ్యత
- ప్రాజెక్టు కోసం రూ. 4291 కోట్లు కేటాయింపు
- కేంద్ర కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ : ఆదాయపన్ను (ఐటి రిటర్న్స్) దాఖలుకు కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టబోతోంది. ఈ ప్రాజెక్టుకోసం కేంద్ర మంత్రి వర్గం రూ. 4241కోట్లు కేటాయిస్తూ బుధవారంనాడు ఆమోదం తెలిపింది. దీని కోసం ప్రముఖ ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్‌ను ఎంపిక చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం కేంద్ర మంత్రివర్గం జరిపిన భేటీలో దీనితో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలు చేపట్టినట్లు కేంద్ర మంత్రి పియూష్ గోయల్ విలేకరులకు తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే ఐటిఆర్‌ల ప్రక్రియ గడువు ఒక్క రోజునే పూర్తవుతుంది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియకు సమయం 63రోజులుగా ఉండేది. ఈ ప్రాజెక్టు 18మాసాల కాలంలో పూర్తయ్యే అవకాశాలున్నాయని గోయల్ వివరించారు. బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఐటి సంస్థ ఇన్ఫోసిస్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆదాయపు పన్ను శాఖకు సంబంధిత సమీకృత ఇ –ఫైలింగ్, అండ్ సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్ 2.0 ప్రాజెక్టు కోసం కేటాయింపుల మొత్తంగా రూ 4,241.97 కోట్లను ఖరారు చేశారని మంత్రి దీనిని వివరించారు. ఇప్పటివరకూ ఉన్న విధానాలలో ఆదాయపు పన్ను లెక్కింపులకు కనీసం రెండు నెలలకు పైగా సమయం పడుతోంది. దీనిని వినూత్న ఐటి ప్రక్రియతో కేవలం ఒక్కరోజులోనే పూర్తి చేయవచ్చునని , ఇందుకు అనుగుణంగానే ఈ సంవిధానం అమలుకు రంగం సిద్ధం అయిందని వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తొలుత మూడు నెలల పాటు దీనిని ప్రయోగాత్మకంగా వినియోగంలోకి తెస్తారు. రాబోయే విధానం మరింతగా పన్నుల చెల్లింపులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇక సిపిసి –ఐటిఆర్ 1.0 ప్రాజెక్టు పటిష్టతకు రూ 1482.44 కోట్ల వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ రూ 1.83 లక్షల కోట్ల మేర టాక్స్ రిఫండ్స్ జరిగినట్లు తెలిపారు.

సెంట్రల్ వర్శిటీలకు రూ 3600కోట్లు

దేశంలో 13 కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు రూ 3600 కోట్లకు పైగా సవరిత వ్యయ ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించింది. వచ్చే మూడు సంవత్సరాలలో దశలవారిగా ఈ వర్శిటీలను వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తారు. కేంద్ర మంత్రి మండలి సమావేశంలో వర్శిటీల వ్యయ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఆ తరువాత విలేకరులకు ఈ విషయం తెలిపారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల చట్టం 2009 పరిధిలో బీహార్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, ఒడిషా, కేరళ, రాజస్థాన్, తమిళనాడులలో వీటిని ఏర్పాటు చేస్తారని మంత్రి వివరించారు. జమ్మూ కశ్మీర్‌లో రెండు సెంట్రల్ వర్శిటీలు ఏర్పాటు అవుతాయి. మిగిలిన రాష్ట్రాలలో ఒక్కొక్కటి చొప్పున నెలకొంటాయి. 36 నెలల నిర్ణీత కాల గడువులో క్యాంపస్‌ల పూర్తికి చర్యలు తీసుకుంటారని, ఇందుకు అవసరం అయిన మొత్తానికి కేంద్రం ఆమోదం తెలిపినట్లు మంత్రి వివరించారు. నిర్వహణ వ్యయం, అవసరమైన మౌలిక సాధనాసంపత్తికి ఈ మొత్తం వెచ్చిస్తారు. విద్యాలయాల సంఖ్యలో ఇప్పటివరకూ ఉన్న ప్రాంతీయ అసమతుల్యతలను తగ్గించేందకు కొత్తగా చేపట్టిన వర్శిటీల ఏర్పాటు ప్రక్రియ దోహదం చేస్తుందని మంత్రి తెలిపారు.

ధోని ఎంత కీలక ఆటగాడో తన బ్యాట్‌తో నిరూపించాడు. రెండో వన్డేలో జట్టు విజయంలో అతనిదే కీలక పాత్ర. ధోని ఆడకుంటే విజయం దక్కేది కాదు. రానున్న రోజుల్లో కూడా ఇదే జోరును కొనసాగిస్తాడని ఆశిస్తున్నా.

– కెప్టెన్ విరాట్ కోహ్లి

అండర్సన్ ఇంటికి

ఫెదరర్, కెర్బర్ ముందుకు, ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ నుంచి అగ్ర శ్రేణి ఆటగాడు కెవిన్ అండర్సన్ (సౌతాఫ్రికా) రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్లు రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్), కరోలినా వోజ్నియాకి (డెన్మార్) రెండో రౌండ్‌లో విజయం సాధించారు. స్టార్ ఆటగాళ్లు రఫెల్ నాదల్ (స్పెయిన్), మారిన్ సిలిక్ (క్రొయేషియా), గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) మూడో రౌండ్‌కు చేరుకున్నారు. మహిళల విభాగంలో రెండో సీడ్ అంజెలిక్ కెర్బర్ (జర్మనీ), 8వ సీడ్ పెట్రా క్విటోవా (చెక్), మారియా షరపోవా (రష్యా) ముందంజ వేశారు. ఇక, పరుషుల సింగిల్స్‌లో ఐదో సీడ్ అండర్సన్‌కు చుక్కెదురైంది. అమెరికా ఆటగాడు ఫ్రాన్సెస్ టియా ఫొయె 4–6, 6–4, 6–4, 7–5 తేడాతో అండర్సన్‌పై సంచలన విజయం సాధించాడు. తొలి సెట్‌లో ఓటమి పాలైన ఫ్రాన్సెస్ తర్వాత వరుసగా మూడు సెట్లలో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక, రెండో సీడ్ రఫెల్ నాదల్ అలవోక విజయంతో మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. సౌతాఫ్రికా ఆటగాడు మాథ్యూ ఎడ్బన్‌తో జరిగిన రెండో రౌండ్‌లో నాదల్ 6–3, 6–2, 6–2 తేడాతో జయకేతనం ఎగుర వేశాడు. మరోవైపు మూడో సీడ్, ప్రస్తుత చాంపియన్ రోజర్ ఫెదరర్ కూడా రెండో రౌండ్‌లో సునాయాస విజయం సాధించాడు. యునైటెడ్ కింగ్‌డమ్ ఆటగాడు ఎవాన్స్‌తో జరిగిన పోరులో ఫెదరర్ జయభేరి మోగించాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన ఫెదరర్ 7–6, 7–6, 6–3తో విజయం సాధించాడు. ఇక, ఆరో సీడ్ మారిన్ సిలిక్ కాస్త చెమటోడ్చాడు. నాలుగు సెట్ల సమరంలో సిలిక్ 7–5, 6–7, 6–4, 6–4 తేడాతో అమెరికా ఆటగాడు డొనాల్డ్‌ను ఓడించాడు. డొనాల్డ్ చివరి వరకు గట్టిగా పోరాడినా ఫలితం లేకుండా పోయింది. మరో పోటీలో దిమిత్రోవ్ 6–3, 6–7, 6–3, 7–5 తేడాతో అర్జెంటీనా స్టార్ క్యావాస్‌పై విజయం సాధించాడు.



కెర్బర్ అలవోకగా

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ అంజెలిక్ కెర్బర్ 6–2, 6–3 తేడాతో బ్రెజిల్ క్రీడాకారిణి బెర్టిజ్ మైయాను ఓడించింది. ప్రారంభం నుంచే చెలరేగి ఆడిన కెర్బర్ ఏ దశలోనూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. మరో పోటీలో డిఫెండింగ్ చాంపియన్ వోజ్నియాకి 6–1, 6–3 తేడాతో జొహానా లార్సన్ (స్వీడన్)పై విజయం సాధించింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన వోజ్నియాకి అలవోక విజయంతో మూడో రౌండ్‌లో ప్రవేశించింది. మరో పోటీలో క్విటోవా 6–1, 6–3తో రొమేనియా క్రీడాకారిణి ఇనినా బెగును చిత్తు చేసింది. 30వ సీడ్ మారియా షరపోవా (రష్యా) 6–2, 6–1తో రెబకా పీటర్సన్ (స్వీడన్)ను ఓడించింది.



చరిత్ర సృష్టించిన గుకేష్

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే రెండో అత్యంత పిన్న గ్రాండ్ మాస్టర్‌గా భారత చెస్ ఆటగాడు గుకేష్ దొమ్మరాజు చరిత్ర సృష్టించాడు. రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ఓ అంతర్జాతీయ చెస్ టోర్నీలో పాల్గొంటున్న గుకేష్ గ్రాండ్ మాస్టర్ హోదాను దక్కించుకున్నాడు. 12 ఏళ్ల ఏడు నెలల వయసులో గ్రాండ్ మాస్టర్ హోదాను దక్కించుకోవడం ద్వారా ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయసు క్రీడాకారుడిగా నిలిచాడు. ప్రపంచంలో రష్యా ఆటగాడు సెర్గి కర్జాకిన్ మాత్రమే గుకేష్ కంటే పిన్న వయసులో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించాడు. సెర్గి కర్జాకిన్ 17 రోజుల తక్కువ వయసులో ఈ ఘనత దక్కించుకున్నాడు. గ్రాండ్ మాస్టర్ హోదా కోసం జరిగిన పోరులో గుకేష్ అసాధారణ ప్రతిభను కనబరిచాడు. ఈ క్రమంలో ఐదు పాయింట్లకు గాను 4.5 పాయింట్లు సాధించి గ్రాండ్ మాస్టర్ హోదాను సొంతం చేసుకున్నాడు.

గుండె పోటుతో క్రికెటర్ మృతి



కోల్‌కతా: మ్యాచ్ కోసం ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో గుండె పోటు రావడంతో ఓ యువ క్రికెటర్ ఆకస్మికంగా మృతి చెందిన ఘటన కోల్‌కతా నగరంలో చోటు చేసుకుంది. స్థానిక పైక్‌పారా స్పోర్ట్స్ క్లబ్ క్రికెటర్ అనికెత్ శర్మ (21) మంగళవారం ప్రాక్టీస్ చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. ఛాతిలో నొప్పి అంటూ అనికెత్ మైదానంలోనే కుప్పకూలిపోయాడు. దీంతో సహచర క్రికెటర్లు అతన్ని సమీపంలో ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. దీంతో ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది. ఎంతో ప్రతిభావంతుడైన క్రికెటర్‌గా ఎదుగుతున్న శర్మ అకాల మరణం చెందడంపై బెంగాల్ క్రికెట్ సంఘం కార్యదర్శి అవిషేక్ దాల్మియా విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న శర్మ ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం దురదృష్ణకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

హార్దిక్, రాహుల్‌పై విచారణ షురూ



ముంబయి: వివాదాస్పద వ్యాఖ్యలతో సస్పెన్షన్‌కు గురైన భారత యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, లోకేశ్ రాహుల్‌లపై విచారణ ప్రారంభమైంది. బిసిసిఐ సిఇఓ రాహుల్ జోహ్రి ముందు వీరిద్దరూ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాము చేసిన వ్యాఖ్యలపై వారు వివరణ ఇచ్చుకున్నారు. కాఫీ విత్ కరణ్ షోలో హార్దిక్, రాహుల్‌లు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై పెద్ద దుమారం లేపింది. దీంతో బిసిసిఐ ఇద్దరిపై వేటు వేసింది. అంతేగాక విచారణకు హాజరు కావాలని షోకాజ్ నోటీసు కూడా జారీ చేసింది. నోటీసు అందుకున్న హార్దిక్, రాహుల్‌లు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాము చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ కోరినట్టు తెలిసింది. కాగా, వీరిద్దరిని విచారించిన జోహ్రి బిసిసిఐ పాలకుల కమిటీకి నివేదిక అందజేస్తారు.

ధోనిపై ప్రశంసల వర్షం



ముంబయి: ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తొలి వన్డేలో కూడా అర్ధ సెంచరీతో రాణించిన ధోని ఈసారి మరింత మెరుగ్గా ఆడాడు. చివరి వరకు అజేయంగా నిలిచి జట్టుకు చారిత్రక విజయాన్ని అందించాడు. ఈ ఇన్నింగ్స్‌తో తనపై విమర్శలు చేస్తున్న వారికి గట్టి సమాధానమే చెప్పాడు. తనలో ఇంకా చేవ తగ్గలేదని నిరూపించాడు. రానున్న రోజుల్ల జట్టుకు తన అవసరం ఎలాంటిదో చాటి చెప్పాడు. కాగా, ధోని ఇన్నింగ్స్‌పై పలువురు ప్రశంసలు కురిపించారు. మాజీ క్రికెటర్లు సెహ్వాగ్, గంభీర్, మంజ్రేకర్, గవాస్కర్ తదితరులు ధోని బ్యాటింగ్ తీరును కొనియాడారు. కెప్టెన్ విరాట్ కోహ్లి, సహచరుడు దినేశ్ కార్తీక్ సయితం ధోనిని పొగడ్తలతో ముంచెత్తారు. అభిమానులు కూడా సోషల్ మీడియా వేదికగా ధోనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

భారత్ ప్రతీకారం



కోహ్లి సెంచరీ | మార్ష్ శతకం వృథా | భువనేశ్వర్ మ్యాజిక్

రెండో వన్డేలో టీమిండియా ఘన విజయం



అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో సిరీస్‌ను 1–1తో సమం చేసింది. ఇరు జట్ల మధ్య చివరి మ్యాచ్ శుక్రవారం జరుగుతుంది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టింది. టాప్ ఆర్డర్, మిడిలార్డర్ రాణించడం, బౌలింగ్‌లో భువనేశ్వర్, షమి అద్భుత ప్రతిభను కనబరచడంతో భారత్‌కు విజయం దక్కింది. ఈ విజయంతో సిరీస్‌లో ఇరు జట్లు సమంగా నిలిచాయి. కెప్టెన్ విరాట్ కోహ్లి (104), మహేంద్ర సింగ్ ధోని 55 (నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 298 పరుగుల భారీ స్కోరును సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 49.2 ఓవర్లలోనే కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

శుభారంభం

భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన టీమిండియా ప్రారంభం నుంచే కుదురుగా ఆడింది. తొలి వన్డేలో విఫలమైన ఓపెనర్ శిఖర్ ధావన్ ఈసారి మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచాడు. రోహిత్‌తో కలిసి శుభారంభం అందించాడు. ఇద్దరు ఆస్ట్రేలియా బౌలర్లు సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ధాటిగా ఆడిన ధావన్ 28 బంతుల్లో ఐదు ఫోర్లతో 32 పరుగులు చేశాడు. అయితే కుదురుగా ఆడుతున్న అతన్ని బెహ్రెన్‌డ్రాఫ్ పెవిలియన్ పంపించాడు. దీంతో 47 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను మరో ఓపెనర్ రోహిత్ శర్మ తనపై వేసుకున్నాడు. అతనికి కెప్టెన్ విరాట్ కోహ్లి అండగా నిలిచాడు. ఇద్దరు ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను బౌండరీలుగా మలచుతూ స్కోరు వేగం తగ్గకుండా చూశారు. అయితే రెండు ఫోర్లు, మరో 2 సిక్సర్లతో 43 పరుగులు చేసిన రోహిత్‌ను స్టోయినిస్ ఔట్ చేశాడు.

కోహ్లి జోరు

ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను కెప్టెన్ కోహ్లి తనపై వేసుకున్నాడు. తొలుత అతనికి అంబటి రాయుడు అండగా నిలిచాడు. రాయుడు సహకారంతో కోహ్లి ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడి ప్రారంభించాడు. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా సింగిల్స్‌తో స్కోరును ముందుకు నడిపించాడు. రాయుడు కూడా సమన్వయంతో ఆడాడు. కానీ 36 బంతుల్లో రెండు ఫోర్లతో 24 పరుగులు చేసిన రాయుడును మాక్స్‌వెల్ వెనక్కి పంపాడు. దీంతో భారత్ 160 పరుగుల వద్ద మూడో వికెట్‌ను చేజార్చుకుంది. మరోవైపు ధోని అండతో కోహ్లి తన పోరాటాన్ని కొనసాగించాడు. ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. ఈ జోడీని విడగొట్టేందుకు ఆస్ట్రేలియా బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇటు ధోని, అటు కోహ్లి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ జట్టును సురక్షిత స్థితికి చేర్చారు. ఇదే సమయంలో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి తన ఖాతాలో 39వ వన్డే సెంచరీని జమచేసుకున్నాడు. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన కోహ్లి 112 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 104 పరుగులు చేసి రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు.

ధోని ఫినిషింగ్ టచ్

కోహ్లి ఔటైనా మిగతా లాంఛనాన్ని మహేంద్ర సింగ్ ధోని పూర్తి చేశాడు. అతనికి దినేష్ కార్తీక్ సహకారం అందించాడు. ఇద్దరు సమన్వయంతో ఆడుతూ మరో వికెట్ కోల్పోకుండానే జట్టును గెలిపించారు. చాలా కాలం తర్వాత ధోని చిరస్మరణీయ ఇన్నింగ్స్‌ను ఆడాడు. కోహ్లి ఔటైనా వెంటనే ధోని తన మార్క్ ఆటతో చెలరేగి పోయాడు. రెండు కళ్లు చెదిరే సిక్స్‌లతో మునుపటి ధోనిని తలపించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన ధోని 54 బంతుల్లో రెండు సిక్సర్లతో 55 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. మరోవైపు కార్తీక్ 14 బంతుల్లోనే రెండు ఫోర్లతో 25 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో భారత్ మరో నాలుగు బంతులు మిగిలివుండగానే జయకేతనం ఎగుర వేసింది.

షాన్‌మార్ష్ మెరుపులు

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ అరోన్ ఫించ్ మరోసారి నిరాశ పరిచాడు. ఆరు పరుగులు మాత్రమే చేసి భువనేశ్వర్ వేసిన చక్కని బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. మరో ఓపెనర్ అలెక్స్ కారే (18) కూడా నిరాశ పరిచాడు. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను స్టార్ ఆటగాడు షాన్ మార్ష్ తనపై వేసుకున్నాడు. అతనికి ఉస్మాన్ ఖ్వాజా, హ్యాండ్స్‌కొంబ్ అండగా నిలిచారు. ధాటిగా ఆడిన ఖ్వాజా మూడు ఫోర్లతో 21 పరుగులు చేశాడు. సమన్వయంతో ఆడిన హ్యాండ్స్‌కొంబ్ రెండు ఫోర్లతో 20 పరుగులు చేశాడు. మార్కొస్ స్టోయినిస్ కూడా మార్ష్‌కు అండగా నిలిచాడు. స్టోయినిస్ మూడు ఫోర్లతో 29 పరుగులు సాధించాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సీనియర్ ఆటగాడు మాక్స్‌వెల్‌తో కలిసి మార్ష్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇద్దరూ భారత బౌలర్లను హడలెత్తిస్తూ స్కోరును పరిగెత్తించారు. చారిత్రక ఇన్నింగ్స్ ఆడిన మార్ష్ 123 బంతుల్లో 11 ఫోర్లు, మూడు సిక్సర్లతో 131 పరుగులు చేశాడు. మరోవైపు కీలక ఇన్నింగ్స్‌తో అలరించిన మాక్స్‌వెల్ ఐదు ఫోర్లు, సిక్స్‌తో 48 పరుగులు సాధించాడు. కాగా, చెలరేగి ఆడుతున్న వీరిద్దరిని ఒకే ఓవర్‌లో ఔట్ చేసి భువనేశ్వర్ మళ్లీ భారత్‌కు పైచేయి అందించాడు. చివర్లో భువి, షమీలు పొదుపుగా బౌలింగ్ చేయడంతో ఆస్ట్రేలియా స్కోరు 298కే పరిమితమైంది. భారత బౌలర్లలో భువనేశ్వర్ నాలుగు, షమీ మూడు వికెట్లు పడగొట్టారు. కెరీర్‌లో తొలి వన్డే ఆడిన హైదరాబాది స్పీడ్‌స్టర్ మహ్మద్ సిరాజ్ పది ఓవర్లలో 75 పరుగులు ఇచ్చుకున్నాడు.



సెంచరీ హీరో మార్ష్

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విరాట్

స్కోరుబోర్డు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలెక్స్ కారే (సి) ధావన్ (బి) మహ్మద్ షమీ 18, అరోన్ ఫించ్ (బి) భువనేశ్వర్ 6, ఉస్మాన్ ఖ్వాజా రనౌట్ 21, షాన్ మార్ష్ (సి) జడేజా (బి) భువనేశ్వర్ 131, హ్యాండ్స్‌కొంబ్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 20, స్టోయినిస్ (సి) ధోని (బి) షమీ 29, గ్లెన్ మాక్స్‌వెల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 48, రిచర్డ్‌సన్ (సి) ధావన్ (బి) షమీ 2, నాథన్ లియాన్ నాటౌట్ 12, పీటర్ సిడిల్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 0, బెహ్రెన్‌డ్రాఫ్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు 10, మొత్తం 50 ఓవర్లలో 298/9.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 10–0–45–4, మహ్మద్ షమీ 10–0–58–3, మహ్మద్ సిరాజ్ 10–0–76–0, కుల్దీప్ యాదవ్ 10–0–66–0, రవీంద్ర జడేజా 10–1–49–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) హ్యాండ్స్‌కొంబ్ (బి) పీటర్ సిడిల్ 43, శిఖర్ ధావన్ (సి) ఖ్వాజా (బి) బెహ్రెన్‌డ్రాఫ్ 32, విరాట్ కోహ్లి (సి) మాక్స్‌వెల్ (బి) రిచర్డ్‌సన్ 104, అంబటి రాయుడు (సి) స్టోయినస్ (బి) మాక్స్‌వెల్ 24, ధోని నాటౌట్ 55, దినేశ్ కార్తీక్ నాటౌట్ 25, ఎక్స్‌ట్రాలు 16, మొత్తం 49.2 ఓవర్లలో 299/4.

బౌలింగ్: జాసన్ బెహ్రెన్‌డ్రాఫ్ 8.2–1–52–1, రిచర్డ్‌సన్ 10–0–59–1, పీటర్ సిడిల్ 8–0–58–0, లియాన్ 10–0–59–0, స్టోయినిస్ 9–0–46–1, మాక్స్‌వెల్ 4–0–16–1.

సైనిక దినోత్సవం సందర్భంగా రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం 'యూరీ.. సర్జికల్ స్ట్రైక్' సినీ బృందాన్ని కలుసుకున్నారు. సైన్యాధ్యక్షుడు బిపిన్ రావత్ ఏర్పాటు చేసిన 'ఎట్ హోం' కార్యక్రమానికి సినీనటులు విక్కీ కౌశల్, యామీ గౌతం, డైరెక్టర్ ఆదిత్య ధార్, నిర్మాత రోనీ స్క్రూవాలా హాజరయ్యారు. ఆ సినిమా పై వచ్చిన ప్రశంసల గురించి తెలుసుకున్నానని చెబుతూ రక్షణ మంత్రి చిత్ర బృందాన్ని ట్విటర్ ద్వారా అభినందించారు.

విశాల

సర్కారు చదువులు చట్టుబండలే!

రెండో తరగతి పాఠం కూడా చదవలేని 8వ తరగతి విద్యార్థులు • సగం మందికి కూడికలు, తీసివేతలు కూడా రావు
• అందుకే తగ్గుతున్న బడికి వెళ్లని పిల్లల శాతం • స్కూళ్లలో మెరుగుపడుతున్న మౌలిక సదుపాయాలు • ఎఎస్ఇఆర్ 2018 నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: గ్రామాల్లోని సర్కారు బడుల్లో చదువుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిదనే మాట ఇప్పటిది కాదు. ఇది ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి. ప్రభుత్వాలు ప్రైవేటు పాఠశాలలప్రోత్సహిస్తూ, ప్రభుత్వ పాఠశాలల పట్ల శ్రద్ధ చూపడం మాని వేసినప్పటినుంచి వాటి దుస్థితి అదే. 'నా నాటికి తీసికట్టు నాగం భొట్లు ..'అన్న సామెతను నిజం చేస్తూ సర్కారు బడుల ప్రమాణాలు ఏడాదికేడాది దిగజారుతూనే ఉన్నాయి. సర్కారు బడుల్లో ఎనిమిదో తరగతి చదివే పిల్లల్లో ప్రతి నలుగురిలో ఒకరికి మాత్రమే రెండో తరగతి పాఠాలు చదవడం వచ్చట. అలాగే ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో ప్రతి ఇద్దరిలో ఒక్కరికి మాత్రమే కూడికలు, తీసివేతలు లాంటి మౌలిక లెక్కలు చేసే తెలివి తేటలు ఉన్నాయట! ఈ మాట ఎవరో చెప్పింది కాదు. దేశంలో విద్యారంగం వార్షిక స్థాయి నివేదిక (ఎఎస్ఇఆర్)2018 వెల్లడించిన వివరాలు ఇవి. దేశవ్యాప్తంగా 596 గ్రామీణ జిల్లాల్లో 3.5 లక్షల కుటుంబాలు, 5,46,527 మంది మూడునుంచి 16 ఏళ్ల మధ్య వయసు పిల్లలను సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. 'ప్రథమ్' అనే స్వచ్ఛంద సంస్థ ఈసర్వేను నిర్వహించింది.

గత అయిదారేళ్ల కాలంలో గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిలో కొద్దిపాటి మెరుగుదల ఉన్నప్పటికీ ఫలితాల విషయంలో దేశ విద్యారంగం దుస్థితిలో పెద్ద మార్పు లేదని ఈ నివేదికను బట్టి స్పష్టమవుతోంది. మెరుగుదలల విషయానికి వస్తే రెండో తరగతి పాఠం చదవగల మూడో తరగతి విద్యార్థుల శాతం గత అయిదారేళ్ల కాలంలో కాస్త మెరుగయింది. 2013లో ఈ శాతం 21.6 శాతంగా ఉండగా 2018లో అది 27.2



శాతానికి పెరిగింది. అయితే ఈ మెరుగుదల ఒక విధంగా మన విద్యాలయాల్లో విద్యార్థుల స్థాయి ఎంత నాసిగా ఉందో ఎత్తి చూపుతోందని ఆ నివేదిక అభిప్రాయపడింది. అయిదో తరగతి చదివే పిల్లల్లో సగం మంది మాత్రమే రెండో తరగతి పాఠాలు చదవగలుగుతున్నారంటే ఇంతకన్నా దౌర్భాగ్యం ఏముంటుంది? 2016లో ఇది 47.9 శాతంగా ఉంటే 2018లో అది 50.3 శాతానికి పెరిగింది. హిమాచల్‌ప్రదేశ్ యుపి, ఒడిశా, చత్తీస్‌గఢ్, కర్నాటక, కేరళ, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగుపడ్డమే ఈ పెరుగుదలకు కారణమని ఆ సర్వే తెలిపింది. గ్రామీణ జిల్లాల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 73 శాతం మందికి మాత్రమే రెండో తరగతి పాఠాలు చదవడం వచ్చట. లెక్కల విషయానికి వచ్చే సరికి ఇది మరింత తగ్గింది. కూడికలు, తీసివేతలు లాంటి బేసిక్ లెక్కలు చేయగలిగిన వారు 56 శాతమే ఉన్నారు.

కాగా ఈ నివేదికలో సంతోషించదగ్గ విషయం ఏమిటంటే బడికి వెళ్లకుండా ఉండే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గింది. మొట్టమొదటి సారి ఈ శాతం 3 శాతానికన్నా తక్కువకు (వాస్తవానికి 2.8 శాతానికి) పడిపోయింది. బాలికలు, బాలలు అనే తేడా లేకుండా అన్ని వయసు పిల్లల్లోను ఈ మెరుగుదల కనిపించడం సంతోషించదగ్గ విషయం. ఉదాహరణకు 11నుంచి 14 ఏళ్ల లోపు బాలికల్లో బడికి వెళ్లని వారి సంఖ్య 2016లో 10.3 శాతం ఉంటే 2018లో అది 4.1 శాతానికి పడిపోయింది. అలాగే 2008లో 15 –16 వయసు బాలికల్లో బడికి వెళ్లని వారు 20 శాతంగా ఉండగా ఇప్పుడు అది 13.5 శాతానికి తగ్గింది. బాలికలు బడికి వచ్చేలా చేసేందుకు రాష్ట్రాలు తీసుకున్న అనేక చర్యలే దీనికి కారణమని ఆ నివేదిక పేర్కొంది. చాలా రాష్ట్రాల్లో హైస్కూలు విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు ఇస్తున్నారు. అలాగే పాఠశాలల్లో మౌలిక వసతులు ముఖ్యంగా బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణం లాంటివి కల్పించడంపై దృష్టి పెట్టాయి, ఫలితంగా స్కూళ్లలో బాలికలు ఉపయోగించే టాయిలెట్ల సంఖ్య 2010–2018 మధ్య కాలంలో రెట్టింపు అయ్యాయి. అదే విధంగా గ్రామాల్లో ప్రైవేటు పాఠశాల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరక్క పోవడం మరో సంతోషించదగ్గ పరిణామమని, ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మెరుగుపడుతోందనడానికి ఇది నిదర్శనమని ఈ నివేదిక పేర్కొంది. ప్రైవేటు స్కూళ్లలో చేరే పిల్లల సంఖ్య 2016లో 30.6 శాతంగా ఉండగా, 2018లో సైతం దాదాపు అంతేశాతం (30.9)గా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే టీచర్ల కర్తవ్య నిష్ఠ పెంచడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటే తప్ప ఈ విద్యాసంస్థల ప్రమాణాలు మెరుగుపడడం కష్టమనే విషయాన్ని పాలకులు ఇప్పటికయినా గ్రహిస్తే ప్రభుత్వ పాఠశాలలు బాగుపడతాయని ఆ నివేదిక హెచ్చరించింది.

మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

న్యూఢిల్లీ: భారతదేశానికున్న గొప్ప శక్తి ప్రజాస్వామ్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని రక్షించుకోవాలనీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బుధవారం చెప్పారు. మన పార్లమెంట్ సమావేశాల్లో జరిగే వాదోపవాదాలపై ఆఫ్ఘన్ చట్టసభ సభ్యుడు చేసిన కామెంట్‌ను ఉదహరిస్తూ రాహుల్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు ఒక రోజు ఆఫ్ఘనిస్థాన్ పార్లమెంట్ సభ్యులు గ్యాలరీలో కూచుని ఉన్నారు. మన సమావేశాల్ని చూడ్డానికి వాళ్లు ఆ దేశం నుంచి వచ్చారు. మనమిక్కడ అరుచుకుంటున్నాం. కేకలు పెడుతున్నాం. కనీసం వాళ్లున్నప్పుడైనా మనం పద్ధతిగా ఉండలేమా?' అని రాహుల్ ప్రశ్నించారు. ఆఫ్ఘన్ ఎంపీలు నా ఆఫీసుకు వచ్చారు. వారిలో ఒకామె ఏడుపు మొదలుపెట్టింది. నేను ఆశ్చర్యపోయాను. ఏమైందని అడిగాను. మీరు పార్లమెంటులో వాదించుకుంటున్నారు. అదే మా దేశంలో అయితే తుపాకులతోనే జవాబిచ్చేవాళ్లు...అని ఆమె చెప్పారు. మన పార్లమెంటులో జరిగిన రభసకు నేను వాళ్లకు క్షమాపణ చెప్పాను. వేరే వాళ్లున్నప్పుడైనా మనం హుందాగా ప్రవర్తించాలి' అని రాహుల్ పేర్కొన్నారు.



మోడీని కలిసిన అనిల్‌కపూర్



జైపూర్ : న్యూఢిల్లీ: బాలీవుడ్ అనిల్ కపూర్ బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలుసుకున్నారు. ట్విటర్‌ద్వారా ఈ సమాచారాన్ని అందిస్తూ అనిల్‌కపూర్...'ప్రధాని మోడీని కలుసుకునే అవకాశం కలిగింది. మా సంభాషణలు నాకెంతో ప్రేరణనిచ్చాయి. ఆయన చరిష్మా, దృక్పథం ఆకట్టుకుంటాయి. వ్యక్తిగతంగా ఆయనను కలుసుకోవడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను' అని కపూర్ పేర్కొన్నారు. ప్రధానితో కలిసి తీసుకున్న ఫోటోను కూడా అనిల్‌కపూర్ ట్వీట్ చేశారు. నటుడిగా అనిల్ తదుపరి చిత్రం... 'ఏక్ లడకీకో దేఖా తో ఐసా లగా'. ఈ మూవీలో ఆయన కూతురు సోనం కపూర్‌తో నటిస్తున్నారు.



మా అత్త కొట్టింది

• క్రరతో చితకబాది ఇంట్లో నుంచి గెంటేశారు
• అయప్పను దర్శించుకున్న కనకదుర్గ ఆరోపణ

తిరువనంతపురం : దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్న ఆచారానికి తెరదించుతూ శబరిమలలోని అయ్యప్ప సన్నిధిలో అడుగుపెట్టిన 39ఏళ్ల మహిళ కనకదుర్గకు సొంత ఇంట్లో చేదు అనుభ వం ఎదురైంది. అయ్యప్పను దర్శించుకున్న రెం డు వారాల తర్వాత అంటే మంగళవారంనాడు ఉదయం సొంతింటిలో అడుగుపెట్టిన తనపై అత్త దాడి చేసిందని, క్రర తీసుకొని చితకబాదిందని ఆరోపించింది. ఇప్పుడు గాయాలతో తాను ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు వెల్లడించింది. 'ఉదయం ఇంటికి వెళ్లి డోర్ కొట్టాను. అవతలి నుంచి మా అత్తగారు ఎవరూ..? అని ప్రశ్నించింది. నేనే అత్తమ్మ కనకదుర్గను అని సమాధానమిచ్చాను. వంటింట్లో ఉండే ఓ క్రరను తీసుకుని వచ్చి తలుపు తీస్తూనే నన్ను కొట్టడం ప్రారంభించింది. నేను అలాగే నిల్చుండిపోయా ను. ఇన్ని రోజులు ఎంతమందితో పడుకొని వచ్చావు అని బూతులు తిడుతూ కొడుతూనే ఉంది. అందుకు నా భర్త కూడా సహకరించారు. మా పరువు తీసిన నువ్వు ఇక ఎంత మాత్రం ఇంట్లో ఉండడానికి వీల్లేదు అని గెంటేశారు. వాళ్ల దెబ్బల కారణంగా నా తలపై తీవ్రమైన గాయాలయ్యాయి. ఇప్పుడు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాను. నడవలేకపోతున్నాను' అని ప్రభుత్వ ఉద్యోగి అయిన కనకదుర్గ మీడియాతో వాపోయింది. 10 నుంచి 12 సార్లు నాపై క్రర తో దాడి చేశారని, దెబ్బలకు తట్టుకోలేక నిలబడలేని తాను కిందపడిపోయానని చెప్పుకొచ్చింది. తనపై దాడి చేసిన అత్తింటి వారిపై కేసు నమో దు చేయించానని కనకదుర్గ వివరించారు. 40 ఏళ్ల బిందు అమ్మినితో కలిసి కనకదుర్గ ఈ నెల 2వ తేదీన అయ్యప్ప గుడిలోకి ప్రవేశించి దర్శ నం చేసుకుంది. ద్వారా యావత్ కేరళతోపాటు దేశం దృష్టిని ఆకర్షించింది. అప్పటి నుంచి వ్యతిరేకుల నుంచి దాడుల ప్రమాదం పొంచివుండడంతో పోలీసు రక్షణలో ఇన్ని రోజులు గుర్తు తెలియని ప్రాంతాల్లో గడిపిన కనకదుర్గ మంగళవారంనాడు తన అత్తవారింటికి వెళ్లింది. కనకదుర్గ, బిందు అమ్మిని అయ్యప్పను దర్శించుకున్నప్పటి నుంచి శబరిమల అట్టుడుకిపోతోంది. ముఖ్యంగా హిందూ సంస్థలు ఆమెపై దాడికి తెగబడతామని కూడా హెచ్చరికలు జారీ చేశాయి.

శబరిమల వద్ద మళ్లీ ఉద్రిక్తత
ఆలయ ప్రవేశానికి ఇద్దరు మహిళల యత్నం

శబరిమల: స్వామి అయ్యప్పను దర్శనం చేసుకునేందుకు మరో ఇద్దరు మహిళలు ప్రయత్నించడంతో శబరిమల ఆలయ సమీపంలో బుధవారం మళ్లీ నిరసనలు పెల్లుబికాయి. 50 ఏళ్ల లోపు వయసుగల ఇద్దరు మహిళలు పంప బేస్ క్యాంప్ నుంచి ఆలయం వైపు బయల్దేరడంతో నిరసనకారులు వారిని చుట్టుముట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆ మహిళలను తమ వాహనంలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. తొమ్మిదిమంది మహిళల బృందంలో వీరిద్దరూ సభ్యులని తెలుస్తోంది. అయితే మిగిలిన ఏడుగురు మహిళలను కూడా నిరసనకారులు పంబ బేస్ క్యాంప్ వద్దనే అడ్డుకున్నారు. అయితే తాము 41 రోజుల మండల దీక్ష స్వీకరించామని, అయ్యప్ప దర్శనం చేసుకోకుండా వెనుదిరిగే ప్రసక్తే లేదని వారు ప్రతిఘటించినట్లు తెలుస్తోంది.

జాబిలిపై పత్తి మొక్క



• ప్రత్యేక బకెట్‌లో విత్తనాలు
• చైనా చాంగ్ ఇ–4 ప్రయోగంలో మరో విజయం



చంద్రుని అవతలవైపు దిగిన చాంగ్ ఇ–4 వ్యోమనౌక లోని బకెట్ వంటి కేన్‌లో పత్తి విత్తనాలు మొలకెత్తడం ప్రారంభించాయి. చంద్రుని అవతల చీకటి ప్రదేశం లోకి చాంగ్ ఇ–4 వ్యోమనౌక జనవరి 3 న దిగింది. ఇది ఏడు అంగుళాల పొడవున్న బకెట్ వంటి పాత్రను మోసుకొచ్చింది. ఆ పాత్రలో గాలి, నీరు, మట్టి, బంగాళాదుంపలు, పత్తి, ఆవాలు వంటి విత్తనాలు ఉన్నాయి. అయితే వీటన్నిటిలో పత్తి విత్తనాలు మొలకెత్తుతున్నాయని చైనా ప్రభుత్వ టెలివిజన్ నెట్‌వర్క్ ట్వీట్ చేసింది. అంతరిక్షంలో మొక్కలను పెంచే గత ప్రయోగాలు కృత్రిమ శాటిలైట్లకే పరిమితం అయ్యాయి. ఈ శాటిలైట్లు భూమి దిగువ వాతావరణంలో కక్ష్యలో పరిభ్రమిస్తుంటాయి. అయితే ఇప్పుడు చంద్రుని ఉపరితలంపై ఇలాంటి ప్రయోగాలు చేస్తున్న మొదటి దేశం చైనాయే. చాంగ్ ఇ–4 వ్యోమనౌక పరిశోధనలో ఎన్నో లక్ష్యాలు ఇమిడి ఉన్నాయి. ఖగోళ పరిశోధనలతోపాటు చంద్రుని ఉపరితలం, ఖనిజసమ్మేళనం, సర్వేచేయడం తదితర కార్యక్రమాలు నిర్వర్తించ వలసి ఉంది. దీంతోపాటు చంద్రుని వాతావరణ తత్వం తెలుసుకోడానికి న్యూట్రాన్ రేడియో ధార్మికతను గణించ వలసి ఉంటుంది. మొక్కలు, కీటకాలు పరస్పరం సహకారంతో జీవించేలా చిన్నపాటి జీవవైవిధ్య వాతావరణాన్ని కూడా సృష్టించ వలసి ఉంది. దీని కోసం చైనా మొదట పట్టుపురుగులను తీసుకెళ్లాలని ప్లాను చేసింది. కానీ తరువాత పండ్ల ఈగలను తీసుకెళ్లాలని నిర్ణయించింది. తీసుకెళ్లిన డబ్బాలో మొక్కలు కిరణజన్య సంయోగక్రియ జరుపుకోడానికి వీలుగా డబ్బా లో గొట్టాం ద్వారా సూర్యకిరణం పడేలా డబ్బాకు గొట్టాం అమర్చినట్టు చోంగ్‌క్వింగ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు చెప్పారు. పెరుగుతుండే మొక్కలు ఆక్సిజనును విడుదల చేస్తాయని పర్యావరణాన్ని సృష్టిస్తాయని చెప్పారు. మినీబయోస్పియర్ (చిన్నపాటి జీవ వైవిధ్య వాతావరణ గోళం)లో కీటకాలు, మొక్కలు వృద్ధి చెందడానికి వీలుగా ఉష్ణోగ్రత, తేమ, పోషక విలువలను జాగ్రత్తగా నియంత్రించ వలసి ఉంటుందని తెలిపారు. చంద్రుని ఉష్ణోగ్రత మైనస్ 100 డిగ్రీల నుంచి 100 డిగ్రీల మధ్య మారుతూ ఉంటుందని, ఉపరితల గురుత్వాకర్షణ శక్తి భూమి గురుత్వాకర్షణ శక్తిలో ఆరో వంతు ఉంటుందని, పర్యావరణం సుస్థిరంగా ఉండడానికి ఈ పరిస్థితులు ప్రధాన సవాళ్లుగా నిలుస్తాయని శాస్త్రవేత్తలు వివరించారు. ప్రయోగాల పురోగతిని త్వరలో బ్రాడ్‌కాస్ట్ చేయాలన్న ఆశాభావంతో పరిశోధక బృందం ఉంది.

ఇదివరకటి ప్రయోగాలు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వంటి శాటిలైట్లలో అనేక రకాల మొక్కలను ఇదివరకు వ్యోమగాములు పెంచ గలిగారు. ఆకుకకూరలు, సూర్యాకాంతం వంటి పుష్పాలను వీరు పెంచ గలిగారు. అమెరికా పరిశోధన సంస్థ నాసా చంద్రుని ఉపరితలంపై మొక్కలు పెంచుతామని 2013 లో ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు నాసా ఏమీ చేయలేక పోయింది. మొక్కలు 14 రోజుల పాటు బతక గలిగితే చంద్రుని రేడియో ధార్మికత వాతావరణంలో మొక్కలను మొలకెత్తేలా చేస్తామని ప్రకటించింది. 60 రోజుల వరకు మనగలిగితే చంద్రుని వాతావరణంలో లైంగిక ప్రత్యుత్పత్తి సంభవమవుతుంది. 180 రోజుల పాటు మనగలిగితే రేడియేషన్ ప్రభావం జన్యు వ్యూహాలపై పడుతుంది. తరువాత కొన్నినెలల పాటు అనేక ప్రయోగాలు సాగించి శాస్త్రీయ ఫలితాలు రాబట్టడం జరుగుతుందని నాసా ప్రకటించింది. మానవ సహిత అంతరిక్ష యాత్రల కోసం చైతన్య వంతమైన అంతరిక్ష వాతావరణంలో మొక్కలను పెంచడానికి నాసా ప్రయత్నిస్తోంది. దీని ఉద్దేశ్యం మొక్కలు పెరగడానికి కావలసిన మట్టి అవసరాన్ని తగ్గించ గలగడమే. దానికి బదులుగా హైడ్రోపోనిక్స్, ఎయిరోపోనిక్స్ వంటి పద్ధతులను అనుసరిస్తుంది. 2010 లో ఆరిజోనా యూనివర్శిటీ పరిశోధకులు లూనార్ గ్రీన్ హౌస్ (చంద్రుని హరిత గృహం) అనే ప్రయోగం చేశారు. ఇది చంద్రునిపై కానీ లేదా అంగారకునిపై కానీ మొక్కలను పెంచడానికి ఉపయోగపడుతుంది. ఈ గ్రీన్‌హౌస్‌కు 18 అడుగుల పొడవాటి గొట్టాం కావాలి. అలాగే కావలసిన నియంత్రణలు ఉండాలి. కాస్మిక్ కిరణాలు లేదా సౌరజ్వాలల ప్రభావం పడకుండా ఉండడానికి ఈ గ్రీన్‌హౌస్‌ను భూమిలో పూడ్చి పెట్టవలసి ఉంటుంది. ఇది స్వతంత్రంగా పనిచేస్తుందని పరిశోధకులు చెప్పారు. వ్యోమగాములు ఊపిరి బట్టి విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్ ఒత్తిడి ఉన్న ట్యాంకుల్లోకి చేరుతుంది. మూత్రం నుంచి నీరు వస్తుంది. ఫైబర్ ఆప్టికల్ కేబుల్స్ ద్వారా సూర్యరశ్మి లభిస్తుంది. – సైన్స్ విభాగం

ప్రశాంత్‌ను పార్టీలో చేర్చుకోమన్నది అమిత్ షానే



పాట్నా : ఎన్నికల వ్యూహకర్తగా మంచిపేరున్న ప్రశాంత్ కిషోర్‌ను జెడి(యు)లోకి తీసుకోవాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రెండుసార్లు తనకు సూచించినట్టు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తెలిపారు. పాట్నాలో ఓ ప్రైవేటు ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నితీశ్ ఈ విషయాన్ని వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రశాంత్ కిషోర్ జెడియులో చేరారు. అనంతరం ఆయనకు పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు.ప్రశాంత్ కిషోర్‌ను పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిని చేయడం ద్వారా మీ రాజకీయ వారసుడిగా ఆయనను చూస్తున్నారా అని అడిగిన ఓ ప్రశ్నకు నితీశ్ సమాధానమిచ్చారు. ఆయన మాకేమీ కొత్త కాదు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో మాతో కలిసి పనిచేశారు. కొద్దికాలం ఆయన వేరే పనులతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్ కిషోర్‌ను జెడియులో చేర్చుకోవాలని కోరింది మరెవరో కాదు. అమిత్‌షానే. రెండు సార్లు నాకు ఈ సూచన చేశారు అని నితీశ్ చెప్పారు.

కుక్క పిల్లలను చంపిన నర్సింగ్ విద్యార్థినుల అరెస్ట్

కోల్‌కతా: కుక్క పిల్లలను అత్యంత కిరాతకంగా కొట్టి చంపిన ఇద్దరు నర్సింగ్ విద్యార్థినులను పోలీసులు అరెస్టు చేశారు. కోల్‌కతాలోని నీల్ రతన్ సర్కార్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్‌లోని మొదటి సంవత్సరం నర్సింగ్ చదువుతున్న మోతుషి మోండల్, ద్వితీయ సంవత్సరం చదువుతున్న షోమా బర్మన్ అనే ఇద్దరు విద్యార్థినులపై ఐపిసిలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆ ఇద్దరు విద్యార్థినులు కుక్క పిల్లలను చంపుతున్న దృశ్యాన్ని ఎదురుగా ఉన్న డాక్టర్ ఆర్ అహ్మద్ దంత కళాశాల, ఆస్పత్రికి చెందిన కొందరు విద్యార్థులు వీడియో తీసి అన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఎన్‌ఆర్‌ఎస్ కళాశాల సమీపంలోని చెత్త కుండీ వద్ద 16 కుక్క పిల్లల కళేబరాలు నింపిన బస్తాలు ఆదివారం లభించాయి. దీంతోపాటు బాగా గాయపడి ఒక మరో సంచిలో కట్టిపడేసిన మరో కుక్క కూడా లభించింది. ఈ దారుణ సంఘటనపై దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఆర్‌ఎస్ కళాశాల ఒక ముగ్గురు సభ్యుల కమిటీని నియమించింది. ఆ ఇద్దరు నర్సింగ్ విద్యార్థినులు తామే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు అంగీకరించారని పోలీసుల అధికారి ఒకరు చెప్పారు.

నాగేశ్వరరావు నియామకంపై విచారణకు 'సుప్రీం' ఓకే



న్యూఢిల్లీ: సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం నాగేశ్వరరావు నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై వచ్చే వారం విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు బుధవారం అంగీకరించింది. నాగేశ్వరరావును తాత్కాలిక డైరెక్టర్‌గా నియమిస్తూ జనవరి 10న కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సోమవారం సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైనంది. అలోక్ వర్మను సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలోని ఉన్నత స్థాయి కమిటీ కొత్త డైరెక్టర్ నియామకం జరిగేవరకు సిబిఐ అదనపు డైరెక్టర్‌గా ఉన్న నాగేశ్వరరావుకు తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పటిస్తూ ఆదేశాలు జారీచేసింది. కామన్ కాజ్ అనే ఎన్‌జిఓతోపాటు ఆర్‌టిఐ కార్యకర్త అంజలీ భరద్వాజ్ ఈ నియామకాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. సిబిఐ డైరెక్టర్ నియామకంలో పారదర్శకతను తీసుకురావడానికి నిర్దిష్టమైన విధానాలను రూపొందించాలని ఈ పిటిషన్‌లో వారు కోరారు.

సిబిఐ డైరెక్టర్ ఎంపికకు 24న కమిటీ భేటీ

న్యూఢిల్లీ : సిబిఐ నూతన డైరెక్టర్ ఎంపికపై ప్రధాని నేతృత్వపు ఉన్నత స్థాయి కమిటీ ఈ నెల 24వ తేదీన భేటీ అవుతుంది. ప్రధాని నరేంద్ర మోడీ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ఈ కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సిబిఐలో ప్రస్తుత వివాదాలు, న్యాయస్థానం తీర్పుల నేపథ్యంలో ఇప్పుడు ఈ దర్యాప్తు సంస్థకు పూర్తి స్థాయి సంచాలకులు నియామకం జరగలేదు. ఇప్పటివరకూ ఉన్న డైరెక్టర్‌గా ఉన్న అలోక్ వర్మ వివాదాస్పద పరిస్థితుల నడుమ ఈ నెల 31న పదవీ విరమణకు ముందే వైదొలగాల్సి వచ్చింది. తొలుత ఎంపిక కమిటీ ఈ నెల 21వ తేదీనే సమావేశం కావాలని అనుకుంది. అయితే దీనిని ఈ నెల 24 లేదా 25 తేదీలకు మార్చాలని మల్లిఖార్జున ఖర్గే సూచించారు. దీనితో ఈ నెల 24వ తేదీన ఎంపిక కమిటీ కీలక భేటీ జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు బుధవారం తెలిపాయి. విస్తృత స్థాయిలో పరస్పర సంప్రదింపుల తరువాత 24వ తేదీని ఖరారు చేసినట్లు , నూతన డైరెక్టర్ ఎంపికకు వీలేర్పడుతుందని వివరించారు. ప్రస్తుతం సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం నాగేశ్వర రావు వ్యవహరిస్తున్నారు. సిబిఐ వంటి కీలక దర్యాప్తు సంస్థకు పూర్తి స్థాయి డైరెక్టర్ నియామకం జరగకపోవడాన్ని కాంగ్రెస్ ఇతర ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శిస్తూ వస్తున్నాయి. ఈ దిశలో సత్వరం నిర్ణయం తీసుకోవల్సి ఉందని, ఎంపిక కమిటీ సమావేశం తొందరగా ఏర్పాటు చేయాలని ఇటీవలే కాంగ్రెస్ నేత ఖర్గే ప్రధాని మోడీకి ఒక లేఖ రాశారు.

విహెచ్‌పి మాజీ అధ్యక్షుడు దాల్మియా కన్నుమూత



న్యూఢిల్లీ: విశ్వ హిందూ పరిషద్ మాజీ అధ్యక్షుడు విష్ణు హరి దాల్మి యా బుధవారం ఇక్కడి తన నివాసంలో బుధవారం ఉదయం కన్నుమూశారు. 91 సంవత్సరాల దాల్మియా రామ జన్మభూమి ఉద్యమ సారథులలో ఒకరు. ప్రముఖ పారిశ్రామికవేత కూడా అయిన దాల్మియా అంత్యక్రియలు బుధవారం సాయంత్రం నిగమ్‌బోధ్ ఘాట్‌లో జరుగుతాయని విహెచ్‌పి ఒక ప్రకటనలో తెలిపింది. విష్ణు హరి దాల్మియా శ్రీరామ జన్మభూమి న్యాస్ ట్రస్టీయే కాక విహెచ్‌పికి చెందిన కేంద్రీయ మార్గదర్శక్ మండల్ సభ్యులు కూడా. రామజన్మభూమి ఉద్యమంలో ఆయన విహెచ్‌పి నాయకులు అశోక్ సింఘాల్, గిరిరాజ్ కిషోర్‌తోకలసి చురుకైన పాత్ర పోషించారు.

వివాదంలో 'శ్రీదేవి బంగళా'



కొచ్చి : "ఒరు ఆదార్ లవ్" అనే మలయాళ చిత్రంలోని పాటలో కన్ను గీటుతూ కుర్రకారు గుండెల్లో అలజడి సృష్టించిన ప్రియా ప్రకాశ్ వారియర్ తాజాగా మరో వివాదంలో చిక్కుకుంది. ఆమె నటిస్తున్న తాజా చిత్రం "శ్రీదేవి బంగళా" ట్రైలర్‌పై నెటిజన్ల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశాంత్ మంబుల్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై అభ్యంతరం తెలియచేస్తూ దివంగత సినీ నటి శ్రీదేవి భర్త బోనీకపూర్ ఇప్పటికే లీగల్ నోటీసు పంపించినట్లు వార్తలు రాగా ఇటీవలే విడుదలైన చిత్రం ట్రైలర్ శ్రీదేవి మరణం వెనుక ఏదో కుట్ర ఉందన్న సంకేతాన్ని ఇవ్వడం కూడా వివాదాస్పదమవుతోంది. ప్రియా వారియర్ ఒక పాపకు ఆటోగ్రాఫ్ ఇచ్చే దృశ్యంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. మీకిష్టమైన నటి ఎవరని ఆ పాప అడిగితే తానేనని ప్రియ చెబుతుంది. ఒక వెడ్డింగ్ పార్టీలో ప్రియ మద్యం తాగడం, స్విమ్మింగ్, జాగింగ్, స్మోక్ చేయడం వంటి దృశ్యాలు కూడా ఇందులో ఉన్నాయి. బాత్‌రూమ్ టబ్‌లో ఆమె పడిపోయిన దృశ్యం, నేపథ్యంలో ఆమె వేసే కేకతోపాటు సైరన్ శబ్దం రావడంతో ట్రైలర్ ముగుస్తుంది. 2018 ఫిబ్రవరి 24న శ్రీదేవి దుబాయ్‌లోని ఒక హోటల్ రూమ్‌లో బాత్‌టబ్‌లో మునిగిపోయి మరణించిన విషయం తెలిసిందే. శ్రీదేవి మరణంపై మొదట్లో చాలా వదంతులు వినవచ్చినప్పటికీ అక్కడి పోలీసులు దాన్ని ప్రమాదంగా ప్రకటించారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666